అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 01-02-2025
సంపుటి : 11 సంచిక : 32
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
16 పేజీలు వెల : 6.50

అదే ప్రసంగం.. మార్పేమీ లేదు



ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రస్తావన
జమిలీ, వక్ఫ్ బిల్లును
సాహసోపేత నిర్ణయాలుగా పేర్కొన్న
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
నేడు కేంద్ర బడ్జెట్

వివరాలు 16లో

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలువనుందని మోడీ సర్కార్ పదేపదే ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం వచ్చే రెండు దశాబ్దాల పాటు భారత్ స్థిరంగా 8 శాతం వృద్ధి రేటును నమోదు చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే తెలిపింది. ఈ లక్ష్యానికి భిన్నంగా ఏడు శాతం కంటే దిగువనే జీడీపీ నమోదు కానుందన్న అంచనాలతో తాను ఎంచుకున్న లక్ష్యానికి తూట్లు పొడుచుకున్నట్లయ్యింది.



గడ్డు కాలమే..

మందకొడిగా ఆర్థిక వ్యవస్థ

- జీడీపీ 6.4 శాతం లోపే
- ప్రయివేటు వినిమయం అంతంతే
- ధరలు తగ్గే అవకాశం లేదు : ఎకనామిక్ సర్వేలో మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ మందకొడిగా ఉందని ఆర్థిక సర్వేలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా పేర్కొన్నారు. ప్రయివేటు వినిమయం స్థిరంగా ఉందని చెప్పడం ద్వారా.. పురోగతి ఏమీ లేదని పరోక్షంగా స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం పార్లమెంట్‌లో ఎకనామిక్ సర్వే 2024-25ను మంత్రి సీతారామన్ ప్రవేశపెట్టారు. దేశ వృద్ధి రేటు మందకొడిగా ఉందని పేర్కొన్నారు. గతేడాది తయారీ రంగం నెమ్మదించిందన్నారు. దీనికి తోడు కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.4 శాతానికి పరిమితం కావొచ్చన్నారు. గత నాలుగేండ్లలో ఇదే అత్యల్పం కావడం విశేషం. 2023-24లో 8.2 శాతం, 2022-23లో 7.2 శాతం, 2021-22లో 8.7 శాతం చొప్పున వృద్ధి చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే 2025-26లో జీడీపీ 6.3-6.8 శాతంగా ఉండొచ్చని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు ఏకంగా 5.4 శాతానికి క్షీణించి.. దాదాపు రెండేండ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఇది ఆర్‌బీఐ అంచనా వేసిన 7 శాతం కంటే తక్కువ. రబీ పంట దిగుబడి బాగుంటే తప్పా 2026 ప్రథమార్థంలో ఆహార ధరలు తగ్గే అవకాశం లేదని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. ప్రస్తుత జనవరి - మార్చి త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చన్నారు. దీంతో ఇప్పటి వరకు దేశ ఆర్థిక వ్యవస్థలో హెచ్చు ధరలున్నాయని అంగీకరించినట్లయ్యింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ వినియోగం స్థిరంగానే ఉండొచ్చన్నారు. దీంతో ప్రజల ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉండొచ్చని ఆర్థిక సర్వే భావించింది. కాగా.. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తుందని పేర్కొంది.



స్టాక్ మార్కెట్లు మరింత పడొచ్చు..

"పారిశ్రామిక రంగం కూడా కరోనాకు ముందున్న స్థాయిలో రాణిస్తోంది. సేవల రంగం బలంగా ఉంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 5.4 శాతం నుంచి 2024-25 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 4.9 శాతానికి తగ్గింది. బ్యాంకింగ్, బీమా రంగం స్థిరంగా ఉంది. బ్యాంకింగ్‌లో 2024 సెప్టెంబర్ నాటికి ...15లో

ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

- జీడీపీ మరింత తగ్గొచ్చు
- చైనా వేగంగా ఎదుగుతోంది

మీడియాతో సీఈఏ అనంత నాగేశ్వరన్

వివరాలు 15లో

సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం

ట్రంప్ టారీఫ్‌ల ఊసే లేదు

లెక్కలేని రూపాయి పతనం..

- ఏఐపై విస్మరణ
- మరోవైపు పని గంటల పెంపు
- జీడీపీ పెరుగుదలకు చర్యలు శూన్యం
- ఎకనామిక్ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక స్థితికి అద్దం పట్టే అధికారిక వార్షిక నివేదిక ఎకనామిక్ సర్వేలో అనేక సవాళ్లను మోడీ సర్కార్ విస్మరించింది. అంతర్జాతీయంగా ట్రంప్ టారీఫ్‌ల పెంపు, ఎగుమతుల పతనం, వాణిజ్య లోటు సమస్యలకు పరిష్కారం చూపలేదు. మరోవైపు రికార్డ్ కనిష్టానికి పడిపోయిన రూపాయి విలువపై లెక్కలేని తనంగా వ్యవహరించింది. ఎకనామిక్ సర్వేలో ప్రధానంగా దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలను పొందుపర్చాలి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జరిగిన ప్రధాన మార్పులు, పరిణామాల్ని చెప్పి.. భవిష్యత్తు ప్రణాళికలు ఎలా ఉండాలో మార్గదర్శనం చేయాలి. ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరించాలి. విదేశీ భౌగోళిక, ఆర్థిక పరిణామాల ప్రభావం, ప్రభుత్వ విధాన నిర్ణయాలను విశ్లేషించాలి. దీని ఆధారంగానే ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూపకల్పన జరుగుతుంటుంది. కానీ దీనికి భిన్నంగా దిశానిర్దేశం లేని ఎకనామిక్ సర్వేను బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో అనేక సవాళ్లు, పరిష్కారాలకు నీళ్లు వదిలేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25లో జీడీపీ 6.4 శాతానికి పడిపోయి.. నాలుగేండ్ల కనిష్టానికి చేరొచ్చని అంచనా వేసిన ఆర్థిక సర్వే.. వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించలేదు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత భారత్‌పై సుంకాలను పెంచుతామని బహిరంగంగా ప్రకటించారు. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 87కు చేరువలో పతనమయ్యింది. ఎగుమతులు పతనం అవుతున్నాయి. వాణిజ్య లోటు పెరుగుతోంది. అనేక రంగాలు మౌలిక వసతుల సదుపాయాల కొరతను ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అసంఘటిత రంగం కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదల, మందగిస్తున్న పరిశ్రమల వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వ్యవసాయన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించే మార్గాలను ఆర్థిక సర్వే గట్టున పెట్టేసింది. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రానున్న రోజుల్లో ...15లో

ఐదేండ్ల కనిష్టానికి వేతనాలు

కార్పొరేట్ల లాభాలు ఫుల్

న్యూఢిల్లీ : నెలసరి వాస్తవ సగటు వేతనాలు పెరగాల్సింది పోయి.. భారీగా తగ్గాయి. మరోవైపు కార్పొరేట్ల ఆదాయాలు, లాభాలు ఫుల్‌గా పెరిగాయి. దేశంలో కార్మికులు 2017-18 స్థాయిల కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వేలో వెల్లడయ్యింది. 2017-18లో పురుష స్వయం కార్మికుల సగటు నెల వేతనాలు రూ.9,454గా ఉండగా.. 2023-24 నాటికి 9.1 శాతం తగ్గి రూ.8,591కి పరిమితమయ్యాయి. ఇదే సమయంలో మహిళల స్వయం ఉపాధి కార్మికులకు నెలవారీ వేతనం 32 శాతం క్షీణించి రూ.2,950గా నమోదయ్యింది. మరోవైపు పురుష వేతన కార్మికులకు నెలవారీ వేతనం 2017-18లో రూ.12,665గా ఉండగా.. 2023-24 నాటికి 6.4 శాతం తక్కువతో రూ.11,858గా నమోదయ్యింది. ఇదే సమయంలో మహిళా వేతన కార్మికులకు రూ.10,116 నుండి 12.5 శాతం క్షీణించి రూ.8,855కు పరిమితమయ్యింది. పురుష క్యాజువల్ కార్మికుల వేతనాలు 2017-18 స్థాయిలతో పోలిస్తే 2023-24లో 19.2 శాతం పెరిగి రూ.242కు చేరింది. 2017-18లో ఇది రూ.203గా ఉంది. మహిళలకు రూ.128 నుంచి 24 శాతం పెరిగి రూ.159కి చేరింది. గత సంవత్సరాల్లో స్వయం ఉపాధి, జీతభత్యాల కార్మికుల వేతనాలు భారీగా తగ్గాయి. ద్రవ్యోల్బణం అధికంగా పెరిగింది. ఫలితంగా ప్రజల ఆదాయాలు క్షీణించాయి. మరోవైపు "గడిచిన నాలుగేండ్లలో కార్పొరేట్ల నికర లాభాలు సగటున 22 శాతం చొప్పున పెరిగాయి. కంపెనీల ఆదాయాలు పెరిగినా ఉద్యోగుల వేతనాల్లో మాత్రం స్తబ్దత నెలకొంది." అని ఆర్థిక సర్వే పేర్కొంది.


సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి



60 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక
14 మందితో రాష్ట్ర కార్యదర్శివర్గం ఏర్పాటు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి తిరిగి ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. అందులో 14 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఏర్పాటైంది. త్రిపుర రాజధాని అగర్తలాలో మూడు రోజుల ...15లో



కులాంతర వివాహం చేసుకున్న వారి భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్
తుంగతుర్తిలో కులదురహంకార హత్యకు ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో కులాంతర వివాహం చేసుకున్న ...3లో

రూ.2,700 కోట్లతో 2027 నాటికి ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం



వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి గోషామహల్‌లో కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 3లో



జమిలీ బిల్లుపై జేడీయూ అభ్యంతరం

విస్తృత చర్చలు అవసరమని సూచన

వివరాలు 3లో

నేను కొడితే మామూలుగా ఉండదు

గట్టిగా కొట్టడం నా అలవాటు

ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ
రాష్ట్రంలో ఒక్క పథకం సరిగ్గా అమలు కావడం లేదు
రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారు : కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ వ్యాఖ్యలు
జహీరాబాద్ బీఆర్ఎస్ నేతలతో భేటీ



నవతెలంగాణ-మర్కుక్

"నేను కొన్నాండ్లుగా గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా. మీ అందరికీ తెలుసు.. నేను కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు కదా.. ఫిబ్రవరి నెల చివరిలో భారీ బహిరంగసభ పెడదాం.. అందరూ ...15లో

కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు

ఫామ్‌హౌస్‌లో కూర్చొని గప్పాలు కొట్టడం కాదు

దమ్ముంటే అసెంబ్లీకి రా.. లెక్కలు చెబుతా..
మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నావ్..
కేసీఆర్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం
విద్యపై పెట్టేది ఖర్చు కాదు..
భవిష్యత్ తరాలకు పెట్టుబడి
విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసే బాధ్యత నాదే..
మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల
150వ వార్షికోత్సవ సభలో సీఎం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

'రాష్ట్రంలో కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు.. వెయ్యి రూపాయల నోటు కోసం వెతికితే తీసుకెళ్లి జైల్లో పెడతారు. డిసెంబర్‌లో అధికారం కోల్పోయి.. జూన్‌లో డిపాజిట్ కోల్పోయిన కేసీఆర్.. మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారు. ఫామ్‌హౌస్‌లో కూర్చొని గప్పాలు ...15లో

వారాసిగూడలో దారుణం

ఇంట్లోనే నాలుగు రోజులు తల్లి మృతదేహం
అలాగే ఉండిపోయిన ఇద్దరు కుమార్తెలు
ఆలస్యంగా వెలుగులోకి..



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్‌లోని వారాసిగూడలో దారుణ ఘటన జరిగింది. అకస్మాత్తుగా తల్లి గుండెపోటుతో చనిపోవడం ఇద్దరు కుమార్తెలను మానసికంగా కుంగిపోయేలా చేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లి మృతదేహంతో ఇంట్లోనే నాలుగు రోజులు ఉన్నారు. ఈ హృదయవిదారక ఘటన సికింద్రాబాద్ వారాసిగూడలో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లలిత(45) అనే మహిళ రెండు నెలల నుంచి బౌద్ధనగర్‌లోని ఒక ఇంట్లో ఇద్దరు కూతుర్లతో కలిసి ఉంటోంది. దాదాపు ...15లో

ఏదీ భరోసా..?

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామాలకే లబ్ది

రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల మంది రైతుల్లో సంతోషం
18 లక్షలకుపైగా అన్నదాతల్లో నైరాశ్యం
మిగతా వారికి మార్చి 31లోగా జమ అంటూ ప్రభుత్వం సంకేతాలు
తప్పులతడకగా సాగేతర భూముల గుర్తింపు
గ్రామసభల్లో బాధితుల గగ్గోలు
రెవెన్యూ, వ్యవసాయ అధికారుల రీ సర్వే

రైతుభరోసా పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన రెవెన్యూ గ్రామాల్లో ఆనందం వెల్లివిరుస్తుండగా.. మిగిలిన రైతులకు నిరాశే మిగిలింది. సాగేతర భూముల వివరాల సర్వే ఇప్పటికీ కొనసాగు తుండటంతో మిగిలిన గ్రామాలకు ఎప్పుడిస్తారో తెలియని గందరగోళ స్థితి నెలకొంది. ఏడాది కాలంగా పంట పెట్టుబడి సహాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు.. ఇంకా మరికొంత కాలం ఆగాల్సి రావడంతో ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా 563 మండలాల్లో 577 రెవెన్యూ గ్రామాలకు చెందిన 4,41,911 మంది రైతులకు 9,48,333 ఎకరాలకు రూ.569 కోట్ల రైతు భరోసా నగదు సోమవారం వారి ఖాతాల్లో జమైంది. ఇంత వరకూ బాగానే ఉన్నా మిగిలిన 18.14 లక్షల మంది రైతులు నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో ఎకరాల వారీగా డబ్బులు బ్యాంకుల పని దినాల్లో టకీ.. టకీమని ఖాతాల్లో జమయ్యాయి. సీజన్‌కు ఎకరానికి రూ.5 వేలున్న 'రైతుబంధు'ను ఈ ప్రభుత్వం అదనంగా మరో రూ.వెయ్యి పెంచి రూ.6 వేలు చేసినా రైతుల్లో ఆ ఉత్సాహం లేదు. దీనికి కారణం రైతుభరోసా కోసం ఎదురుచూపులేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి చెప్పినట్టుగా మరో రెండు నెలల వరకు ఈ ప్రక్రియ కొనసాగితే ప్రభుత్వం రైతు భరోసా వేసిందన్న సంతోషం రైతుల్లో ఉండే అవకాశాలు తక్కువేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



తప్పుల తడకగా సాగేతర భూముల సర్వే..

ఇకపోతే సాగు భూములకు మాత్రమే ప్రభుత్వం రైతుభరోసా వర్తింపజేస్తామనడంతో వ్యవసాయ, రెవెన్యూశాఖలు సాగేతర భూముల వివరాలను సేకరించే పనిలో పడ్డాయి. యాప్ సహాయంతో సాగు భూములను గుర్తిస్తుండటంతో అనేక తప్పులు దొర్లుతున్నాయి. నగరాలు, పట్టణాలు, మున్సిపాల్టీల శివారులో ...15లో

సాగులో ఉన్న వారందరికీ జమ చేయాలి : తెలంగాణ రైతు సంఘం

సాగులో ఉన్న వారందరికీ రైతు భరోసాను జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి.సాగర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతు భరోసాను ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటు న్నారు. వానాకాలం పంట గురించి ప్రభుత్వం ప్రకటన చేయాలి. అలాగే, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో, గత సీఎం కేసీఆర్‌కు ఆనాడు రేవంత్‌రెడ్డి రాసిన లేఖలోనూ కౌలు రైతులకూ రైతు భరోసా ఇవ్వాలని, తాము అధికారంలోకి రాగానే ఇస్తామని చెప్పారు. ఇప్పుడు ఆ ప్రస్తావనే లేదు. కౌలు రైతులకు రైతు భరోసా అమలుచేయాలి.

నీటిపై రాజకీయాలు వద్దు.. నిజాలు తేల్చండి

ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాగు నీటి ప్రాజెక్టులపై రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ - బంజారా హిల్స్

నీటి కోసం నిజాలు నిర్భయంగా చెప్పండి కానీ రాజకీయం చేయడం సరికాదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సాగు నీటి ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలువురు ఇంజినీర్లు, విద్యార్థి సంఘ నాయకులు, ఉద్యమకారులు, జాగృతి నాయకులు, సామాజికవేత్తలు, రాజకీయ విశ్లేషకులు నిపుణులు పాల్గొని అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో చేపట్టిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్న చిన్న పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీని పునరుద్ధరించాలని, కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని కోరారు. ఇరిగేషన్ అడ్వైజర్ పోస్ట్ నుంచి ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాయాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణకు బేసిన్, క్యాచ్‌మెంట్, కమాండ్ ఏరియా, డ్రాట్ పోన్ ఏరియా ప్రాతిపదికన 575 టీఎంసీల నికర జలాలు సాధించేలా సమర్థవంతమైన వాదనలు వినిపించాలని, ట్రిబ్యునల్‌పై అన్ని పార్టీల సమావేశం నిర్వహించాలని అన్నారు.

పోలవరం నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాలకు బదులుగా నాగార్జున సాగర్‌కు ఎగువన 80 టీఎంసీల కృష్ణా నికర జలాల వినియోగానికి బచావత్ ట్రిబ్యునల్ పరమైన రక్షణలు ఉన్నాయని, ఇందులో తెలంగాణకు 45 టీఎంసీలు దక్కుతాయన్నారు. అయితే, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీలను మళ్లించాలని ఏపీ కొత్త ప్రాజెక్టు చేపట్టింది కాబట్టి మిగిలిన 120 టీఎంసీల్లోనూ తెలంగాణకు 80 టీఎంసీల నికర జలాలు కేటాయించేలా మొత్తం 125 టీఎంసీల సాధనకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలని కోరారు. గోదావరి-మూసీ ప్రాజెక్టును మల్లన్న సాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోకి తేవాలని, జూరాల ప్రాజెక్టుకు వచ్చే వరదను సమర్థవంతంగా వినిగించుకునేలా మరో ఎత్తిపోతల పథకం చేపట్టాలని అన్నారు. వార్ధ బ్యారేజీ పనులు సత్వరమే చేపట్టి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు 2 లక్షల ఎకరాలకు నీళ్లివ్వాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలు, ఎస్-ఎల్‌బీసీ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి వాటికి నికర జలాలు సాధించేందుకు ట్రిబ్యునల్ దగ్గర సమర్థవంతమైన వాదనలు వినిపించాలని సూచించారు. సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టుతోపాటు సీతారామ ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కక్షపూరిత రాజకీయాలకు చరమగీతం పాడి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అను మతులు సాధించాలన్నారు. ఈ సమావేశంలో వి.ప్రకాష్, దేవిప్రసాద్, బ్రాహ్మణంద, దామో దరరెడ్డి, పల్లె రవికు మార్, కవిత, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సర్వే (24-25) విడుదల

బీఆర్ఎస్ చేసిన తెలంగాణ మోడల్ విజయానికి సాక్ష్యం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే (24-25) బీఆర్ఎస్ చేసిన తెలంగాణ మోడల్ విజయానికి సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆర్థిక సర్వే నివేదిక కాంగ్రెస్ అబద్ధపు దుష్ప్రచారానికి చెంపదెబ్బ అని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక స్వావలంబన, వ్యవసాయ ప్రగతి, మహిళా శక్తీకరణ, నీటి పారుదల వంటి అన్ని రంగాల్లోనూ తెలంగాణ బీఆర్ఎస్ పాలనలో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక గత ప్రభుత్వం పైన చేస్తున్న అవాస్తవాలను ఆర్థిక సర్వే ఎండగట్టిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పదేళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, అభివృద్ధిని కొనసాగించి ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పాలనచేతగాక గత ప్రభుత్వ పదేళ్ల పాలనపైన చేస్తున్న అనేక దుష్ప్రచారాలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ అన్నారు. ఈ సర్వే తెలంగాణ రాష్ట్రం గత దశాబ్దంలో సాధించిన సమగ్ర, సమతుల, సమగ్రాభివృద్ధిని మరోసారి ప్రతిబింబించిందని తెలిపారు. ఆర్థిక సర్వే ప్రకారం, తెలంగాణ స్వంత ఆదాయ వనరులలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, రాష్ట్రం 88 శాతం ఆదాయాన్ని స్వయంగా సేకరించుకోవడం తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణలకు ఇది గట్టి సమాధానమని కేటీఆర్ స్పష్టం చేశారు. మొత్తం సాగుబడి భూమిలో 90 శాతానికిపైగా ప్రాంతం సాగునీటి సదుపాయాన్ని పొందుతోందని సర్వే చెప్పిన వాస్తవం సాగునీటి ప్రాజెక్టులపైన కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిందన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసిన హయాం ముమ్మాటికీ బీఆర్ఎస్ పాలనే అని, కేసీఆర్ గుర్తులు, చరిత్రను, ఆయన నాయకత్వంలో అందిన ఫలాలును ఎవరు చెరపలేరని కేటీఆర్ పేర్కొన్నారు.

ఆర్థిక సర్వే రిపోర్ట్ కాంగ్రెస్ బోగస్ ప్రచారానికి చెంపపెట్టు : మాజీ మంత్రి హరీశ్‌రావు

కేంద్రం విడుదల చేసిన ఎకనమిక్ సర్వే 2024-25 నివేదిక బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసే కాంగ్రెస్ కు చెంపపెట్టు లాంటి సమాధానమని మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీలో తెలంగాణ మేటి అని మరోసారి తేల్చి చెప్పిన ఎకనిమిక్ సర్వే. కర్ణాటకతో పాటు తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని వెల్లడించిందని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక, ఐటీ, నీటి పారుదల, మహిళా సాధికారతలో సాధించిన ఘనతను ఆర్థిక సర్వే లెక్కలతో సహా వివరించింది. ఎకనమిక్ సర్వే రిపోర్టు కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారం బోగస్ అని పేర్కొన్నదని హరీశ్ రావు చెప్పారు.

జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు సర్కారుకే..!

బెంగళూరు : మాజీ ముఖ్యమంత్రి జె.జయలలిత ఆస్తికి సంబంధించిన వివాదం చాలాకాలంగా కొనసాగుతూనే వచ్చింది. తాజాగా బెంగళూరులోని ప్రత్యేక కోర్టు దీనిపై కీలక తీర్పునిచ్చింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో జయలలిత ఆస్తులన్నీ తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలంటూ బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన ఆస్తులను తమిళనాడు ప్రభుత్వం పదేళ్ల క్రితమే స్వాధీనం చేసుకుంది. అయితే అప్పుడు ఆ ఆస్తుల విలువ రూ.913 కోట్లుగా ఉంది. ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ రూ. 4,000 కోట్లకు పైగా ఉండవచ్చని అంచనా. అయితే ఆ ఆస్తులు మొత్తం తమకే చెందుతాయంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీపలు అనేక ప్రయత్నాలు చేశారు. ఇటీవల వాటిని తమకే అప్పగించాలంటూ కర్నాటక హైకోర్టును కూడా ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన న్యాయస్థానం వారు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. తాజాగా బెంగళూరులోని ప్రత్యేక కోర్టు తీర్పునిస్తూ జయలలిత ఆస్తులన్ని తమిళనాడు ప్రభుత్వానికే చెందుతాయని ప్రకటించింది. జయలలితకు చెందిన 1,562 ఎకరాల భూమికి సంబం ధించిన పత్రాలు, 27 కిలోల బంగారు, వజ్రాభరణాలు, పది వేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తువులను కర్నాటక ప్రభుత్వం అప్పగించనుంది.

విన్నపాలు వినవలె..

అందరి చూపూ బడ్జెట్ వైపే

మరి కొద్ది గంటల్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ కోసం పన్ను చెల్లింపుదారులు, పారిశ్రామిక వర్గాలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాయి. పన్ను వ్యవస్థలో మార్పులు చోటుచేసుకుంటాయని అవి ఆశిస్తున్నాయి. నిర్మలా సీతారామన్ శనివారం ఉదయం 11 గంటలకు పార్లమెంటుకు కేంద్ర బడ్జెట్‌ను సమర్పిస్తారు. గత సంవత్సరం నరేంద్ర మోడీ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వ రెండవ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆమె సభ ముందు ఉంచబోతున్నారు. నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను సమర్పించడం ఇది ఎనిమిదో సారి. ఇప్పటి వరకూ ఆమె ఆరు వార్షిక బడ్జెట్లను, రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రకటన దృష్ట్యా దేశంలోని స్టాక్ మార్కెట్లు సెలవు దినమైన శనివారం కూడా తెరిచే ఉంటాయి



డిజిటలీకరణకు ప్రాధాన్యత

న్యూఢిల్లీ :. 'బడ్జెట్‌పై మేము ఎంతో ఆశా భావంతో ఉన్నాము. డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం మరింత ప్రోత్స హిస్తుందని భావిస్తున్నాము. ఎంఎస్ఎంఈలకు సులభంగా రుణాలు లభించేలా బడ్జెట్‌లో చర్యలు ఉంటాయని అనుకుంటున్నాము. డిజిటలీకరణ ప్రక్రియకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని, నిబంధనలు సడలించాలని కోరుతున్నాము' అని భారత్‌పే సీఈఓ నళిన్ నేగీ చెప్పారు. కేంద్ర బడ్జెట్ గ్రామీణ ఆరోగ్య రక్షణకు అవసరమైన మౌలిక సదు పాయాలు, డిజిటల్ ఆరోగ్యం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని హియర్‌జాప్ ఎండీ సూచించారు. ప్రాథమిక, ముందస్తు ఆరోగ్య సేవల వనరులను విస్తరించాలని, శిక్షణ-పరిశోధనలో పెట్టుబడులు పెంచాలని ఆయన కోరారు.

వ్యవసాయానికి ఊతం

వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని, ఉత్పత్తి, సరఫరాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని డెలాయిట్ సంస్థ ఆర్థికవేత్త డాక్టర్ రుమ్కీ మజుందార్ అభిప్రాయపడ్డారు. స్వల్ప కాలిక చర్యలుగా గ్రామీణ వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యక్ష ప్రయోజనకర బదిలీలు (డీబీటీలు) జరపాలని, ఆహార కూపన్లు అందించాలని కోరారు. పాదరక్షలపై జీఎస్టీ రేటును 18 శాతం నుండి 12 శాతానికి, కార్పొరేట్ పన్నును 25 శాతం నుండి 20 శాతానికి, పాదరక్షలపై కస్టమ్స్ సుంకాన్ని 38.5 శాతం నుండి 22 శాతానికి తగ్గించాలని బ్రాండ్‌మాన్ రిటైల్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ విభాగం అధిపతి కాశికా మల్హోత్రా సూచించారు.

ఆశలు లేవంటున్న ప్రతిపక్షం

బీజేడీ ఎంపీ సస్మిత్ పత్రా ద్రవ్యోల్బణం, అధిక ధరలు వంటి సమస్యలను ఎత్తిచూపారు. 'దేశ ఆర్థిక వ్యవస్థ సరిగా లేదు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని చెప్పుకుంటున్నప్పటికీ అధిక ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి సమస్యలు అలాగే ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రధాన సంస్కరణలు అవసరం. అవి బడ్జెట్‌లో ప్రతిబింబిస్తాయని ఆశిస్తున్నాను' అని అన్నారు. ఈ బడ్జెట్‌పై తమకు పెద్దగా ఆశలేవీ లేవని కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ పెదవి విరిచారు. దేశంలో ఉత్పత్తి, జీడీపీ తగ్గాయని చెప్పారు. గృహ వినియోగం పెరగలేదని, పన్నులు మాత్రం పెరుగు తున్నాయని విమర్శించారు. కాగా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఔషధ పరిశ్రమ కోరింది. ప్రభుత్వం అసంఘటిత రంగంపై దృష్టి సారించాలని కేంద్ర మంత్రి జితన్ రామ్ మంఝీ కోరారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు వీలుగా తమకు పరిశ్రమ హోదా ఇవ్వాలని రియల్ ఎస్టేట్ రంగంలోని వారు సూచించారు.



పన్ను రాయితీలు

ఉద్యోగుల ఆర్థిక, జీవన అవసరాలను దృష్టిలో పెట్టుకొని పన్ను రాయితీలు ఇవ్వాలని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. జీవన వ్యయం అంతకంతకూ పెరిగిపోతుంటే ఉద్యోగులపై ఆర్థిక ఒత్తిడి పడుతోందని, ఉత్పాదకతపై అది ప్రభావం చూపుతోందని వారు తెలిపారు.

ఈ నేపథ్యంలో పన్ను ప్రయోజనాలు కల్పించి ఉద్యోగులకు ఊరట ఇవ్వాలని కోరారు. ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం సంపాదించే వారికి ఆదాయపన్ను రేట్లను తగ్గించాలని క్లియర్‌ట్యాక్స్ సంస్థకు చెందిన పన్ను నిపు ణురాలు షెఫాలీ ముంద్రా విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ ప్రక్రియలను ప్రభుత్వం సరళతరం చేయాలని, ఆర్థిక సహకారం అందిం చేందుకు ప్రధానమంత్రి ముద్రా యోజన వంటి పథకాలను విస్తరించాలని, దిగుమతి సుంకాలను తగ్గించి రిటైల్ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. క్యాపిటల్ గెయిన్స్ పన్నును హేతుబద్ధీకరించాలని పలువురు నిపుణులు కోరారు.

కోరికల చిట్టా

వ్యవసాయం, న్యాయ సేవలు, టూరిజం, ప్రజా పంపిణీ వ్యవస్థలు వంటి రంగాల్లో కృత్రిమ మేథ కార్యక్రమాలను అమలు చేయాలని కొందరు కోరుతున్నారు. గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న బీసీ ఔట్‌లెట్లలో అందిస్తున్న అన్ని రకాల ఆర్థిక సేవలపై జీఎస్టీని ఎత్తివేయాలని పేనియర్‌బై సంస్థ సీఈఓ ఆనంద్ కుమార్ బజాజ్ సూచించారు. కార్పొరేట్ పన్నులు తగ్గించాలని, ట్యాక్స్ హాలిడేలు ప్రకటించాలని, పరిశోధన-అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్టార్టప్ కంపెనీలు కోరాయి. ఆరోగ్య రంగంపై టెక్నాలజీ చూపుతున్న ప్రభావాన్ని బడ్జెట్ గుర్తించాలని వైద్య నిపుణులు విజ్ఞప్తి చేశారు. వైద్యులు డిజిటల్ బెదిరింపులు ఎదుర్కొంటున్నారని, హింస పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రిటైల్ రంగం అభివృద్ధిపై బడ్జెట్ దృష్టి సారించాలని కాష్‌కారో అండ్ ఎర్న్‌కారో సంస్థ సహ వ్యవస్థాపకుడు రోహన్ భార్గవ కోరారు. స్టాండర్డ్ డిడక్షన్‌లో మార్పులు చేయాలని నిపుణులు సూచించారు.

మాటలే తప్ప ఆచరణ శూన్యం



ప్రభుత్వ పనితీరుపై జూలకంటి

నవతెలంగాణ- మిర్యాలగూడ టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు మినహాయిస్తే మాటలే తప్ప ఆచరణ శూన్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలపై దాటవేత తప్ప ప్రజలకు మేలు చేయాలని ఆలోచన లేదన్నారు. రైతు భరోసాను వెంటనే ఇస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామ రైతులకు ఇవ్వడం సాచివేతకు నిదర్శనమన్నారు.

యావత్ రైతాంగం రైతు భరోసా కోసం ఎదురు చూస్తోందని, ఇలాంటి సమయంలో మార్చి నుంచి ఇస్తామని చెప్పడం రైతులను మోసగించడమే అని అన్నారు. మిగిలిన దొడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిలేని రైతులకు రూ.12000 ఇస్తామన్న మాటలు విస్మరించారన్నారు. 30 లక్షల మంది అర్హులైన పేదలు ఇండ్ల కోసం చేసుకున్న దరఖాస్తులు బుట్ట దాఖలు అయ్యాయన్నారు. వచ్చే బడ్జెట్లో సంక్షేమ పథకాలకు, వ్యవసాయ రంగానికి, నిరుద్యోగితకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యువజన చట్టంలో పొందుపరిచిన విధంగా నిధుల కోసం, ప్యాకేజీల కోసం అసెంబ్లీలో చర్చించి, అవసరమనుకుంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. కేంద్రం మంజూరు చేసే స్థానిక సంస్థల నిధులు వృథా కాకుండా.. వెంటనే వాటికి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు గౌతం రెడ్డి, పరశురాములు, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రూ.2,700 కోట్లతో... 2027 నాటికి ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం

వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో కలిసి గోషామహల్‌లో కొత్త నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణాన్ని రూ.2,700 కోట్లతో 2027 నాటికి పూర్తి చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గోషామహల్‌లో కొత్త ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడారు. కొత్త ఆస్పత్రి రాకతో స్థానిక గోషామహల్ ప్రజలకు కూడా ప్రయోజనం ఉంటుందని స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆస్పత్రి నిర్మాణం ఉంటుందన్నారు. స్కైవాక్ కూడా అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక వ్యాపారులకు కూడా మేలు కలుగుతుందని చెప్పారు. ప్రజాభిప్రాయానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిని పలు చోట్ల ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, ఆ ఆస్పత్రికి ఉన్న ఘనమైన చరిత్రను దష్టిలో ఉంచుకుని గోషామహల్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. వందేండ్లుగా రోగులకు సేవలందిస్తున్న ఆస్పత్రిగా, ఉస్మానియా ఒక బ్రాండ్ అనీ, ఆ ఆస్పత్రి డాక్టర్లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారన్నారు. పురాతన భవనంలో వైద్యం అందించలేని పరిస్థితిలో కొత్త ఉస్మానియా ఆస్పత్రి కోసం డాక్టర్లు, వైద్య సిబ్బంది, రోగులు, ప్రజలు కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం జరగాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. అందరి ఆకాంక్షలను నిజం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డితో కలిసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించామన్నారు. 1919 నుంచి స్థానిక ప్రజలకు ఉస్మానియా ఆస్పత్రితో అనుబంధం ఉందనీ, అందుకే ఇక్కడే ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

26.30 ఎకరాల్లో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం తర్వాత కూడా అక్కడ పోలీస్ శాఖకు 11 ఎకరాల స్థలం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో 1,168 బెడ్లు ఉండగా, కొత్త ఉస్మానియా ఆస్పత్రిలో 2 వేల బెడ్లు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఇందులో 500 బెడ్లు ఐసీయూ సౌకర్యంతో ఉంటాయన్నారు. ప్రస్తుత ఉస్మానియాలో 22 డిపార్ట్‌మెంట్లు ఉండగా, కొత్త ఆస్పత్రిలో అదనంగా మరో 8 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. అన్ని రకాల వైద్యసేవలు అందించనుండటంతో రోగులను ఇంకో దగ్గరికి పంపించే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. దాదాపు 41 ఆపరేషన్ థియేటర్లు, ఆస్పత్రి ప్రాంగణంలోనే డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలు ఉంటాయన్నారు. విద్యార్థులకు, బోధనా సిబ్బందికి అధునాతన వసతులతో కూడిన హాస్టల్ సదుపాయం, 750 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు, రోగుల సహాయకుల కోసం ధర్మశాల, ల్యాండ్‌స్కేప్ గార్డెన్ ఏర్పాటు, హాస్పిటల్‌కు నలువైపులా విశాలమైన రోడ్లు, సుమారు 3 వేల వాహనాలు ఒకేసారి పార్కింగ్ చేసుకునేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సిస్టమ్, స్కైవాక్ నిర్మాణం సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్, పోలీస్ అవుట్ పోస్ట్ వంటివి కూడా హాస్పిటల్ ప్రాంగణంలో ఉంటాయని స్పష్టం చేశారు. గోషామహల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు.

కులాంతర వివాహం చేసుకున్న వారి భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

(మొదటిపేజీ తరువాయి)

వారి భద్రత కోసం ప్రత్యేక చట్టం తేవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు నెలల క్రితం దళితుడైన వడ్లకొండ కృష్ణ, బీసీ కులానికి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కుటుంబ పరువు పోయిందనే నెపంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణను హత్య చేశారని వివరించారు. ఈ నిందితులపై గతంలో అనేక కేసులున్నాయని పేర్కొన్నారు. వారిని అరెస్టుతోనే సరిపెట్టకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, భద్రత కల్పించాలనీ, కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. చట్టాలెన్నొచ్చినా కులాంతర వివాహం చేసుకున్న వారిపై హత్యలు, దాడులు, బహిష్కరణలు జరుగుతున్నా ప్రభుత్వాలు, రక్షణ వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులాంతర వివాహాలు చేసుకున్న వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 45 కుల దురహంకార హత్యలు జరిగాయని వివరించారు. కళారూపాలు, ఇతర ప్రసార సాధనాల ద్వారా ప్రజలను చైతన్యపర్చాలని తెలిపారు. ఘటనలు జరిగిన వెంటనే నిర్ణీత కాల వ్యవధిలో విచారణ జరిపి బాధితులకు భరోసా ఇవ్వాలని కోరారు. దాడులు, హత్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జమిలీ బిల్లుపై జేడీయూ అభ్యంతరం

విస్తృత చర్చలు అవసరమని సూచన

న్యూఢిల్లీ : 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' బిల్లుపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన జేడీయూ అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. బిల్లు విషయంలో తొందరపాటు తగదని, దానిపై విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాలని జేడీయూ సూచించింది. సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ అధ్యక్షత వహించారు. చర్చ సందర్భంగా జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ బిల్లు అమలులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును మరింత పరిశీలన కోసం 39 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీకి ఇప్పటికే నివేదించారు.

కాంగ్రెస్, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీలకు చెందిన నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఝాతో పాటు ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ కూడా నూతన లోక్‌సభలో సీటింగ్ ఏర్పాట్లపై ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. తొలుత కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ఈ అంశాన్ని లేవనెత్తగా ఝా, టీడీపీ మద్దతు తెలిపాయి. సీటింగ్ ఏర్పాట్లు ఏకపక్షంగా ఉన్నాయని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తారు. నిర్వహణ లోపాలను, వీఐపీ సంస్కృతిని ప్రస్తావించారు. వక్ఫ్ జేపీసీ పనితీరును కూడా వారు దుయ్యబట్టారు.

సీఎం పర్యటనలో..
సీపీఐ(ఎం) గోషామహల్ నాయకుల అరెస్ట్

ఖండించిన పార్టీ సౌత్ జిల్లా కార్యదర్శి అబ్బాస్



నవతెలంగాణ - ధూల్‌పేట్

హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి శంకుస్థాపనను స్వాగతించేందుకు వచ్చిన సీపీఐ(ఎం) గోషామహల్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ఉస్మానియా నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆస్పత్రి భవన నిర్మాణాన్ని స్వాగతించేందుకు సీపీఐ(ఎం) గోషామహల్ నాయకులు పి.నాగేశ్వర్, కె.జంగయ్య స్టేడియం దగ్గరకు వచ్చారు. అయితే అక్కడే విధి నిర్వహణలో ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేసి బేగం బజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విడుదల చేశారు.

అరెస్టు విషయం తెలుసుకున్న ఆ పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని స్వాగతించేందుకు వచ్చిన నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. 10 ఏండ్లుగా ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎం) నిర్వహించిన ఆందోళన, పోరాటాలను గుర్తుచేశారు. అభివృద్ధి కోసం 2015-18 సమయంలో ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలో సీపీఐ(ఎం) ధర్నాలు నిర్వహించిందన్నారు. ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నూతన భవన నిర్మాణానికి 2023లో చేసిన నిరసన ర్యాలీలో సీపీఐ(ఎం) కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసిన పార్టీగా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపనను సీపీఐ(ఎం) స్వాగతిస్తుందన్నారు. అలాంటి వారి పట్ల ఈ విధంగా వ్యవహరించిన పోలీసుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. సీపీఐ(ఎం) నాయకులను అరెస్టు చేసి గంటల తరబడి పోలీస్ స్టేషన్‌లో కూర్చోబెట్టడం అధికారులు చేసిన తీవ్ర తప్పిదమన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

గద్దర్ పేరు ఉచ్చరించేలా చేస్తా

బీజేపీ పార్టీ ఆఫీసు కాలనీకి ఆయన పేరు పెడతా...

నెక్లెస్‌రోడ్‌లో గద్దర్ మెమోరియల్‌పై నిర్ణయం తీసుకుంటాం : గద్దర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'గద్దర్ పేరు ఉచ్చరించేలా చేస్తా. మీ పార్టీ కార్యాలయం ఉన్న కాలనీకి ఆయన పేరు పెడతాం. అప్పుడు అడ్రస్ రాసుకోవాలంటే గద్దర్ పేరు తలవకతప్పదు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నంత మాత్రాన, వ్యక్తుల గౌరవాన్ని, వారి సామాజిక కృషిని తగ్గించాలని చూడటం మూర్ఖత్వం అవుతుంది' అని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాలు ఎక్కడికక్కడ విడిపోతే కేంద్రం మిథ్య అనే విషయాన్ని సదరు నాయకులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. 'గద్దర్‌ను గేటు బయట పడిగాపులు కాసేలా చేసిన వ్యక్తి ఉన్న భవనంలో ఇప్పుడు ఆయన వారసులు ఉంటున్నారు. ఆ వ్యక్తి తనను ఎవరైనా వచ్చి పలకరిస్తారేమో అని చకోర పక్షిలా ఎదురు చేస్తున్నాడు. మీక్కూడా అదే గతి తప్పదు. వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టడం ఖాయం. అప్పుడు మేమే రాహుల్‌గాంధీతో మాట్లాడి, మా గద్దర్ అన్నకు పద్మ అవార్డు తెచ్చుకుంటాం' అని అన్నారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారంనాడిక్కడి రవీంద్రభారతిలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో గద్దర్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రాలు ఎక్కడికక్కడ విడిపోతే కేంద్రం మిథ్య అనే విషయాన్ని సదరు నాయకులు గుర్తుంచుకోవాలనీ, అంతటి అధికార అహంకారం మంచిది కాదని హితవు పలికారు. గాంధీజీనే గుర్తించని వారు ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వాలు నడవాలన్నారు. గద్దర్ మరణం తర్వాత ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియకుండా, హడావిడిగా అంత్యక్రియలు చేయాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందని తెలిపారు. తానే ముందుండి గద్దర్ భౌతికకాయాన్ని ఎల్బీ స్టేడియంకు తరలించాననీ, లక్షలాదిమంది ఘనంగా ఆయనకు నివాళులు అర్పించారని గుర్తుచేసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వందేండ్ల చరిత్రలో ఒక్కసారి కూడా దళితుడికి వైస్ చాన్సలర్ (వీసీ) పదవి దక్కలేదనీ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అక్కడే చదివిన వ్యక్తిని వీసీని చేశామన్నారు. అంబేద్కర్ యూనివర్సిటీకి కూడా అక్కడ చదివిన వ్యక్తే వీసీ అయ్యారన్నారు. వీసీల నియామకంలో సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నామని చెప్పారు. పద్మ అవార్డుల కోసం గోరేటి వెంకన్న, అందెశ్రీ, గద్దర్, జయధీర్, చుక్క రామయ్య పేర్లను కేంద్రానికి పంపామన్నారు. వీరేవరూ తమపేర్లను పంపమని ప్రభుత్వాన్ని కోరలేదనీ, తెలంగాణ సమాజంతో వారికున్న అనుబంధాన్ని గుర్తించాలనే ఉద్దేశ్యంతో తానే వారి పేర్లను పంపానని వివరించారు. కానీ పొరుగురాష్ట్రానికి ఐదు అవార్డులు ఇచ్చి, తెలంగాణను కేంద్ర ప్రభుత్వం అవమానపరిచిందని అన్నారు. చేసిన తప్పులు సరిదిద్దుకోకుండా కేంద్రమంత్రి మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. ఎంతోమంది యువతకు గద్దర్ స్ఫూర్తిని ఇచ్చారనీ, సిద్ధాంతాలు వేరైనంత మాత్రాన వ్యక్తుల్ని తక్కువచేసి మాట్లాడితే, వారి స్థాయి ఏమీ తగ్గదని స్పష్టం చేశారు. ఇష్టం ఉన్నా లేకున్నా గద్దర్‌ను సిద్ధాంతకర్తగానే చూడాలని చెప్పారు. నెక్లెస్‌రోడ్డులో గద్దర్ మెమోరియల్ నిర్మాణం కోసం నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గద్దర్ విశ్వమానవుడు అని కీర్తించారు. సమాజ మార్పు కోసం జీవితాన్ని ధారపోసారనీ, ఆయన పాటద్వారానే తెలంగాణ ఉద్యమం ఎగసిపడిందని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర గొప్పదనీ, రాష్ట్ర సాధన తర్వాత ఆయన బాధపడాల్సిన రోజులు రావడం దురదృష్టకరమని అన్నారు. ప్రగతిభవన్ ఎదుట అప్పటి సీఎం కేసీఆర్ అనుమతి కోసం ఆయన్ని గంటల తరబడి నిలబెట్టి, కలిసేందుకు కూడా ఇష్టపడలేదని విమర్శించారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ డీజీ నర్సింహారావు మాట్లాడుతూ తొలి దశ తెలంగాణ ఉద్యమం సమయంలో తాను పదవ తరగతి చదివుతున్నాననీ, సికింద్రాబాద్ కేంద్రంగా ఉద్యమం నడిచేదని ఆ రోజుల్ని గుర్తుచేసుకున్నారు. గద్దర్‌తో పాటు ఇతరులు అల్వాల్‌లో ఉండేవారనీ, పోలీసు కాల్పుల్లో తన సీనియర్ మరణిస్తే, తన తోటి విద్యార్థికి కాళ్లు పోయాయని చెప్పారు. 1972-73 అప్పటి నక్సల్స్ గ్రూపులకు చెందిన హార్ట్ లవర్స్ సంస్థతో కలిసి ఎస్ఎఫ్ఐ పనిచేసిందన్నారు. సరళీకరణ ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక 1990 దశకంలో గద్దర్ తనపార్టీతో విభేదించి, విశాల ఐక్యవేదిక ఏర్పాటు కోసం కృషి చేశారన్నారు. రాజ్యాంగం-ఎన్నికలు-వామపక్ష సాంస్కృతిక ఉద్యమాల విస్తరణ కోసం కలిసి పనిచేశామని ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గద్దర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ శాంతాసిన్హా, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల, ప్రజాగాయకులు, రచయితలు గోరేటి వెంకన్న, జయరాజ్, గంటా చక్రపాణి, పాశం యాదగిరి, కంచె ఐలయ్య, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం తెలుగు ప్రతి, మా పల్లె పాటైంది అనే మరో పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు.

యాసంగిలో అరిగోస


సంపాదకీయం

యాసంగి సీజన్ రైతులకు అరిగోసను చూపిస్తున్నది. వ్యవసాయం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఒకటేమిటీ అనేక కష్టాలు రైతన్నలకు సవాల్‌గా నిలుస్తున్నాయి. ఎప్పటిలాగే ప్రయివేటు వడ్డీల బారీన పడుతున్నారు. అప్పుల తిప్పలు తప్పడం లేదు. రైతు సంక్షేమ పథకాల అమలు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కిలా ఉంది. ఒక్కో రైతుకు రూ.12 వేలకు లోబడి రుణమాఫీ చేయడానికి రూ.49,500 కోట్లు అవసరం. కేంద్ర సర్కారు సహాయ నిరాకరణతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. అలాగే సాగునీటి సమస్యలూ వేధిస్తున్నాయి. లక్షల కోట్లు ఖర్చుపెట్టిన తర్వాత కూడా సాగునీటి ఇబ్బందులు ఇంకా తలెత్తడం, కొనసాగుతుండటం ఆందోళనకరం. భూగర్భజలాలు

> రైతన్నలవి ఆత్మహత్యలు కాదనీ, సర్కారీ హత్యలేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మెదక్, ఆదిలాబాద్, హన్మకొండ, మహబూబాబాద్, వరంగల్, జనగామ, నల్లగొండ, సిద్ధిపేట, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో రైతులు విగతజీవులవు తుండటం దురదృష్టకరం. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ 'రైతుడిక్లరేషన్'లో రుణమాఫీ, రైతుభరోసా, కౌలురైతులతోపాటు భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేస్తానంది. కాగా ఈ హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు వెనుకపడిందనే చెప్పొచ్చు.

పడిపోవడం, మోటార్లు కాలిపోవడం సర్వసాధారణమైంది. బోర్లు ఎండిపోయి, మోటార్లు కాలిపోయి పంటలు నీటి ఎద్దడికి గురవుతున్నాయి. సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు కాక, లోవోల్టేజీ సమస్యలతో రైతులు కష్టాలకడలిలో ఉండిపోతున్నారు.

యాసంగి నేపథ్యంలో కొన్ని జిల్లాల్లో ముందస్తుగా సాగుచేయడంతో ప్రత్యేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవరు. ఒకవేళ తెరిచినా పనితీరు అంతంతే. కనీస మద్ధతు ధరల కంటే తక్కువకు ప్రయివేటు మిల్లర్లకు అమ్మి నష్టపోవాల్సి వస్తున్నది.



ఆరుగాలం పడ్డ శ్రమను కోల్పోతారు. దోపిడీకి గురయ్యే పరిస్థితి. కేంద్రాలను కొద్దిరోజులు ఉంచి ఆ తర్వాత మూసేస్తారు. ఆలస్యంగా వచ్చిన పంటలను చచ్చినట్టు బయట అమ్ముకోవాల్సిందే. మరోదారిలేదు. దీంతో కనీస మద్దతు ధరకు ఇరవై శాతం మేర తక్కువకు విక్రయించాల్సి వస్తున్నది.ప్రభుత్వ ప్రణాళిక సరిగ్గా లేకపోవడంతో నష్టం రైతుల నెత్తిమీద పడుతున్నది. వేరుశెనగ రైతులకు కొనుగోలు కేంద్రాలు లేక, మద్దతు ధర అందక అవస్థలు తప్పడం లేదు. సహకరించడంలో సర్కారీ మార్క్‌ఫెడ్ విఫలమవుతున్నది. సాధారణంగా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు యాసంగి సీజన్ ఉంటుంది. మొత్తం పంటల్లో డెబ్బయి ఎనిమిది శాతం మాత్రమే ఖాస్తులోకి వచ్చింది. వరిసాగు తగ్గింది. ఇతర ఆహార ధాన్యాల సాగు 79 శాతానికి పడిపోయింది. వ్యవసాయానికి గానీ, రైతులకుగానీ సాయం సమయానుకూలంగా చేరడం లేదు. రైతు భరోసా దగ్గర నుంచి రుణమాఫీ వరకు అమల్లో విపరీతమైన జాప్యం చోటుచేసు కుంటున్నది. రుణమాఫీ అరవైశాతం మంది రైతులకే వర్తిస్తుండగా, మిగిలిన వారికి ఉత్తచెయ్యే. అలాగే కొంత మంది రైతులకు రెన్యూవల్ చేయకపోవడంతో కొత్తగా సహకార అప్పులు సైతం పుట్టడం లేదు.

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సైతం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలివ్వడంలో తాత్సారం చేస్తున్నది. 2023 నుంచి ఇప్పటివరకు నాలుగు వందల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు మీడియాలో వార్తలొచ్చాయి. సగటున రోజుకో రైతు తనువు చాలిస్తుండటం ఆందోళనతోపాటు ఆవేదన కలిగించేదే. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. రైతన్నలవి ఆత్మహత్యలు కాదనీ, సర్కారీ హత్యలేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మెదక్, ఆదిలాబాద్, హన్మకొండ, మహబూబాబాద్, వరం గల్, జనగామ, నల్లగొండ, సిద్ధిపేట, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో రైతులు విగతజీవులవు తుండటం దురదృష్టకరం. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ 'రైతుడిక్లరేషన్'లో రుణమాఫీ, రైతుభరోసా, కౌలురైతులతోపాటు భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేస్తానంది. కాగా ఈ హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు వెనుకపడిందనే చెప్పొచ్చు.

ఈ పరిస్థితుల్లోనే ప్రతిపక్షాలు అన్నివైపులనుండి ఆరోపణలు, విమర్శలు మూటకట్టుకుంటున్నది.ప్రాజెక్టుల నిర్వహణ లోనూ నిర్లక్ష్యం కనిపిస్తున్నదని సాగునీటిరంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు యాసంగినీ ప్రభావితం చేస్తున్నాయి. నియంత్రణలో వ్యవసాయ శాఖ వైఫల్యం కండ్లకు కడుతున్నది.

మార్కెట్‌లో సరైన ధరల్లేక రైతులు నల్లగొండ, యాదాద్రి-భువనగిరి, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ రైతులు రోడ్లమీదకొచ్చి ఆందోళనలు, ధర్నాలకు దిగారు. ఎప్పటిలాగే కేంద్రంలోని మోడీ సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నది ఏండ్ల తరబడి చోద్యం చూస్తున్నది. 'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు' అనేలా ప్రవర్తిస్తున్నది. ఫసల్‌బీమా యోజనలో పసలేకుండా పోయింది. ఈ పథకం అక్కరకురాని చుట్టమైంది. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డును మంజూరుచేసినా, పసుపు పంటకు కనీస మద్దతు ధరను కేంద్రం ప్రకటించక పోవడం గమనార్హం.

సిరియా పరిణామాలను ఎలా అర్థం చేసుకోవాలి?



విజయ్ ప్రసాద్

గత కొన్ని నెలలుగా అంతర్జాతీయంగా జరిగిన పరిణామాలన్నింటిలోకి అత్యంత అనూహ్యమైన ఘటన డమాస్కస్ పతనం. పదేండ్ల కిందట - కతార్, టర్కీ, సౌదీ అరేబియా, అమెరికాల ధన, ఆయుధ సహాయ మందుకున్న - తిరుగుబాటు దళాలు సిరియా సరిహద్దుల నుండి లోనికి చొరబడినపుడు బషర్ అల్-అసద్ ప్రభు త్వం కూలడం ఖాయమని ఆనాడు విశ్లేషకులనుకున్నారు. అత్యంత శక్తివంతమైన దేశాల దన్నుతో ఏర్పడ్డ ఆ తిరుగుబాటు శ్రేణుల్లోకి చేరిన వ్యక్తులు కింది ఐదు కోవలకు చెందుతారు.

1. అల్-అసద్ ప్రభుత్వ ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల దెబ్బతిని ఆగ్రహంతో ఉన్న పలు వర్గాలు - ముఖ్యంగా, బలమైన పరిశ్రమలున్న టర్కీ నుండి దిగుమతయిన ఉత్పత్తులతో పోటీ పడలేక కుప్పకూలిన చిన్న పరిశ్రమల కార్మికులు.

2. దీర్ఘకాలిక కరువు వల్ల వ్యవసాయం దెబ్బతిని, ప్రభుత్వ సహాయమూ దొరకక, పనుల కోసం పొట్ట చేత పట్టుకుని ఇడ్లిబ్, అలెప్పొ నగరాలకు వలస వచ్చిన ఉత్తర సిరియా ప్రాంతపు రైతాంగం.

3. హఫేజ్ అల్-అసద్ మరణం తరువాత రాజకీయ సంస్కరణలు కోరుతూ సిరియాలోని పలు నగరాలలో 2000-01లో జరిగిన చర్చా గోష్ఠుల (ముంతదయాత్) నుండి పుట్టి డమాస్కస్ వసంతం (డమాస్కస్ స్ప్రింగ్)గా పేరొందిన ఉద్యమంలో, పెద్ద ఎత్తున పాల్గొని దాని వైఫల్యంతో అసంతృప్తి చెందిన లౌకికవాద మధ్యతరగతి వర్గాలు.

4. గాఢమైన మత విశ్వాసాలున్న మధ్య తరగతి వర్గానికి ప్రాతినిధ్యం వహించే 'ముస్లిం సోదర కూటమి' (ముస్లిం బ్రదర్‌హుడ్). దాదాపు అరబ్ దేశాలన్నింటిలో ఉన్న ఈ కూటమిని, 1982లో అప్పటి సిరియా ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేసింది. 2010-11 కాలంలో అరబ్ వసంతం పేరిట ఈజిప్ట్, ట్యునీసియాలలో జరిగిన ఆందోళనలలో ఆయా దేశాల సోదర కూటములు పోషించిన ముఖ్య పాత్ర, సిరియా సోదర కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది.

5. ఇరాక్‌లో అల్-ఖైదా శిక్షణతో రాటుదేలి, డమాస్కస్ బురుజులపై జిహాదీ నల్ల జెండాని ఎగరేయడానికి ఉవ్విళ్లూరుతున్న ఇస్లామిక్ సాయుధ శ్రేణులు.

2011లో విఫలమైన ప్పటికీ, ఇవే శక్తుల్లోని కొన్ని వర్గాలు డిసెంబర్ 7న అసద్ ప్రభుత్వాన్ని పడదోసి డమా స్కస్ స్వాధీన పరుచుకున్నాయి. గత పదేళ్లుగా అసద్ ప్రభుత్వం నిలబడడానికి ప్రధాన కారణం ఇరాన్, రష్యాల అండ. వీరితోబాటుగా పొరుగున ఉన్న ఇరాక్, లెబనాన్ లోని హిజ్బుల్లాల మద్దతు కూడా అసద్ ప్రభుత్వానికి సాయపడింది. తిరుగుబాటు దళాలు డమాస్కస్ నగరానికి దగ్గరగా వస్తుండగా, తన భార్యాబిడ్డలతో మాస్కోకి పలాయనం చేసి, ఇపుడు అక్కడ కంటి వైద్యునిగా కొనసాగనున్నాడు. తన సైన్యాలు, గట్టి దెబ్బ తిన్నా, పోరు నుండి వైదొలగవనీ, తనకు మద్దతు ఇచ్చిన జనాలను ధైర్యంగా ఉండాలనీ, ఇటువంటి ఒక్క ఊరడింపు మాటా, ప్రకటనా లేకుండా సిరియా విడిచిపెట్టాడు అసద్. మాస్కో చేరుకున్న కొన్నాళ్ళకి టెలిగ్రామ్ మాధ్యమం ద్వారా ఈసురోమనే ఓ చిన్న సందేశం విడుదల చేశాడు.

> అమెరికా, ఇజ్రాయిల్ పేరుకి రెండూ వేర్వేరు దేశాలైనా, అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక్కటిగానే పరిగణించాలి. ఇజ్రాయిల్ విజయం, అమెరికాకి కూడా గెలుపే. సిరియాలో ప్రభుత్వ మార్పు వల్ల ఇరాన్‌కే కాదు, రష్యాకి కూడా ఓ గట్టి దెబ్బ. రష్యాని బలహీనపరచాలన్న, అమెరికా దీర్ఘకాలిక వ్యూహానికి ఇదో గెలుపు. మొన్నటి వరకు ఆఫ్రికా దేశాలకు వెళ్ళే రష్యా రవాణా విమానాలు సిరియా విమానాశ్రయాలలో ఇంధనం నింపుకునేవి. ఆ సదుపాయం రష్యాకు ఇకపై ఉండదు. ఆఫ్రికాకు వెళ్లే రష్యా సైనిక విమానాలకు, ముఖ్యంగా సహెల్ దేశాలకు వెళ్లే విమానాలకు మార్గ మధ్యంలో ఇంధనం దొరకడం ప్రస్తుతం అనిశ్చితం.

2014లో రష్యా, ఇరాన్‌ల సాయంతో సిరియా సైన్యం తిరుగుబాటు దళాలను వెనక్కి నెట్టింది. ఇలా ఓటమి పొంది చెల్లాచెదురైన పలు దళాలు, టర్కీ సరిహద్దులకు దగ్గరలో ఉన్న ఇడ్లిబ్ పట్టణంలో తిరిగి జతగూడాయి. అప్పటి వరకు అల్- ఖైదాలో భాగంగా ఉన్న అతి పెద్ద తిరుగబాటు దళం, 2016లో అల్- ఖైదాతో తెగతెంపులు చేసుకుని ఇడ్లిబ్‌లో హెచ్.టి.ఎస్ (హయాత్ తహ్రీర్ అల్-షామ్ లేదా అల్-షామ్ విముక్తి కూటమి) పేరిట అవతరించి, ఇడ్లిబ్ నగర పాలనను తన కిందకి తెచ్చుకుంది. అదే హెచ్.టి.ఎస్ ఇప్పుడు డమాస్కస్‌పై జెండా ఎగరేసింది.

అల్ ఖైదాకి ఒకశాఖగా పుట్టిన హెచ్.టి.ఎస్, అల్-ఖైదా నుండి వ్యవస్థాగతంగా విడిపోయినా, భావ జాలంలో మారలేదు. సిరియాని ఒక ఖిలాఫత్ (ఖలీఫా కింది ఇస్లాం పాలన)గా తీర్చిదిద్దడం వారి ఆశయం. తాము మతభ్రష్టులుగా ముద్ర వేసిన అలావీలు, ఆర్మీనిన్లు, కుర్దులు, షియాలు ఇతర మైనార్టీలపై ఇరాక్, ఉత్తర సిరియా లలో పలుచోట్ల తాను సాగించిన ఊచకోతలకి పేరుగాంచినవాడు హెచ్.టి.ఎస్ అధినేత అబూ మహమ్మద్ అల్-జోలానీ. అల్-ఖైదా అవతారం విడిచి గడ్డం కత్తిరించి, ఖాకీ బట్టలు వేసి విలేకరులతో ఆచితూచి మాట్లాడుతూ, కూడగట్టిన అపఖ్యాతి చెరుపు కోడానికి అల్-జోలాని ఇపుడు చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. అంతర్జాతీయ మీడియా ద్వారా, ఇతనికంటిన అల్-ఖైదా నెత్తుటి మరకలు తుడిచి, ఒక సిరియా ప్రజాస్వామ్యవాదిగా వల్లె వేసే ప్రయత్నం కనిపిస్తోంది.



సిరియా దేశస్తులైన ఇద్దరు మిత్రులతో డిసెంబర్ 12న నేను మాట్లాడినప్పుడు, మైనార్టీ సముదాయాలకు చెందిన ఆ ఇద్దరూ ప్రాణ భయం వెల్లడించారు. ఇప్పుడున్న పండగ వాతావరణం సద్దుమణిగి, మున్ముందు మైనార్టీలపై మారణకాండగా మారబోతోందని వారికి తెలుసు. వారెరుగున్న అలావి, షియా కుంటుంబాలపై ఇప్పటికే ఓ మాదిరి దాడులు మొదలయ్యాయి.

2003లో సద్దాం ప్రభుత్వం కూలిన వెంటనే ఇరాక్‌లో నెలకొన్నట్లు అనిపించిన ప్రశాంతత, తర్వాత కొన్ని వారాల్లో మొదలైన అంతర్యుద్ధంగా మారిందని మరో మిత్రుడు గుర్తుచేశాడు. సిరియాలో కూడా, అనుకోని తీరులో కుప్పకూలిన పాత ప్రభుత్వ బలగాలు తేరుకుని తిరగబడతాయా అన్నది ఓ ప్రశ్న. అధికారంలోకి వచ్చిన ఈ కొత్త శక్తుల కింద సిరియా సమాజంలో ఏం జరగనుందో చెప్పడం కష్టం. ముఖ్యంగా యుద్ధ కాలంలో పక్క దేశాలకు చెదిరిపోయిన డెబ్బయి లక్షల మంది సిరియన్లలో కొందరు వెనక్కి రాబోతున్నారు. వీరు తమ కష్టాలకు కారకులుగా ఎంచినవారిపై పగ సాధింపు దాడులకు పాల్పడే అవకాశం ఎక్కువ. ఇది శాంతితో ముగిసే యుద్ధం కాదు.

ఈ సంక్షోభంలో నలుగుతున్న సిరియన్ ప్రజల పరిస్థితి అర్థం చేసుకుంటూనే, ఈ పరిణామాల ప్రభావం పొరుగు దేశాలపైన, అంతర్జాతీయంగానూ ఎలా ఉండనుందో అంచనాకు రావడం కూడా అవసరం. ఇజ్రాయిల్ నుండి, సహెల్ ప్రాంత దేశాల వరకు దీనిప్రభావం ఎలా ఉంటుందో చూద్దాం.

1.ఇజ్రాయిల్. అంతర్యుద్ధంలో తలమునకలై వున్న సిరియా బలహీనతను సందుగా తీసుకున్న ఇజ్రాయిల్, గత పదేళ్లుగా సిరియాలోని సైనక స్థావరాలపై ఎడతెరపిలేని బాంబు దాడులు చేసి, సిరియా అధికార సైన్యాలనూ, వారి మిత్ర దళాల (ముఖ్యంగా ఇరాన్, హిజ్బుల్లాల) యుద్ధ సామర్థ్యాలను బలహీనం చేసింది. గత ఏడాదిగా పాలస్తీనాలో జరుపుతున్న మారణకాండను తీవ్రం చేస్తూనే, మరో పక్క సిరియాలోని ఇరాన్, హిజ్బుల్లా దళాల సరఫరాలపై బాంబు దాడులను ముమ్మరం చేసింది. దానితో ఆగకుండా, హిజ్బుల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ హసన్ నస్రల్లాను చంపి, హిజ్బుల్లా పునాదులున్న దక్షిణ లెబనాన్‌పై ఆక్రమణ దాడి చేసింది. మరో వైపు, ఇడ్లిబ్ నుండి డమాస్కస్ మీద దాడికి వస్తున్న హెచ్.టి.ఎస్ సైన్యాలకు ఇజ్రాయిలీ వైమానిక రక్షణ కల్పిస్తూ, సిరియా ప్రభుత్వ సైన్యాలపై, వారి స్థానాలపై దాడులు చేసి సిరియా అరబ్ సైన్యాన్ని (అసద్ ప్రభుత్వ సైన్యం) నిర్వీర్యం చేసింది. డమాస్కస్ హెచ్.టి.ఎస్ బలగాలు స్వాధీనమవడంతో, ఇజ్రాయిల్, 1973 నుండి తమ ఆక్రమణలో ఉన్న గోలాన్ మిట్టలలోని (గోలాన్ హైట్స్) తన సైన్యాన్ని (డివిజన్-210) బలోపేతం చేసి, అక్కడ ఐక్య రాజ్య సమితి ఏర్పరిచిన బఫర్ జోన్‌పై దాడి చేసి ఆక్రమించింది. అంతే కాదు. ఆ బఫర్ జోన్‌ను దాటి ఇజ్రా యిల్ ట్యాంకులు డమాస్కస్‌కు దగ్గర లోకి వచ్చాయి. ఇజ్రా యిల్ సైన్యాలు సిరియా లో ఇంత లోనికి చొచ్చుకు వచ్చినా, అధికారంలోకి వచ్చిన హెచ్.టి.ఎస్ నుండి ఎటువంటి ప్రతిఘ టనా లేదు.

> 2011లో విఫలమైన ప్పటికీ, ఇవే శక్తుల్లోని కొన్ని వర్గాలు డిసెంబర్ 7న అసద్ ప్రభుత్వాన్ని పడదోసి డమా స్కస్ స్వాధీన పరుచుకున్నాయి. గత పదేళ్లుగా అసద్ ప్రభుత్వం నిలబడడానికి ప్రధాన కారణం ఇరాన్, రష్యాల అండ. వీరితోబాటుగా పొరుగున ఉన్న ఇరాక్, లెబనాన్ లోని హిజ్బుల్లాల మద్దతు కూడా అసద్ ప్రభుత్వానికి సాయపడింది. తిరుగుబాటు దళాలు డమాస్కస్ నగరానికి దగ్గరగా వస్తుండగా, తన భార్యాబిడ్డలతో మాస్కోకి పలా యనం చేసి, ఇపుడు అక్కడ కంటి వైద్యునిగా కొనసాగనున్నాడు. తన సైన్యాలు, గట్టి దెబ్బ తిన్నా, పోరు నుండి వైదొలగవనీ, తనకు మద్దతు ఇచ్చిన జనాలను ధైర్యంగా ఉండాలనీ, ఇటువంటి ఒక్క ఊరడింపు మాటా, ప్రకటనా లేకుండా సిరియా విడిచిపెట్టాడు అసద్. మాస్కో చేరుకున్న కొన్నాళ్ళకి టెలిగ్రామ్ మాధ్యమం ద్వారా ఈసురోమనే ఓ చిన్న సందేశం విడుదల చేశాడు.

2.టర్కీ. సిరియాలో 2011లో తిరుగుబాటు మొదలైన నాటి నుండే, టర్కీ ప్రభుత్వం దానికి సైనిక, ఆర్థిక సహాయాలు చేస్తూ వచ్చింది. సిరియా నుండి వెలివేయబడ్డ ముస్లిం సోదర కూటమి ప్రభుత్వానికి ఇస్తాంబుల్‌లో నెలవు కల్పించింది. 2020లో సిరియా అరబ్ సైన్యం (అసద్ ప్రభుత్వ సైన్యం) ఇడ్లిబ్‌కి పారిపోయిన తిరుగుబాటు దళాలపై సైనిక చర్య మొదలెట్టినపుడు టర్కీ సిరియా మీద దాడి చేసి, అసద్ ప్రభుత్వం మెడలు వంచి, తాము ఇడ్లిబ్‌పై దాడి చేయబోమన్న ఒప్పందం వారిపై రుద్దింది. ఇడ్లిబ్ నుండి వెళ్ళి డమాస్కస్‌ని తమ ఆధీనంలోకి తీసుకున్న, సాయుధ దళాల్లో దాదాపు అందరూ టర్కీ నుండి శిక్షణ పొందినవారే. ఉత్తరాన కుర్దులతో, దక్షిణాన సిరియా అరబ్ సైన్యాలతో పోరాడడానికి కావాల్సిన ఆయుధాలను వీరికి టర్కీ అందించింది. టర్కీ చొరవతోటే మధ్య ఆసియా నుండి ఎందరో సాయుధ ఇస్లామిక్‌వాదులు వచ్చి హెచ్.టి.ఎస్ లో కలిశారు. ఇలా చేరినవారిలో చైనా నుండి వచ్చిన ఈగుర్లు కూడా ఉన్నారు. గత పదేళ్ళలో, టర్కీ సిరియాపై రెండుసార్లు దాడి చేసి, కొంత భూభాగాన్ని ఆక్రమించి, అది చారిత్రికంగా టర్కీకి చెందాల్సినదని సమర్థించుకుంది. టర్కీ గుప్పిట్లో ఉన్న ఆ భూభాగం, హెచ్.టి.ఎస్ ఏలుబడిలో ఉన్న సిరియాకి తిరిగిరాదన్నది స్పష్టం.

3. లెబనాన్ ఇరాక్. 2003లో సద్దాం హుస్సేన్ పతనం తరువాత-లెబనాన్, సిరియాలోని తన కూటమి మిత్రులకు (హిజ్బుల్లా, అసద్ ప్రభుత్వం) సరఫరాల కోసం ఇరాన్, సిరియా గుండా ఒక భద్రమైన తోవ ఏర్పరిచింది. ప్రభుత్వ మార్పుతో, ఆ దారుల్లో హిజ్బుల్లాకి సామాగ్రి పంపడం ఇప్పుడు కష్టతరం. లెబనాన్, ఇరాక్ సరిహద్దుల్లో ఉన్న సిరియా, ఈరోజు ఓ అల్-భావజాలం ఉన్న సంస్థ ఏలుబడి కిందకు వచ్చింది. అ ప్రాంతంలో ఏం జరుగ బోతోందన్నదానిపై ఒక స్పష్టత లేనప్పటికీ, ఈ రెండు దేశాలలో షియాలను దెబ్బతీయాలని చూసే అల్-ఖైదాకి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పగలం.

4. పాలస్తీనా. పాలస్తీనా విమోచన పోరాటంపై, అక్కడ ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతపై సిరియాలోని పరిణామాలు తీవ్రమైన ప్రభావం చూపను న్నాయి. హెచ్.టి.ఎస్‌కి సదుపాయంగా, అసద్ సైన్యాలను బలహీన పర చడంలో ముఖ్య పాత్ర పోషించిన ఇజ్రాయిల్ పాలస్తీనాలో సాగిస్తున్న ఆగడాల ను, దురాక్రమణను అల్-జోలాని ఖండించి, ఎదిరించే అవకాశాలు గానీ లేదా హమాస్, హిజ్బుల్లాలకు ఇరాన్ నుండి సిరియా ద్వారా వచ్చే సరఫరాలను అనుమతించే అవకాశంగానే లేదనే చెప్పాలి. అతని పేరే గోలాన్ ప్రాంతవాడని సూచించినా, ఇజ్రాయిల్‌తో పోరాడి దాని ఆక్రమణ కిందున్న గోలాన్ మిట్టల్ని (గోలాన్ హైట్స్‌ని) తిరిగి సిరియా కిందికి తెచ్చే ఆలోచన, అల్ 'జోలానీ' ప్రభుత్వానికి లేదు. సిరియా, లెబనాన్‌లలో ఇజ్రాయిల్ ఈ మధ్య కబళించిన ప్రాంతాలు దానికి కవచంలా పని చేస్తూ, పూర్వం ఈజిప్ట్, జోర్డాన్లతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందాలతో (1979, 1994) కలిపి ఇజ్రాయిల్‌కి కొత్త ధీమాని తెచ్చిపెట్టాయి. ఇజ్రాయిల్ పొరుగు దేశాలేవీ దాన్ని ఎదిరించే స్థితిలో ఈరోజు లేవు. దీనితో పాలస్తీనా పోరాటం ఆసా ంతం ఒంటరిదైంది. వారి పోరు ఆగేది కాకున్నా, పోరాటానికి కావాల్సిన సామాగ్రి, సాయం అందించే పొరుగువారు ఎవరూ మిగల్లేదు.

5. సహెల్ ప్రాంతం. అమెరికా, ఇజ్రాయిల్ పేరుకి రెండూ వేర్వేరు దేశాలైనా, అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక్కటిగానే పరిగణించాలి. ఇజ్రాయిల్ విజయం, అమెరికాకి కూడా గెలుపే. సిరియాలో ప్రభుత్వ మార్పు వల్ల ఇరాన్‌కే కాదు, రష్యాకి కూడా ఓ గట్టి దెబ్బ. రష్యాని బలహీనపరచాలన్న, అమెరికా దీర్ఘకాలిక వ్యూహానికి ఇదో గెలుపు. మొన్నటి వరకు ఆఫ్రికా దేశాలకు వెళ్ళే రష్యా రవాణా విమానాలు సిరియా విమానాశ్రయాలలో ఇంధనం నింపుకునేవి. ఆ సదుపాయం రష్యాకు ఇకపై ఉండదు. ఆఫ్రికాకు వెళ్లే రష్యా సైనిక విమానాలకు, ముఖ్యంగా సహెల్ దేశాలకు వెళ్లే విమానాలకు మార్గ మధ్యంలో ఇంధనం దొరకడం ప్రస్తుతం అనిశ్చితం.

సహెల్ దేశాలైన బుర్కినా ఫాసో, మాలి, నైజర్‌లలో అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే జాతీయ ప్రభుత్వాలు ఈ మధ్య ఏర్పాటయ్యాయి. ఇప్పటిదాకా వీటికి రష్యా సైనిక సాయం అంతో ఇంతో అందుతోంది. సిరియాలోని పరిణామాలతో రష్యా బలహీనం కావడం వల్ల, ఇదే అదనుగా అమెరికా, సహెల్‌కు సరిహద్దులలో ఉన్న నైజీరియా, బెనిన్‌లను, సహెల్ దేశాల మీద దాడులకు పురిగొల్పే అవకాశం ఉంది.ఈ ప్రాంత పరిణామాలను మున్ముందు జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉంది.

శత ప్రయోగాల వేదిక శ్రీహరికోట



డి.జనక మోహనరావు
8247045230

శ్రీహరికోట, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి నుండి జనవరి 29న తన 'వందవ ' ప్రయోగం జీఎస్ఎల్వి - ఎఫ్15 ద్వారా ఎన్వీఎస్ - 02 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా నింగిలోకి ప్రవేశపెట్టడంతో శ్రీహరికోట రికార్డులకెక్కింది. 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని మొదటిసారిగా ప్రయోగించింది. 2024 డిసెంబర్ చివరి వారంలో స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా ప్రయోగించిన పిఎస్ఎల్విసి - 60 షార్ నుంచి చేసిన 99వ ప్రయోగం. తొలి ప్రయోగం చేసిన 46 ఏండ్లలోనే ఈ ప్రగతి సాధించడం విశేషం. ఈ సందర్భంగా ఒకసారి మన అంతరిక్ష విజయ పరంపరను పునరావలోకనం చేసుకుందాం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే దేశ రక్షణ అవసరాలు, అభివృద్ధికి అంతరిక్ష పరిజ్ఞాన అవసరాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనా వ్యవస్థను ఏర్పరచేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు పితామహుడయిన విక్రం సారాభాయ్ 1957లో రష్యా మొట్టమొదటి ఉపగ్రహం స్పుత్నిక్‌ను ప్రయోగించిన తరువాత మనదేశానికి కూడా ఉపగ్రహ అవసరాన్ని నాటి ప్రధాని నెహ్రూకు తెలియజేసి సాంకేతిక పరిజ్ఞాన్ని సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చేటప్పుడే మన దేశంలోని ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చని ఒప్పించి, 1962లో భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ.జె. బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఇన్‌కోస్పార్)ను ఏర్పర్చారు. భవిష్యత్తులో ఇతర దేశాలు ఉపగ్రహానికి కావలిసిన సకల పరికరాలను అందించకపోవచ్చని ముందుగానే ఊహించిన సారాభాయ్ అవసరమయిన అన్ని భాగాలనూ దేశీయంగానే తయారు చేసే దిశగా ప్రయత్నం చేశారు. 1969లో ఇన్‌కోస్పార్ ఇస్రోగా రూపొందింది. ఉపగ్రహాలను తయారు చేయడంతోపాటు వాటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించిన సారాభాయ్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎల్వి) ఉపగ్రహ వాహకనౌక రూపకల్పనకు నాంది పలికారు.



మొదటి నుండి ఉపగ్రహాల నిర్మాణాన్నే దృష్టిలో పెట్టుకుని దానికి అవసరమయిన భూ ఉపరితల లక్షణాలను అధ్యయనం చేసేందుకు కేరళలో త్రివేండ్రం వద్ద తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ నెలకొల్పి అమెరికా, రష్యాల నుండి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగిస్తూ ఉపరితలాన్ని అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. కానీ దీని చుట్టూ జనసంచారం ఎక్కువగా ఉండటం, పైగా ఆ కేంద్రం మినీ రాకెట్ ప్రయోగాలకే పరిమితం కావడం కారణాన్న భవిష్యత్తులో చేయబోయే భారీ రాకెట్ ప్రయోగాల దృష్ట్యా భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం మరోచోట రాకెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అనువైన రాకెట్ ప్రయోగ కేంద్ర స్థలం కోసం అన్వేషణలో అన్ని ప్రాంతాలనూ పరిశీలిస్తూ రాగా ఏపీలోని శ్రీహరికోట దీవి ఆయన కంటపడింది.

శ్రీహరికోట ప్రత్యేకత

రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు ఎంత దగ్గరగా ఉంటే భూమ్యాకర్షణను అధిగమించి పైకి వెళ్లేందుకు రాకెట్‌కు అంత తక్కువ ఇంధనం ఖర్చౌతుంది. శ్రీహరికోట భూమధ్యరేఖకు దగ్గరగా ఉండడం ఇస్రో ఈ స్థలాన్ని ఎంచుకోవడానికి ఒక కారణం. భౌగోళికంగా సాంకేతికంగా, ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉన్న ఫ్రెంచి గయానాలోని కౌరు రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు కేవలం ఏడు డిగ్రీల అక్షాంశంలోనూ, ఎంతో గొప్పదిగా చెప్పుకునే అమెరికాలోని కేఫ్ కెన్నెడీ రాకెట్ ప్రయోగ కేంద్రం భూమధ్య రేఖకు 28 డిగ్రీల అక్షాంశంలోనూ ఉండగా శ్రీహరికోట 13 డిగ్రీల 43 సెకండ్ల అక్షాంశం మీద ఉంది. భూమధ్య రేఖకు అత్యంత దగ్గరగా ఉన్న కేంద్రాల్లో ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఇంకా రాకెట్ ప్రయోగదిశలో భూభాగాలేవీ లేకపోవడం, ఒకవేళ ప్రయోగమేదైనా విఫలమైనా రాకెట్ శకలాలు సముద్రంలో పడిపోయేందుకు వీలుండడం లాంటి కారణాలు కూడా కలిసి రావడం దీని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 1969లో శ్రీహరికోట రాకెట్ కేంద్రంగా ఎంపికయింది. ఇక్కడ నుంచి 1979 ఆగస్ట్ 10న ఎస్ఎల్వి 3ఇ -1 రాకెట్ ద్వారా రోహిణి టెక్నాలజీ పేలోడ్‌ని ప్రయోగించింది. కానీ ఈ ప్రయోగం సఫలం కాలేదు. షార్ నుంచి ఇస్రో జరిపిన 99 ప్రయోగాల్లో 9 మాత్రమే విఫలమయ్యాయి. విజయవంతమైన ప్రయోగాల్లో 129 స్వదేశీ ఉపగ్రహాలను, 433 విదేశీ ఉప గ్రహాలను, రెండు ప్రైవేట్ ఉపగ్రహాలను, ఒక గగనయాన్ టెస్ట్ వెహికిల్ డీ వన్, 18 స్టూడెంట్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. 2008లో చంద్రయాన్1, 2014లో మంగళ్‌యాన్, 2016లో పునర్వినియోగ లాంచి వాహనపు తొలిపరీక్ష, 2016లో ఒకే రాకెట్టుతో 20 ఉపగ్రహాల ప్రయోగం, 2017లో ఒకే రాకెట్టుతో 104 ఉపగ్రహాల ప్రయోగంతో ప్రపంచరికార్డు నెలకొల్పింది. 2017లో జిఎస్-ఎల్వి మార్క్ 3 ప్రయోగం, 2023లో చంద్రయాన్- 3తోపాటు దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన క్రయోజెనిక్ ఇంజన్ కూడా విజయవంతమయ్యాయి.

ఎన్వీఎస్ - 02

నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్విఎస్) అనేది భారతదేశ స్వతంత్ర ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది మనదేశంలోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి కచ్చితమైన స్థానం, వేగం, సమయ (పివిటి) సేవలను అందించడానికి రూపొందించబడింది. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి ఒకటి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్పీఎస్), రెండు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్). ఎస్పీఎస్ 20 మీటర్ల కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని, సేవా ప్రాంతంలో 40 నానో సెకెన్‌కంటే మెరుగైన సమయం కచ్చితత్వాన్ని అందిస్తుంది.

రెండోతరం ఉపగ్రహాల్లో మొదటిదైన ఎన్వీఎస్-01ను 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 ద్వారా ప్రయోగించారు. తొలిసారిగా ఎన్వీఎస్-01లో స్వదేశీ అణు గడియారాన్ని ప్రయోగించారు. ఎన్వీఎస్ సిరీస్లోని రెండో ఉపగ్రహం ఎన్వీఎస్-02ను ఎల్1, ఎల్5, ఎస్ బ్యాండ్లలో నావిగేషన్ పేలోడ్తో కాన్ఫిగర్ చేయడంతో పాటు సీ-బ్యాండ్లోని పేలోడ్ను దాని మునుపటి ఎన్వీఎస్-01 మాదిరిగానే రూపొందించారు. ఇది 2250 కిలోల లిఫ్ట్-ఆఫ్ ద్రవ్యరాశి, 3 కిలోవాట్ల పవర్ హ్యాండ్లింగ్ సామర్థ్యంతో స్టాండర్డ్ - ఐ2కె బస్ ప్లాట్ఫామ్ పై కాన్ఫిగర్ చేయబడింది. ఐఆర్ ఎన్ఎస్ఎస్ -1ఈ స్థానంలో 111.75 డిగ్రీల ఉష్ణోగ్రతను అమర్చనున్నారు. ఎన్వీఎస్-02 ఖచ్చితమైన సమయ అంచనా కోసం స్వదేశీ, సేకరించిన పరమాణు గడియారాల కలయికను ఉపయోగిస్తుంది. ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని ఇతర ఉపగ్రహ ఆధారిత వర్క్ సెంటర్ల సహకారంతో యుఆర్ శాటిలైట్ సెంటర్ (యుఆర్ఎస్సి) లో రూపొందించి అభివృద్ధి చేసి, ఇంటిగ్రేట్ చేశారు. ఉపగ్రహం వివిధ దశల్లో దాని పనితీరు సమ్మతి, సమగ్ర ప్రీ-షిప్‌మెంట్ సమీక్ష 2024 డిసెంబర్ 27న పూర్తయింది. ఈ ఉపగ్రహాన్ని 2025 జనవరి 05న భారత ప్రయోగ కేంద్రం ఎస్డీఎస్సీ-షార్కు పంపగా సక్సెస్ అయింది. ఈ ప్రయోగంలో పాలుపంచుకున్న ప్రతీ ఒక్కరినీ అభినందించాల్సిందే. ఈ విజయం ప్రతీ భారతీయునిది.

జీవన వాహిని

నా మౌనం..ఒక మహా నినాదం
నా భావుకత..ఒక పురోగమన సోపానం
నా అంతరంగం..ఒక చైతన్య ప్రవంతి
నా ప్రశాంత వదనం,
లోలోపలి పొరల్లో భూకంపకేంద్రం
నా సుప్తశక్తి..అంతర్గత సంఘర్షణకు ఇంధన వనరు
నా సున్నిత స్పందనాతత్వం..
ఈ సృష్టిని వెలిగించే చైతన్యదీపం
నా ప్రశాంత మానస నదీ ప్రవాహం అలలు,
అలజడులు సృష్టించే సముద్ర తుఫాను కేంద్రకం



నా జోలపాట..ఒక విప్లవగీతం
నా నిశ్చలతత్వం..ఒక మహా విస్ఫోటనా కేంద్రం
నీకు కనపడేది స్వీయ భ్రమణం మాత్రమే!
దాంతోపాటు కలగలిసి
ఉన్నది సమాజ పరిభ్రమణం!!
నిశ్చలంగా, మౌనంగా,
ప్రశాంతంగా ఉన్న నాకు గాక
నీ గావుకేక ఇంకెవరికి స్పష్టంగా వినిపిస్తుంది?
అయితే...నా మధుర సంకీర్తన
నీ కన్నీటి సెలయేర్లను ఆపగలదా?
అందుకే...దిక్కులన్నీ ప్రతిధ్వనించేలా చెలరేగే
నా తాండవ పద ఘట్టనల రాపిడితో
నీ అనర్గళ అఖండజ్యోతిని వెలిగిస్తా!
అది అనంత వెలుగుల
సౌహార్ద జీవనవాహినిగా కొనసాగనీ!!

- గిరిధర్, 9849801947

ఉత్తర కుమార ప్రగల్భాలు మానుకోవాలి

కేసీఆర్‌కు మహేష్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉత్తర కుమార ప్రగల్భాలు మానుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ మాజీ సీఎం కల్వకుంట చంద్రశేఖరరావును ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలు ఫామ్‌హౌస్ పాలన, గడీల పాలన కోరుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వారు ప్రజాపాలన కోరుకుంటున్నారని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించిందని గుర్తు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నేతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఆయన వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ చర్చను పక్కదారి పట్టించేలా కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపినా, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా ఇంకా కేసీఆర్ గుణపాఠం నేర్వకుండా ఫామ్‌హౌస్‌లో పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయినా... ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. బీఆర్‌ఎస్ పదేండ్లలో రేషన్‌కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూసినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40లక్షల వరకు రేషన్‌కార్డులు ఇస్తామంటే కూడా తట్టుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులతో బీఆర్‌ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో కేసీఆర్ కాంగ్రెస్‌పై అవాకులు, చెవాకులు పలుకుతున్నారని విమర్శించారు. ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో ఎలాంటి మార్పు రావడం లేదని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదని హెచ్చరించారు. పదేండ్ల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఏడాది పాలనపై చర్చకు ఎన్ని సార్లు సవాలు విసిరినా స్పందించలేదని విమర్శించారు.



వర్గీకరణ పట్ల మోడీ తాత్సారం

మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణ పట్ల ప్రధాని మోడీ తాత్సారాన్ని ప్రదర్శిస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వంద రోజుల్లో వర్గీకరణ పూర్తి చేస్తామన్న మోడీ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన రోజే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. తీర్పు వచ్చి ఆరునెల్లు గడించిందన్నారు. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. .మాదిగల వల్లే తాను రాజకీయంగా ఎదిగానని రేవంత్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. అయితే ఆయన మాటలకు చేతలకు పొంతన లేదని విమర్శించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ,కొప్పుల రాజు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వారిని కాదని వర్గీకరణ చేస్తే తన పదవి ఊడుతుందని రేవంత్ రెడ్డి భయపడుతున్నారన్నారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చయినా నోటిఫికేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో చెప్పిన సీఎం.. మాట తప్పారని విమర్శించారు. కాంగ్రెస్ వర్గీకరణకు అనుకూలంగా ఉంటే వివేక్ వ్యతిరేక సభ ఎలా పెడతారని ప్రశ్నించారు. ఈ నెల 10 లోగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే బీఆర్‌ఎస్ తరపున కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు , మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్ గువ్వల బాలరాజు ,చిరుమర్తి లింగయ్య ,డాక్టర్ మెతుకు ఆనంద్ ,సుంకే రవిశంకర్ ,పార్టీ నేతలు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ,ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయాలపై మాట్లాడే అర్హత కవితకు లేదు

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నీచమైన రాజకీయాల గురించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడడం విడ్డూరమని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆమెకు అక్కడ రాజకీయాలపై మాట్లాడే నైతిక అర్హత లేదని ఆయన ఎద్దేవా చేశారు. నీచమైన రాజకీయాలు ఎవరు చేస్తున్నారో, యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. కల్వకుంట్ల ఫ్యామిలీ డైవర్షన్ పాలిటిక్స్ అందరికీ తెలిసిపోయిందన్నారు. లిక్కర్ సామ్రాజ్య కేసులు రోజుకోటి బయటపడుతున్నాయని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు ఢిల్లీలోనే బయటపడిన బాగోతం ఇప్పుడు కేరళలో కూడా లిక్కర్ కుంభకోణాలు బయట పడుతున్నాయని ఆరోపించారు. లిక్కర్ దందాలు దేశవ్యాప్తంగా ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయో రోజుకొక్కటి బయట పడుతూనే ఉంటాయని ఎద్దేవా చేశారు. వాటి నుంచి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. నీళ్ల విషయంలో కేసీఆర్ చేసినంత అన్యాయం తెలంగాణకు ఇంకెవరూ చేయలేదన్నారు.

ఇండ్ల కోసం 7,100.. రేషన్‌కార్డుల కోసం 1736

ప్రజావాణికి పోటెత్తిన దరఖాస్తుల వెల్లువ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. మొత్తం 9307 దరఖాస్తులు అందగా. ..అందులో ఇందిరమ్మ ఇండ్ల కోసం 7,100, రేషన్ కార్డుల కోసం 1,736 అర్జీలు అందాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా భవన్‌కు వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 211, విద్యుత్ శాఖకు 160, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి 01, ఇతర శాఖలకు 56 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీస్ లిమిటెడ్

MedPlus
CIN - L85110TG2006PLC051845
Regd. Office: H.No:11-6-56, Survey No: 257 & 258/1, Opp: IDPL Railway Siding Road, Moosapet, Kukatpally, Hyderabad-500037

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.మిలియన్లలో)

	వివరాలు	స్టాండ్‌అలోన్			కన్సాలిడేటెడ్		
		ముగిసిన త్రైమాసికం 31.12.2024 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31.12.2024 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31.12.2023 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31.12.2024 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31.12.2024 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31.12.2023 (ఆడిట్‌చేయనివి)
1	పూర్తి ఆదాయం	1,789.82	5,176.30	1,499.27	15,739.62	46,592.68	14,512.63
2	పన్నుకు ముందు నికర లాభం	120.30	332.60	42.25	566.00	1,221.73	199.62
3	పన్ను తరువాత నికర లాభం	93.69	263.53	31.71	458.70	989.13	137.05
4	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం/(నష్టం) (కాలవ్యవధి కొరకు కంప్రైసింగ్ లాభం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	93.69	263.53	35.37	458.70	989.13	149.57
5	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.2/- చొప్పున)	239.39	239.39	239.07	239.39	239.39	239.07
6	రివ్యాల్యుయేషన్ రిజర్వులు మినహాయించి ఇతర ఈక్విటీ						
7	ఈక్విటీ వాటా ఒక్కింటికి రాబడి (రూ 2/- చొప్పున) (వార్షికం కానిది)						
	బేసిక్	0.78	2.20	0.27	3.84	8.28	1.15
	డైల్యూటెడ్	0.78	2.19	0.27	3.82	8.24	1.14

గమనికలు:

1) పై నివేదిక అనునది, సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్చేంజీలతో దాఖలుచేసిన ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం. ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్చేంజీల వెబ్‌సైట్స్: (www.bseindia.com and www.nseindia.com) మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: (www.medplusindia.com) పై అందుబాటులో ఉంటాయి.

2) పై ఆర్థిక ఫలితాలు ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు సిఫారసు చేయబడినవి మరియు 31 జనవరి, 2025న నిర్వహించిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఆమోదించబడినవి & రికార్డుపై తీసుకోబడినవి.

3) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద అవసరమైన పరిమిత సమీక్ష అనునది కంపెనీ యొక్క ఆడిటర్లు పూర్తి చేశారు.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరపున మరియు కొరకు
మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీస్ లిమిటెడ్
సం/-
జి.మధుకర్ రెడ్డి
సిఇఓ & మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 00098097)

ప్రదేశం: హైదరాబాద్
తేది: 31 జనవరి, 2025

K&R RAIL ENGINEERING LTD

Regd. Office: 3rd Floor, Sai Krishna, Plot No.797 A, Road No.36, Jubilee Hills, Hyderabad, Telangana, 500033. Contact no.: 040-27000499/ 040-27017660, Email Id: www.krrailengg.com. CIN: L45200TG1983PLC082576

31.12.2024తో ముగిసిన త్రైమాసికం కొరకు స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాల నివేదిక

రూపాయలు లక్షల్లో

క్ర. సం.	వివరాలు	స్టాండ్‌అలోన్						కన్సాలిడేటెడ్					
		ముగిసిన త్రైమాసికం 31.12.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 31.12.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన 9 నెలలకు 31.12.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన 9 నెలలకు 31.12.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినవి	ముగిసిన త్రైమాసికం 31.12.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 30.09.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన త్రైమాసికం 31.12.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన 9 నెలలకు 31.12.2024 ఆడిట్‌చేయనివి	ముగిసిన 9 నెలలకు 31.12.2023 ఆడిట్‌చేయనివి	ముగిసిన సంవత్సరం 31.03.2024 ఆడిట్‌చేసినవి
1	ఆపరేషన్‌ల నుండి పూర్తి ఆదాయం	15,276.90	16,209.85	14,656.96	45,713.39	51,315.87	66,590.60	15,234.70	16,209.85	14,472.09	41,358.33	46,219.61	61,570.95
2	పన్నుకు ముందు నికర లాభం	988.06	757.69	147.52	2,187.68	2,162.76	1,093.72	979.00	763.20	145.75	1929.45	1513.40	995.3
3	పన్ను తరువాత నికర లాభం	642.8	494.46	103.92	1,455.08	1,556.85	778.46	636.49	499.98	104.87	1270.57	1090.35	711.88
4	పూర్తి సమగ్ర ఆదాయం	642.22	493.27	102.65	1,452.12	1,555.58	776.00	636.49	499.98	104.87	1270.57	1090.35	711.88
5	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.6/- చొప్పున)	3810.89	2850.89	2,117.10	3810.89	2117.1	2117.1	3810.89	2850.89	2,117.10	3810.89	2117.1	2117.1
6	వాటా ఒక్కింటికి రాబడి												
	1) బేసిక్:	2.65	2.27	0.49	5.99	7.85	4.62	2.27	2.3	0.5	5.23	5.5	3.36
	2) డైల్యూటెడ్	2.3	1.41	0.24	5.2	3.68	1.87	2.62	1.43	0.25	4.54	2.58	2.02

గమనికలు:
1) పై పేర్కొన్న ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 29 జనవరి, 2025న నిర్వహించబడిన సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.
2) పోల్చుట నిమిత్తం గత కాలవ్యవధి అంకెలు అవసరమైనచోట రీగ్రూప్ చేయబడినవి.
3) సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్చేంజీలతో దాఖలుచేసిన ముగిసిన త్రైమాసికం/తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మాట్ యొక్క సారాంశం. ముగిసిన త్రైమాసికం/తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్చేంజీ వెబ్‌సైట్: www.bseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్: www.krrailengg.com నందు అందుబాటులో ఉంటాయి. వాటి సమాచారం దిగువ ఇచ్చిన క్విక్ రెస్పాన్స్ (క్యూఆర్)కోడ్‌ను స్కాన్ చేయుట ద్వారా పొందవచ్చును.

For K&R Rail Engineering Ltd
సం/-
అమిత్ బన్సల్
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 30-01-2025

MADHUCON PROJECTS LIMITED

CIN: L74210TG1990PLC011114
Regd. Office : 1-7-70, Jublipura, Khammam-507 003, Telangana.

31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ మరియు కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

(రూ.లక్షల్లో)

క్ర. సం	వివరాలు	స్టాండ్‌అలోన్						కన్సాలిడేటెడ్					
		ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిది నెలలకు		ముగిసిన సం॥	ముగిసిన త్రైమాసికం			ముగిసిన తొమ్మిది నెలలకు		ముగిసిన సం॥
		31.12.2024 ఆడిట్‌చేయని	30.09.2024 ఆడిట్‌చేయని	31.12.2023 ఆడిట్‌చేయని	31.12.2024 ఆడిట్‌చేయని	31.12.2023 ఆడిట్‌చేయని	31.03.2024 ఆడిట్‌చేసినవి	31.12.2024 ఆడిట్‌చేయని	30.09.2024 ఆడిట్‌చేయని	31.12.2023 ఆడిట్‌చేయని	31.12.2024 ఆడిట్‌చేయని	31.12.2023 ఆడిట్‌చేయని	31.03.2024 ఆడిట్‌చేసినవి
1	కార్యకలాపాల నుండి పూర్తి ఆదాయం	12,533.27	36,688.16	25,913.25	72,731.47	70,130.55	120,566.74	17,820.13	39,473.83	27,640.14	83,537.99	80,754.26	146,515.73
2	పన్నుకు ముందు కాలవ్యవధిలో నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	(408.60)	(876.69)	(446.28)	(1,416.70)	(1,162.26)	(2,030.45)	(44,724.40)	(1,152.10)	(1,656.36)	(46,543.26)	(5,793.80)	(7,085.77)
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(408.60)	(876.69)	(446.28)	(1,416.70)	(1,162.26)	(2,030.45)	(44,724.40)	(1,152.10)	(1,656.36)	(46,543.26)	(5,793.80)	(7,085.77)
4	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తరువాత)	(295.60)	(240.13)	(233.84)	(1,047.85)	(756.82)	(1,026.94)	(44,616.01)	(515.55)	(1,435.27)	(46,179.02)	(5,379.72)	(6,074.90)
5	ఈక్విటీ వాటా మూలధనం	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95	737.95
6	వాటా ఒక్కింటికి రాబడి (అసాధారణ ఐటంలకు ముందు) (రూ. 1/- చొప్పున)												
	(ఎ) బేసిక్	(0.40)	(0.33)	(0.32)	(1.42)	(1.03)	(1.39)	(57.22)	(0.61)	(1.69)	(59.13)	(6.76)	(6.11)
	(బి) డైల్యూటెడ్	(0.40)	(0.33)	(0.32)	(1.42)	(1.03)	(1.39)	(57.22)	(0.61)	(1.69)	(59.13)	(6.76)	(6.11)

గమనికలు:

1) పై పేర్కొన్న ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు (స్టాండ్‌అలోన్& కన్సాలిడేటెడ్) ఆడిట్ కమిటీ ద్వారా సమీక్షించబడినవి మరియు 30 జనవరి, 2025న నిర్వహించబడిన వారి సంబంధిత సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ద్వారా ఆమోదించబడినవి.

2) సెబీ (లిస్టింగ్ మరియు అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్చేంజిలు (ఎన్ఎస్ఇ & బిఎస్ఇ)తో దాఖలు చేయబడిన 31 డిసెంబర్, 2024తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలలకు సంబంధించి త్రైమాసికం/ సంవత్సరానికి ఆర్థిక ఫలితాలు (స్టాండ్‌అలోన్& కన్సాలిడేటెడ్) వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. ఆర్థిక ఫలితాలు (స్టాండ్‌అలోన్ & కన్సాలిడేటెడ్) పూర్తి వివరాలు స్టాక్ ఎక్చేంజీల వెబ్‌సైట్ (www.bseindia.com, www.nseindia.com) మరియు కంపెనీ వెబ్‌సైట్: www. madhucon.com పైన అందుబాటులో ఉంటాయి.

3) కంపెనీ యొక్క కార్యకలాపాలు ప్రాథమికంగా కన్‌స్ట్రక్షన్-ప్రాజెక్టు ఆక్టివిటీస్‌ను కలిగియుంది మరియు ఐఎన్‌డి ఎఎస్-108 "ఆపరేటింగ్ సెగ్మెంట్స్" క్రింద ఏ ఇతర రిపోర్టబుల్ సెగ్మెంట్లు లేవు.

4) గత కాలవ్యవధి యొక్క అంకెలు అవసరమైనచోట రీగ్రూప్/ రీఅరెంజ్ చేయబడినవి.

5) కంపెనీస్ (ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్) రూల్స్, 2015 మరియు ఆ తరువాత సంబంధిత అమెండ్‌మెంట్ రూల్స్‌లోని రూల్ 3తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 133 క్రింద నిర్దేశించినట్లుగా ఇండియన్ అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఐఎన్‌డి ఎఎస్)తో అనుసరించి ఈ ఆర్థిక ఫలితాలు సిద్ధం చేయబడినవి.

బోర్డు ఆదేశాల మేరకు
For **MADHUCON PROJECTS LIMITED**

Sd/-
Mohammad Shafi
Jt. Managing Director
DIN: 07178265

Sd/-
K. Venkateswarlu
Director cum CFO
DIN: 09713108

Place : Hyderabad
Date : January 30, 2025



కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- కులదురహంకార హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి : వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు

నవతెలంగాణ-తుంగతుర్తి

ఇటీవల సూర్యాపేట జిల్లా కేంద్రంలో కులదురహంకార హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు కోరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో శుక్రవారం వడ్లకొండ కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్గవిని మూడేండ్లు ప్రేమించి పెండ్లి చేసుకున్న కృష్ణను యువతి అన్నలు, వారి స్నేహితులు కలిసి దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు జరిపించి.. హత్య పూర్వాపరాలను పరిశీలించి నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చూడాలన్నారు. వడ్లకొండ కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, ఐదెకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలన్నారు. ఆ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు పులుసు సత్యం, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లా సుదర్శన్, సీఐటీయూ జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, నాయకులు వడ్లకొండ సులేమాన్, కందుకూరి చంద్రు తదితరులు ఉన్నారు.

ఫామ్‌హౌస్ నుంచే మాట్లాడుతారా? అసెంబ్లీకి వచ్చేది లేదా?

- కేసీఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కేసీఆర్ ఫామ్ హౌస్ నుంచే మాట్లాడుతారా? అసెంబ్లీకి వచ్చేది లేదా? అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 3 నెలలుగా ఫామ్ హౌస్‌కే పరిమితమై మౌనంగా ఉన్నానని కేసీఆర్ అంటే సరిపోదనీ, ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యల్ని ప్రస్తావించాలని సూచించారు. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి రాలేదనీ, ప్రతిపక్ష నేతగా ఏడాది అసెంబ్లీకి రాలేదని గుర్తుచేశారు. ఆయన జీవితమంతా ఫామ్‌హౌస్‌నని విమర్శించారు. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. ప్రజలన్నా.. ప్రజాతీర్పు అన్నా కేసీఆర్ కు ఏనాడూ గౌరవం లేదని విమర్శించారు. ఓడిపోయిన తర్వాత ప్రజా తీర్పును శిరసావహిస్తున్నామని ఆయన ప్రకటించలేదన్నారు. ప్రతిపక్షనేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొర మాదిరి మాట్లాడుతున్నారని విమర్శించారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌస్‌లో కూర్చొని మాట్లాడటం సరిగాదనీ, ప్రజల్లోకి రావాలని కోరుతున్నామని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివిన తమరు ప్రభుత్వానికి సూచనలు ఎందుకు చేయడంలేదు? సీఎం సభకు రావాలని పదేపదే అహ్వానిస్తున్నా ఎందుకు రావడం లేదు?అని ప్రశ్నించారు. 2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అస్సెంబ్లీ కి వస్తారని ఆశించామన్నారు. ఫామ్‌హౌస్‌కు కరెంటు కోతలు ఎక్కడవి? ఎంత సరఫరా అవుతున్నదనే దానిపై లెక్కలు తీద్దామా? ఫామ్‌హౌస్‌కు నీళ్ల ఎక్కడవి? అని ప్రశ్నించారు. రైతు భరోసా ఇచ్చింది తమ ప్రభుత్వమేననీ, ఉచిత కరెంటు తెచ్చిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. ఏ గురుకులం సందర్శనకైనా తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అద్దె గదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసినవారు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రైతుల రుణమాఫీ కోసం 20 వేల కోట్ల రూపాయలు వెచ్చించింది కండ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఏదైనా ఒక ప్రతిపాదికన మాట్లాడాలని సూచించారు.

పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థిగా వి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిని ఏఐసీసీ ప్రకటించింది. శుక్రవారం ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా వి. నరేందర్‌రెడ్డి పేరును ప్రకటించారు.

కొత్తవి కట్టలే..హైడ్రా, మూసీ ప్రాజెక్టు పేరిట కూల్చివేతలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కటీ కొత్తగా కట్టలేదనీ, హైడ్రా, మూసీ ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. కేసీఆర్ దూరదృష్టితో పదేండ్ల కాలంలో పట్టణాలు ఎంతో అభివృద్ధి సాధించాయనీ, జాతీయ అవార్డులు పొందాయని గుర్తుచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మున్సిపల్ చైర్మెన్లు, చైర్‌పర్సన్‌లను ఆయన సత్కరించారు. పట్టణీకరణ అపాలని కొన్ని దేశాలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తుచేశారు. పదేండ్లు డైలాగులు కొడితే పట్టణాలు అభివృద్ధి కాలేదనీ, పక్క ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం వంటి నిరంతర ఫోకస్తోనే తెలంగాణలో మోడల్ పట్టణాలు తయారయ్యాయని వివరించారు. పదవీ కాలం ముగిసిన చైర్మెన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలనీ, చేసిన అభివృద్ధిని చూసి ప్రజలే గెలిపిస్తారని చెప్పారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గర అయిందని గుర్తుచేశారు. ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టణాల్లో ప్రజల ఆస్తుల విలువ తగ్గిపోయిందన్నారు. నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేస్తే మంత్రులు అడ్డగోలు మాట్లాడుతున్నారని విమర్శించారు. నల్లగొండలో నాలుగు నెలలుగా సిబ్బందికి ఎందుకు జీతాలివ్వలేదని ప్రశ్నించారు. తనను బచ్చగాడు అంటున్న మంత్రి కోమటిరెడ్డి సీనియర్ అయ్యుండి పట్టణాభివృద్ధికి ఏం చేస్తున్నారని నిలదీశారు. మోసపూరిత 420 హమీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు పాలన చేయడం రావడం లేదని విమర్శించారు. టకీ టకీ మని పైసలు పడుతాయన్నారుగానీ..చెప్పినట్టుగానే టకీ టకీమని ఢిల్లీ పెద్దలకు పైసలు కొడుతున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరున్నర లక్షల రేషన్‌కార్డులిస్తే కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదని అబద్ధాలు చెబుతున్నదని విమర్శించారు.

స్మార్ట్‌ఫోన్‌ను వాడేస్తున్నారు

దేశంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం విరివిగా పెరిగిపోయింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు.. ప్రతి ఒక్కరి చేతిలో ఇది సర్వసాధారణమైపోయింది. ఒకరకంగా చెప్పాలంటే వారి జీవితంలో ఒక భాగమనొచ్చు. చేతిలో స్మార్ట్‌ఫోన్‌లేనిదే ఉండలేని పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా, టీనేజీ పిల్లలైతే స్మార్ట్‌ఫోన్లకు బానిసలవుతున్నారు. గేమ్స్, సోషల్ మీడియాలో ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఒకప్పుడు ఇది పట్టణ, నగరాలకే పరిమితమై ఉండేది. కానీ, ఈ జాఢ్యం ఇప్పుడు ప్రాంతాలతో సంబంధం లేకుండా అంతటా వ్యాపించింది. భారత్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని టీనేజర్లలోనూ స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది.

- 82 శాతం మందికి ఎలా ఉపయోగించాలో తెలుసు
- కానీ.. చదువుకు వినియోగిస్తున్నది 57 శాతం మంది మాత్రమే

గ్రామీణ భారతంలో 14-16 ఏజ్ గ్రూప్ టీనేజర్ల తీరు : ఏఎస్ఈఆర్ 2024





ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్‌కు సంబంధించిన ప్రతి ఒక్క ఫీచర్ గురించీ చాలా మంది పిల్లలకు తెలుసు. అందులో గేమ్స్, సోషల్‌మీడియా, ఓటీటీ మూవీస్.. ఇలా అనేక రకాల యాప్‌లను వినియోగించటంలో ముందుంటున్నారు. 14-16 ఏండ్ల వయసున్న టీనేజర్లలో 82 శాతం మందికి స్మార్ట్‌ఫోన్‌ను ఎలా ఉపయోగించాలో తెలుసని 'ది యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (ఏఎస్ఈఆర్) 2024' వెల్లడించింది. అయితే, 57 శాతం మంది మాత్రమే దీనిని విద్యా ప్రయోజనాల కోసం ఉపయోగించారని వివరించింది. రెండ్రోజుల క్రితమే ఈ నివేదిక విడుదలైంది. దేశవ్యాప్తంగా 605 జిల్లాల్లోని 17,997 గ్రామాల్లో ఉన్న 6,49,491 మందిని సర్వే చేసి ఈ నివేదికను రూపొందించారు.

డిజిటల్ లిటరసీలో జెండర్‌గ్యాప్

డిజిటల్ లిటరసీలో బాలికలు వెనకబడి ఉన్నారు. సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ స్కిల్స్ విషయంలో బాలికలతో పోలిస్తే.. బాలురు ఎక్కువ అవగాహనను కలిగి ఉన్నారు. సోషల్‌మీడియా వాడుతున్నవారిలో ఆన్‌లైన్ కనీస భద్రతా ప్రమాణాలు గురించి అవగాహన ఎక్కువగా ఉన్నది. 62 శాతం మందికి ఒక ప్రొఫైల్‌ను బ్లాక్, రిపోర్ట్ చేయటం గురించి తెలుసు. ప్రొఫైల్‌ను ప్రయివేటుగా ఉంచుకోవటం 55.2 శాతం మందికి, పాస్‌వర్డ్ మార్చుకోవటం 57.7 శాతం మందికి అవగాహన ఉన్నది. ఈ సేఫ్టీ ఫీచర్స్‌లోనూ బాలురే ముందున్నారు. 70.2 శాతం మంది బాలురు, 62.2 శాతం మంది బాలికలు డిజిటల్ టాస్క్‌ల(అలారం సెట్ చేయటం, సమాచారం కోసం వెతకటం, యూట్యూబ్ వీడియోను లొకేట్ చేయటం) కోసం స్మార్ట్‌ఫోన్లను పొందగలిగారు. ఇందులో బాలురు(81.5 శాతం), బాలికలు (72.4 శాతం) మధ్య లింగ అంతరం ఉన్నది. ఏపీ, కేరళ, కర్నాటక వంటి రాష్ట్రాల్లో బాలురతో సమానంగా లేదా వారి కంటే మంచి ప్రదర్శనను బాలికలు చూపారు.

ఆందోళన కలిగిస్తున్న అటెండెన్స్

ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థి, ఉపాధ్యాయుల హాజరు 2018 నుంచి కొంత పురుగతి కనబడినా.. అది ఆందోళనకరంగా ఉన్నది. సగలు విద్యార్థి హాజరు 72.4 శాతం నుంచి 2024లో 75.9 శాతంతో స్వల్ప పెరుగుదలనే నమోదు చేసింది. టీచర్ అటెండెన్స్ 2018లో 85.1 శాతం నుంచి 2024లో 87.5 శాతానికే పెరగటం గమనార్హం.

తల్లుల్లో పెరిగిన అక్షరాస్యత

దేశంలో అక్షరాస్యులైన తల్లుల సంఖ్య పెరిగింది. 2014లో 3-8 ఏజ్ గ్రూపు పిల్లలకు చెందిన 43 శాతం తల్లులు, 25 శాతం మంది తండ్రులకు ఫార్మల్ స్కూలింగ్ లేదు. 2024 నాటికి ఇది తల్లుల విషయంలో 24 శాతం, తండ్రుల విషయంలో 16 శాతానికి తగ్గింది. కనీసం ప్రైమరీ స్కూల్‌ను పూర్తి చేసిన తల్లుల సంఖ్య 43 శాతం నుంచి 64 శాతానికి, తండ్రుల సంఖ్య 61 శాతం నుంచి 72 శాతానికి పెరిగింది.

ఒకే తరగతిలో పలు గ్రేడ్లకు చెందిన విద్యార్థులక పాఠాలు

60 మంది విద్యార్థుల కంటే తక్కువ మందిని కలిగి ఉన్న ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్ల సంఖ్య వేగంగా పెరిగింది. 2022లో ఈ సంఖ్య 44 శాతంగా ఉంటే.. 2024లో అది 52.1 శాతానికి ఎగబాకింది. జమ్మూకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, నాగాలాండ్, కర్నాటకలలో 80 శాతానికి పైగా ప్రైమరీ స్కూళ్లున్నాయి. ఇవి చిన్న పాఠశాలలుగా పరిగణించబడుతున్నాయి.హిమాచల్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 75 శాతం చిన్న ప్రాథమికోన్నత స్కూళ్లు ఉన్నాయి. ఒకటి, రెండో తరగతులకు చెందిన మూడింటా రెండు వంతులు క్లాసుల్లో పలు గ్రేడ్లకు చెందిన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. చిన్న స్కూళ్లలో ఒకే తరగతి గదిలో పలు గ్రేడ్లకు చెందినవారిని కూర్చోబెట్టి పాఠాలు బోధించటం ఒక సవాలేనని విద్యావేత్తలు, మేధావులు అంటున్నారు.

'స్మార్ట్‌ఫోన్‌నూ కలిగి ఉన్నారు'

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. ఈ ఏజ్ గ్రూపులో 76 శాతం మంది స్మార్ట్‌ఫోన్‌ను సోషల్ మీడియా కోసం వాడారు. 90 శాతం మంది బాల, బాలికలకు తమ ఇండ్లలో స్మార్ట్‌ఫోన్ యాక్సెస్ ఉన్నది. స్మార్ట్‌ఫోన్‌ను కలిగి ఉన్నవారి(ఓనర్‌షిప్) సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉన్నది. ఇందులోనూ లింగ వ్యత్యాసం ఎక్కువగా ఉన్నది. 36.2 శాతం మంది బాలురు, 26.9 శాతం మంది బాలికలు స్వంతంగా స్మార్ట్‌ఫోన్‌ను కలిగి ఉన్నారు. ఇక 14 ఏండ్ల వయసున్న చిన్నారులు 27 శాతం, 16 ఏండ్ల వయసున్నవారు 37.8 శాతం మందికి స్వంతంగా ఫోన్లను కలిగి ఉన్నారు. చదువుకోసం స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగిస్తున్న బాలబాలికల సంఖ్య సమానంగానే ఉన్నది. 78.8 శాతం మంది బాలురు, 73.4 శాతం మంది బాలికలు సోషల్ మీడియాను వాడుతున్నారు. కేరళలో 80 శాతం మందికి పైగా పిల్లలు చదువు కోసం స్మార్ట్ ఫోన్‌ను వాడారు. 90 శాతం మందికి పైగా సోషల్‌మీడియాలో మునిగితేలారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరు దుర్మరణం

- నలుగురి పరిస్థితి విషమం
- పదిమందికి తీవ్రగాయాలు - మరో పది మందికి స్వల్ప గాయాలు
- ఓవర్ టేక్ చేయబోతుండగా ప్రమాదం
- డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం
- క్షతగాత్రులందరూ బోనకల్ వ్యవసాయ కూలీలే



నవతెలంగాణ- బోనకల్

పొట్టకూటి కోసం 25 మంది వ్యవసాయ కూలీలు ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లాలో కూలీ పనుల కోసం ట్రాక్టర్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. పదిమందికి తీవ్ర గాయాలు కాగా మరో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలోని వైరా-జగ్గయ్యపేట ప్రధాన రహదారిలోని సాగర్ కాలువ వద్ద శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ గ్రామానికి చెందిన 25 మంది వ్యవసాయ కూలీలు ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రానికి చెందిన రైతుకు మిర్చి పనుల కోసం రైతు పంపించిన ట్రాక్టర్‌లో వెళ్తున్నారు. బోనకల్ గ్రామం దాటగానే సాగర్ కాలువ సమీపంలో ట్రాక్టర్ డ్రైవర్ ముందుగా వెళుతున్న ఓ వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోగా ఎదురుగా లారీ వస్తుండటంతో ఒక్కసారిగా డ్రైవర్ కంగుతున్నాడు. దాంతో ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. కూలీలు.. యార్లగడ్డ వరమ్మ, ఆత్మకూరి లక్ష్మీదేవి, లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి, నిమ్మగడ్డ సుబ్బమ్మ ట్రక్కు కింద పడ్డారు. మిగిలిన 20 మంది కూలీలు ఆ పక్కనే నీటి గుంతలో పడ్డారు. ట్రక్కు కిందపడిన యార్లగడ్డ వరమ్మ(60) అక్కడికక్కడే మృతి చెందింది. ఆత్మకూరు లక్ష్మీదేవి, లింగనబోయిన నాగమణి, మరీదు ధనలక్ష్మి, నిమ్మగడ్డ సుబ్బమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పొలాల్లో ఉన్న రైతులు బోల్తా పడిన ట్రక్కును పైకి లేపి వారిని బయటకు తీశారు. నీటి గుంతలో పడ్డ మరో 20మందిని స్థానికులు కాపాడారు. వీరిలో మరీదు పద్మ, గాలి కృష్ణవేణి, మొర్ల మహాలక్ష్మి, మరీదు శైలజ, మోర్ల నారాయణమ్మ, లింగం సుశీల, పసల త్రివేణి, పెద్ద గౌండ్ల వెంకటరమణ, మరీదు సత్యం, జామిలిలకు తీవ్ర గాయాలయ్యాయి.

మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బోనకల్ గ్రామస్తులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కాపాడేందుకు ప్రయత్నాలు చేశారు. ఎస్ఐ కడగండ్ల మధుబాబు తన సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని ట్రక్కు కింద పడి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న వారిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని ట్రాలీ ఆటో, మరో మూడు 108 వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మకూరు లక్ష్మీదేవి, నిమ్మగడ్డ సుబ్బమ్మ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉండటంతో వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. మిగిలిన వారందరూ అక్కడే చికిత్స పొందుతున్నారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలిసింది. ఖమ్మంలో క్షతగాత్రులను వైరా ఏసీపీ మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మధిర సీఐ దొంగరి మధు, ఎస్ఐ కడగండ్ల మధుబాబు పరామర్శించారు. వరమ్మ మృతదేహానికి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటనాస్థలం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

ట్రాక్టర్ ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించండి : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

బోనకల్ ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన వ్యవసాయ కూలీలకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని ఖమ్మం మెడికల్ సూపరింటెండెంట్‌ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల బంధువులతో భట్టి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడొద్దని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన యార్లగడ్డ వరమ్మ కుటుంబానికి ఆయన సంతాపం తెలిపారు.



జేఎల్ పోస్టులకు ఎంపికైన వారికి నియామక పత్రాలు ఇప్పించండి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి అభ్యర్థుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికైన 1,392 మంది జూనియర్ లెక్చరర్ల (జేఎల్)కు త్వరగా నియామక పత్రాలను ప్రభుత్వం అందజేసేలా చొరవ చూపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని పలువురు అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టీజీపీఎస్సీ ద్వారా 15 ఏండ్ల తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,392 జేఎల్ పోస్టులకు 2022లో నోటిఫికేషన్ వచ్చిందని అభ్యర్థులు తెలిపారు. 2023లో రాత పరీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. గతేడాది జూలైలో మెరిట్ జాబితాను టీజీపీఎస్సీ ప్రకటించిందని వివరించారు. ఆ తర్వాత తుది ఫలితాలను విడుదల చేసిందని తెలిపారు. కానీ ఎంపికైన జేఎల్స్‌కు ఇప్పటి వరకు నియమకపత్రాలను అందజేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలను అందజేసి ఇది నిరుద్యోగ ప్రభుత్వమని నిరూపించిందని పేర్కొన్నారు. కానీ 1,392 జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను మాత్రం అందజేయడం లేదని వివరించారు. నియామక పత్రాలను త్వరగా అందిస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి కోసం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ముందుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట సతీష్‌కుమార్, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు జి లింగా నాయక్, ఎ వేణురావు, ముత్యాలు, బొజ్యా నాయక్, వీణాచారి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్‌రెడ్డి
- న్యూ శాయంపేటలోని ప్రభుత్వ భూమిలో పాతిన ఎర్రజెండాలు



నవతెలంగాణ-సుబేదారి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం ప్రభుత్వ భూమిని ఇండ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేసి, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం హన్మకొండ జిల్లా న్యూ శాయంపేట విష్ణుప్రియ గార్డెన్ వద్ద సర్వే నెంబర్ 966లోని ప్రభుత్వ భూమిలో ఆ పార్టీ కాజీపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ప్రభాకర్‌రెడ్డి ఎర్రజెండాలు పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో అనేకమంది పేదలు నిలువ నీడ లేక, ఇంటి అద్దె చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వ భూములను పేదలకు పంచి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమవుతుండగా అధికారులు చోద్యం చూస్తున్నారని, ఆ భూములను కబ్జాదారుల నుంచి రక్షించి పేదలకు పంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేలా తమ పోరాటాలతో ఒత్తిడి చేస్తామని తెలిపారు. కాజీపేట మండలంలోని ఇంటి స్థలం లేని ప్రతి పేదవారికి ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసి ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చుక్కయ్య, పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, నాయకులు కారు ఉపేందర్, జంపాల రమేష్, తొట్టె మల్లేశం, మదన్‌చారి, ప్రభాకర్, సదానందం, ఎండి షర్ఫుద్దీన్, జంపాల మురళి, జాటోత్ విజయ్, కుంచాల రమణయ్య, కురుకు రజిత, వనమాల, సరూప, లక్ష్మి, ఉమా, శారద, దినేష్, సాంబ లక్ష్మి, రమ, కోమల తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యూజే పేరును అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్, జేసీఎల్ సునీతా గోపాల్‌దాస్‌లకు హెచ్‌యూజే నేతల ఫిర్యాదు





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ గడ్డపై తొలిసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్థానిక జర్నలిస్టుల సంఘం 'హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే. రి.నెం.బి- 2794.) పేరును అనధికారికంగా ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ ఉన్నతాధికారులకు హెచ్‌యూజే ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని అంజయ్యభవన్‌లో కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఈ.గంగాధర్, జాయింట్ కమిషనర్ సునీత గోపాల్ దాస్‌తో రిజిస్టర్డ్ హెచ్‌యూజే సంఘం అధ్యక్షులు బి. అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి హెచ్‌యూజే నిఖార్సుగా పనిచేస్తున్నదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) సంఘం తమ హైదరాబాద్ యూనిట్‌కు అనధికారికంగా హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) పేరును ఉపయోగిస్తున్నదని ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలు అందజేశారు. ఇండియన్ ట్రేడ్ యూనియన్ యాక్టు 1926 ప్రకారం 2007 జూన్ 27న కార్మిక శాఖలో హెచ్‌యూజే రిజిస్ట్రేషన్ జరిగిందనీ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు అనుబంధ సంఘంగా హెచ్‌యూజే కొనసాగుతున్నదని వారికి వివరించారు. అనధికారికంగా తమ సంఘం హెచ్‌యూజే పేరు వాడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్, జాయింట్ కమిషనర్ సునీత గోపాల్‌దాస్‌ను కోరారు. దీనిపై స్పందిస్తూ విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు విజయానంద్, హెచ్‌యూజే ట్రెజరర్ బి.రాజశేఖర్, కార్యనిర్వాహక అధ్యక్షులు గండ్ర నవీన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సీహెచ్ మధుకర్, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు ఎం.రమేష్, జి.రేణయ్య, సంయుక్త కార్యదర్శులు అచ్చిన ప్రశాంత్, ఎం.జీవన్ రెడ్డి, నాయకులు హరి ప్రసాద్, రోజారాణి, పలువురు సీనియర్ జర్నలిస్టులున్నారు.

రాజ్యాంగంపై అసెంబ్లీలో ప్రత్యేకంగా చర్చించాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగం 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన శుక్రవారం లేఖ రాశారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి ఈనెల ఏడో తేదీన శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు పత్రికల్లో వచ్చిందని వివరించారు. ఈ సమావేశాల్లో భాగంగా రాజ్యాంగం 75 ఏండ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో 'రాజ్యాంగం, దాని అమలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణ'అనే అంశంపై ప్రత్యేక చర్చ చేపట్టాలని కోరారు. ఇటీవల పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 75 ఏండ్ల రాజ్యాంగంపై ఉభయ సభలు చర్చించాయని గుర్తు చేశారు. ఈనెల ఏడున రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో కూడా ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి 75 ఏండ్ల రాజ్యాంగంపై చర్చ జరపటం సముచితంగా ఉంటుందని వివరించారు. శాసనసభా నాయకులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

సంక్లిష్టతలు...సవాళ్లు

ఎంఎస్ఎంఈలకు గుదిబండలా జీఎస్టీ
పన్ను భారంతో కుదేలు
సంస్కరణలు అవసరమంటున్న ఆర్థిక నిపుణులు



న్యూఢిల్లీ : దేశంలో సంక్లిష్టంగా ఉన్న పన్ను వ్యవస్థను సంస్కరించేందుకు 'ఒకే దేశం...ఒకే పన్ను' నినాదంతో కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను ప్రవేశపెట్టింది. దేశంలోని సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) జీఎస్టీ విధానం రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది. ఈ సంస్థలకు అవకాశాలను అందించడంతో పాటు సవాళ్లను కూడా విసురుతోంది. జీఎస్టీ వ్యవస్థ కొందరికి పన్ను ప్రక్రియలను సరళతరం చేసిన మాట వాస్తవమే. అయితే అనేక ఎంఎస్ఎంఈలు సంక్లిష్టతలను చవిచూస్తూనే ఉన్నాయి. ఖర్చులు పెరిగిపోతున్నాయి. నగదు లభ్యతకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. విధానపరమైన లక్ష్యాలకు, చిన్న వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలకు మధ్య సున్నితమైన సమతూకం దెబ్బతింటోంది.

జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్న మాట నిజమే అయినప్పటికీ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతోంది. వ్యాపారాభివృద్ధి మందగిస్తోంది. నిర్వహణ వ్యయం పెరుగుతోంది. అంతిమంగా చిన్న సంస్థల మధ్య పోటీతత్వానికి విఘాతం కలుగుతోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరి కొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్‌ను సమర్పించబోతున్న తరుణంలో కొన్ని సంస్కరణలు అవసరమని, సవాళ్లను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని ఆర్థిక నిపుణులు సూచించారు.

ఎంఎస్ఎంఈల ప్రాధాన్యత

జీఎస్టీ కింద 3.16 కోట్ల ఎంఎస్ఎంఈలు నమోదయ్యాయి. దేశీయ జీడీపీ ఆదాయంలో వీటి వాటా 30 శాతం. దేశం నుండి జరుగుతున్న ఎగుమతుల్లో ఇవి సుమారు 50 శాతం వాటాను కలిగి ఉన్నాయి. దేశ ఆర్థికాభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు నిర్వహిస్తున్న కీలక పాత్రను ఈ గణాంకాలు చాటిచెబుతున్నాయి. వ్యవసాయం తర్వాత ఎక్కువగా ఉద్యోగాలు కల్పిస్తున్నవి ఎంఎస్ఎంఈలే. ఇవి దేశంలోని పారిశ్రామిక కార్మికుల్లో 80 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఎంఎస్ఎంఈలకు స్థానిక మార్కెట్లపై పూర్తి అవగాహన ఉంటుంది. వాటిని సమర్ధవంతంగా ఉపయోగించుకునే శక్తీ ఉంటుంది. బడా కార్పొరేట్ సంస్థలు దృష్టి సారించని గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో సైతం ఉద్యోగాలు కల్పించడం వీటి ప్రత్యేకత.

మిశ్రమ స్పందన

దేశంలోని ఎంఎస్ఎంఈలపై జీఎస్టీ మిశ్రమ స్పందన కలిగించింది. దాని అమలు, రిజిస్ట్రేషన్ ధోరణులపై భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. గుజరాత్, మహారాష్ట్రతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు జీఎస్టీ అమలుకు దారులు వేశాయి. అధిక వ్యాపార రిజిస్ట్రేషన్ రేట్లు, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, సపోర్ట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా ఎంఎస్ఎంఈకి అనుకూలమైన వాతావరణాన్ని కలిగించాయి.

అయితే బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో పాటు ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు జీఎస్టీ అమలులో వెనుకబడ్డాయి. సమ్మతి, రిజిస్ట్రేషన్ రేట్లు 40-50 శాతం కూడా దాటడం లేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోవడం, మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడం, మితిమీరిన నిబంధనల కారణంగా వ్యాపారాల నిర్వహణ వ్యయం పెరిగింది. చిరు వ్యాపారాలకు సమస్యలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో జీఎస్టీ మండలి 2024లో టీసీఎస్‌ను (ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్) ఒకటి నుండి 0.5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించింది.

పన్నుల వడ్డింపులో అసమానతలు

జీఎస్టీ వ్యవస్థ ఎంఎస్ఎంఈలకు సవాళ్లు విసురుతోంది. పన్ను శ్లాబుల్లో సంక్లిష్టతలు, పన్ను భారం ఆ సంస్థలను వెంటాడుతున్నాయి. ఉదాహరణకు బడా ఆటోమొబైల్ కంపెనీలు, ఇతర పరిశ్రమలకు విడిభాగాలు తయారు చేసి అందిస్తున్న ఎంఎస్ఎంఈలు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. అదే ట్రాక్టర్ వంటి యంత్రాలు, పరికరాలపై 12 శాతం పన్ను మాత్రమే విధిస్తున్నారు. అంటే విడిభాగాలు సరఫరా చేసే ఎంఎస్ఎంఈలపై అధిక జీఎస్టీ విధిస్తుండగా, వాటితో ఉత్పత్తులు పూర్తి చేసే బడా కంపెనీలపై మాత్రం తక్కువ జీఎస్టీ వేస్తున్నారు. అదీకాక రూ.40 లక్షల టర్నోవర్ కలిగిన ఎంఎస్ఎంఈలను ప్రారంభంలో జీఎస్టీ నుండి మినహాయించారు. ఆ పరిమితి దాటిన తర్వాత సవాళ్లు మొదలవుతున్నాయి. ప్రామాణిక 18 శాతం జీఎస్టీ రేటు చెల్లించడానికి అర్హత పొందిన తర్వాత వాటి ఆదాయం రూ.32.8 లక్షలకు పడిపోతుంది. దీనివల్ల అవి ఆర్థిక స్థిరత్వాన్ని కోల్పోతాయి. తిరిగి పెట్టుబడి పెట్టే, వ్యాపారాన్ని విస్తరించే సామర్థ్యం కూడా ఉండదు. ఈ నేపథ్యంలో ఎంఎస్ఎంఈలు, బడా కంపెనీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చాలంటే సమతూకమైన జీఎస్టీ నిర్మాణం అవసరమని, ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆర్థిక నిపుణులు సూచించారు. బడ్జెట్ రూపకల్పనలో కీలక భూమిక పోషించడంలో జీఎస్టీ పాత్ర కూడా ఉంటుంది.



సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనమివ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి టీఎస్‌సీపీఎస్ఈయూ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలను మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాను శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కేజీబీవీ, ఎస్ఓ, యూఆర్ఎస్, సీఆర్పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, పీటీఐలకు సమ్మె కాలపు వేతనాలను మంజూరు చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గతేడాది డిసెంబర్‌లో 16 రోజులు, గతనెలలో 12 రోజులు కలిపి మొత్తం 28 రోజులపాటు సమ్మె చేశారని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉప సంఘం హామీ మేరకు మానవీయ కోణంలో వేతనాలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు చంద్రకాంత్, కొండ శ్రీనివాస్, బ్యాంగి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం కోసం ఎన్ఐఎన్ సహకారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాల కోసం హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సంస్థ సహకారాన్ని తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) అధ్వర్యంలో రాష్ట్రంలో 268 రెసిడెన్షియల్ విద్యాసంస్థలున్నాయనీ, వీటిలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 1.70 లక్షల మంది విద్యార్థులున్నారని ప్రభుత్వం తెలిపింది. వీరికి ప్రతిరోజు భోజనంతో పాటు స్నాక్స్‌ను అందించే కామన్ డైట్ ప్రోగ్రాంను ప్రభుత్వం ఇటీవల ప్రారంభించింది. అయితే కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, కొన్ని చోట్ల ఆహార నాణ్యత లోపించిందనే ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందనీ, దానిలో భాగంగానే ఎన్ఐఎన్ సహకారం తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. విద్యా సంస్థలకు సరుకుల సరఫరా, ఆహారం తయారీ, వడ్డించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎక్సైజ్ అకాడమీలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. మంత్రి వెంట ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ, అబ్కారీ శాఖ కమిషనర్ సీహెచ్.హరికిరణ్ ఉన్నారు. అకాడమీ డైరెక్టర్ అజయ్‌రావు, ఇతర అధికారులు మంత్రి జూపల్లికి స్వాగతం పలికారు. అకాడమీ పనితీరు గురించి మంత్రికి అధికారులు వివరించారు. అకాడమీ అంతా కలియతిరిగిన మంత్రి ఆయా విభాగాల పనితీరు తెలుసుకున్నారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న 129 మంది మంది మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లతో సంభాషించారు. ట్రెనింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. అకాడమీలో భోజనం ఎలా ఉందది? నీటి సమస్య ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. అకాడమీలో అందుతున్న సేవలు, అక్కడి సౌకర్యాలు, శిక్షణ తరగతులు, ఇతర అంశాల గురించి శిక్షణ పొందుతున్న ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్స్ ను అడిగి తెలుసుకున్నారు. ట్రైనీలను ఉద్దేశించి మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న పోటీని తట్టుకుని ఎంతో కష్టపడి, స్వయంకృషితో ఇక్కడ వరకు వచ్చారని అభినందించారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజానికి మేలు చేసేలా సేవలందించాలనీ, అంకితభావంతో పని చేయాలని సూచించారు. సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమనీ, గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి వాటి బారి నుంచి యువతను కాపాడేందుకు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఉద్బోధించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా వాటి మూలాల నుంచి అరికట్టాలని సూచించారు.

ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం

- డాక్టర్ ఎం.రాజీవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజల ప్రాణాల కంటే ఏది ముఖ్యం కాదనే లక్ష్యంతో అనేక సమస్యలు ఎదురైనా సరే...ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణం ప్రారంభించటం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని టీజుడా మాజీ అధికార ప్రతినిధి, ఉస్మానియా ఆస్పత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.రాజీవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త భవనం రాకతో ఉస్మానియా ప్రతిష్ట జాతీయంగా, అంతర్జాతీయంగా మరింత ఇనుమడిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో జూడాలో సభ్యునిగా అందరిని కలుపుకుని కొత్త భవన నిర్మాణం కోసం పోరాడిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వానికి, ప్రత్యేకంగా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో రానున్న ఆర్థిక సంక్షోభం

- మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పులు, కాంగ్రెస్ సర్కారు దుబారా ఖర్చులతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం రాబోతున్నదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్. ప్రభాకర్ హెచ్చరించారు. రాష్ట్రంలో తక్షణమే ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని గవర్నర్‌ను డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యిందనీ, ఉద్యోగుల జీతాలు చెల్లించడమూ కష్టంగా మారిందని చెప్పారు. కొత్త అప్పుల కోసం బ్యాంకులను బెదిరించడం రాష్ట్ర ఆర్థిక సంక్షోభాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. వివాదాల్లోని, న్యాయ చిక్కుల్లోని భూములను కార్పొరేషన్లకు కేటాయించి, వాటిని తనఖా పెట్టి రుణం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ల పదవులు రాజకీయ నియామకాలుగా మారాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి కొత్త పెట్టుబడుల విషయంలో వివిధ విదేశీ కంపెనీలు, సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు చెబుతున్నప్పటికీ ఏడాది కాలంగా ఒక్క కంపెనీ కూడా ప్రారంభించిన దాఖలాలు లేవని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలనీ, ఆర్థిక వేత్తలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

డిప్యూటీ స్పీకర్ రఘురామ కేసులో డాక్టర్ ప్రభావతికి స్వల్ప ఊరట

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కేసులో డాక్టర్ నీలిమా ప్రభావతికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. రఘురామ కృష్ణరాజు కస్టడీ టార్చర్‌లో ఎటువంటి గాయాలు లేవని రిపోర్టు ఇచ్చిన డాక్టర్ ప్రభావతికి హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. డాక్టర్ నీలిమా ప్రభావతి ఉద్దేశపూర్వకంగానే రఘురామ కృష్ణరాజు కస్టడీ టార్చర్‌లో అయనపై ఎటువంటి గాయాలు లేవని రిపోర్టు ఇచ్చారని అన్నారు. అయితే ఆర్మీ ఆస్పత్రి వైద్యులు గాయాలు ఉన్నాయని రిపోర్టు ఇచ్చారని తెలిపారు. పిటిషనర్ డాక్టర్ ప్రభావతి తరపున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపించారు. డాక్టర్ ప్రభావతి ఉద్దేశపూర్వకంగా రిపోర్టు ఇవ్వలేదని, ఆమెతో పాటు మరో ఇద్దరు డాక్టర్లు కూడా ఉన్నారని తెలిపారు. ముగ్గురు డాక్టర్లు కలిసి వాస్తవానికి అనుగుణంగా రిపోర్టు ఇచ్చారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం డాక్టర్ ప్రభావతికి అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. అయితే ఆమె దర్యాప్తునకు సహకరించాలని, దర్యాప్తు అధికారికి నివేదించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సూచించింది. అలాగే మరో రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషన్ విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనతో పెరిగిన ఆత్మహత్యలు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ నిర్లక్ష్య పాలనతో రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరిగాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఇప్పటి వరకు రైతులు, చేనేత కార్మికులు, ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రస్తుతం బిల్డర్లూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్ణధామంగా ఉన్న హైదరాబాద్‌లో ఫ్లాట్లు అమ్ముడు పోలేదని బిల్డర్ (మేడ్చల్ జిల్లాలో) ఉరేసుకునే పరిస్థితి రావడం పట్ల విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత, అసమర్థ విధానాలు, శాంతి భద్రతలు దిగజారడం, పాలన పట్ల ప్రజల్లో నమ్మకం లేకపోవడం, అనుమతి ఉన్న ఇళ్లను సైతం హైడ్రా కూల్చి వేయడం, మూసీ, ఫార్మా సిటీ, మెట్రో కారిడార్ల విషయంలో ద్వంద్వ ప్రకటనలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయకపోవడం, భవన నిర్మాణ అనుమతులకు బలవంతపు వసూళ్లు చేయడం, కొత్త పెట్టుబడులు రాకపోవడం, ఇతర రాజకీయ, ఆర్థిక పరిణామాలు రియల్ ఎస్టేట్ రంగంపై దుష్ప్రభావాన్ని చూపించాయని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి ఇరుసుగా ఉన్న వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని ధ్వంసం చేశారు. హైదరాబాద్ గ్రోత్ ఇంజిన్ అయిన రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని విమర్శించారు. ఇప్పటికైనా మేల్కోకపోతే పదేళ్లుగా పురోభివృద్ధిలో ఉన్న తెలంగాణ, తిరోగమనం బాట పట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కస్తూర్బా బాలికల పాఠశాలల్లో పని చేయండి

- దేశ్‌పాండే ఫౌండేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలల్లో పని చేయాలని దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని ఆ ఫౌండేషన్ సభ్యులు కలిశారు. రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణకు ప్రభుత్వ సహకారాన్ని ఫౌండేషన్ కోరింది. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని సీఎం ఈ సందర్భంగా ఆ సభ్యులను కోరారు. దీనిపై ఆయన సూచనలను ఫౌండేషన్ అంగీకరించింది. తమ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పని చేయటమే గాక, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో ఫౌండేషన్ శిక్షణ ఇస్తున్నదని వారు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు పనిచేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి, శ్రీధర్ బాబు సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురురాజ్ దేశ్ పాండే ,జయ శ్రీ దేశ్ పాండే,రాజు రెడ్డి, జీ.అనిల్ పాల్గొన్నారు.

ఆరోగ్య మిషన్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచండి

ఆశా వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించండి : కేంద్రాన్ని కోరిన ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ



న్యూఢిల్లీ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)కు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచాలని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. వేలాది మంది ఆశా వర్కర్లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, వారికి చట్టబద్ధమైన ప్రయోజనాలన్నింటినీ కల్పించాలని సూచించింది.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ తన డిమాండ్లతో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాకు బహిరంగ లేఖ రాసింది. ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ దేశంలోని ఆశా వర్కర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అతి పెద్ద కార్మిక సంఘాల సమాఖ్య. తమను ఇప్పటికీ వర్కర్లుగానే గుర్తిస్తూ సామాజిక భద్రత, ఇతర ప్రయోజనాలు అందకుండా చేయడంపై ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ఆ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేసింది. తమకు కేవలం గౌరవం మాత్రమే సరిపోదని, చట్టబద్ధమైన హక్కులతో గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలని కోరింది. 2010లో సవరించిన రెండు వేల రూపాయల ప్రోత్సాహకాలనే ఇప్పటికీ కొనసాగిస్తున్నారని గుర్తు చేసింది. 'కోవిడ్ సమయం లోనూ, అంటువ్యాధులు ప్రబలిన పుడు కూడా ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి ఆశా వర్కర్లు ప్రజలకు సేవ చేశారు. అయినా వారిని ఉద్యోగులుగా గుర్తించడం లేదు. కేవలం వాలంటీర్లు గానే చూస్తున్నారు. ప్రోత్సాహకాల పేరుతో కేవలం రూ.2,000 విదిలిస్తున్నారు. వారికి సామాజిక భద్రత లేదు. ఆరోగ్య బీమా లేదు. మెటర్నిటీ సెలవులు కూడా లేవు.ఇది 75 సంవత్స రాలు పూర్తి చేసుకున్న మన రిపబ్లిక్‌కు సిగ్గుచేటు కాదా?' అని ఏడబ్ల్యూఎఫ్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మధుమిత బందో పాధ్యాయ ఆ లేఖలో ప్రశ్నించారు.

బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

- అసలు సమస్యలను పక్కదారి పట్టించేందుకు కృత్రిమ వివాదాలు
- అందులో భాగంగానే సోనియా గాంధీ వ్యాఖ్యల వక్రీకరణ
- రాష్ట్రపతితో అన్ని అవాస్తవాలనే చెప్పించారు : మంత్రి డాక్టర్ సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ వ్యాఖ్యలను బీజేపీ వక్రీకరిస్తోందనీ, దిగజారుడు రాజకీయాలు చేస్తున్నందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) విమర్శించారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అసలు సమస్యలను పక్కదారి పట్టించేలా లేని పోని వివాదాలు సృష్టిండం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో అన్ని అవాస్తవాలనే కేంద్ర ప్రభుత్వం చేర్పించిందని విమర్శించారు. సామాన్యులను పూర్తిగా రాష్ట్రపతి ప్రసంగం విస్మరించిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య, ఆర్థిక రంగ ఒడిదుడుకులను రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించలేదన్న విషయాన్ని కప్పిపుచ్చేందుకే సోనియా గాంధీ వ్యాఖ్యలపై వివాదం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఆదివాసీ రాష్ట్రపతిని అవమానలపాలు చేసేలా నరేంద్రమోడీ నేతృత్వంలోనిబీజేపీ వ్యవహరించిందని గుర్తు చేశారు. పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా బీజేపీ తన కురుచ బుద్ధిని ప్రదర్శించిందని విమర్శించారు.

ఆయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. ఆదివాసీలకు అడుగడునా అన్యాయం చేసి...ఇప్పుడు రాష్ట్రపతి అంశాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అటవీ హక్కు చట్టాన్ని నీరుగార్చి, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇష్టారీతిన మైనింగ్‌కు అనుమతులిస్తూ, పెసా చట్టాన్ని తుంగలో తొక్కిన బీజేపీ..ఆదివాసీల గౌరవం గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆప్‌కు షాక్

ఏడుగురు ఎమ్మెల్యేల రాజీనామా



న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు ముందు అధికార ఆమ్‌ఆద్మీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. వీరిలో రోహిత్ కుమార్ మెహ్‌రౌలియా (త్రిలోక్‌పురి), రాజేష్ రిషి (జనక్‌పురి), మదన్‌లాల్ (కస్తూర్బా నగర్), నరేష్ యాదవ్ (మెహ్‌రౌలి), భూపీందర్ సింగ్ జూన్ (బిజ్వాసన్), భావనా గౌర్, పవన్ శర్మ (ఆదర్శ్ నగర్) ఉన్నారు. పార్టీలో అవినీతి పెచ్చరిల్లడం వల్లనే రాజీనామా చేశానని నరేష్ యాదవ్ తెలిపారు. ఖురాన్‌ను వక్రీకరించిన కేసులో ఆయనకు పంజాబ్ కోర్టు నవంబరులో రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అయినప్పటికీ ఆప్ ఆయనను మెహ్‌రౌలీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇదిలావుండగా ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఎన్నికల కమిషన్ ఎదుట హాజరయ్యారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఆయన వెంట ఉన్నారు.

హర్యానా ప్రభుత్వం యమునా నదిలోకి విషపూరిత నీటిని విడుదల చేస్తోందంటూ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఢిల్లీలో నీటి సంక్షోభాన్ని నివారించేందుకు గళం విప్పానని, అందుకే తనకు ఈసీ నోటీసులు పంపిందని కేజ్రీవాల్ మండిపడ్డారు.

ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్ల ఖర్చు!

- ఫస్ట్ క్లాస్ టికెట్ కన్నా అధికం !
- గ్వాటెమాలాకు తరలింపు ప్రక్రియపై డేటా వెల్లడి

గ్వాటెమాలా సిటీ : చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారిని బలవంతంగా వారి స్వదేశాలకు పంపించే ప్రక్రియ గత వారం రోజుల నుండి శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు లాటిన్ అమెరికా దేశాలకు ఆరు విమానాలను పంపించారు. వీటిలో అమెరికాకు రెండు కార్గో విమానాలను తమ దేశంలో దిగేందుకు కొలంబియా నిరాకరించింది. ట్రంప్‌తో ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో మైగ్రెంట్లను తీసుకొచ్చేందుకు తమ స్వంత విమానాలనే పంపించింది. మిగిలిన నాలుగు విమానాలు గ్వాటెమాలా లోనే దిగాయి. ఇందులో భాగంగా గ్వాటెమాలాకు వెళుతున్న మిలటరీ విమానంలో ఒక్కో మైగ్రెంట్‌కు 4675 డాలర్లు ఖర్చవుతోంది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో నుండి అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కి చెందిన విమానంలో గ్వాటెమాలాకు వెళ్లాలంటే అయ్యే ఫస్ట్ క్లాస్ టిక్కెట్ కన్నా ఇది ఐదు రెట్లకు మించి అధికమని అమెరికా, గ్వాటెమాలా అధికారులు అందజేసిన డేటా పేర్కొంటోంది. ఫస్ట్ క్లాస్ టికెట్ ధర 853 డాలర్లుగా వుంది. పైగా అమెరికా ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి చెందిన కమర్షియల్‌చార్టర్ విమానానికి అయ్యే ఖర్చు కన్నా కూడా ఇది చాలా ఎక్కువ.

సి-17 సైనిక రవాణా విమానానికి గంటకు 28,500 డాలర్లు నిర్వహణా వ్యయం అవుతుందని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా అధికారి ఒకరు వెల్లడించారు. గ్వాటెమాలాకు వెళ్లి రావడానికి పదిన్నర గంటలు పడుతుంది. విమానాశ్రయంలో ఆగిన సమయాన్ని, లేదా టేకాఫ్ ఆపరేషన్స్‌కు పట్టే సమయాన్ని ఇందులో కలపలేదని ఆ అధికారి తెలిపారు. 64మందితో సోమవారం సైనిక రవాణా విమానం ఒకటి ఇక్కడకు వచ్చిందని గ్వాటెమాలా అధికారి తెలిపారు.

బానిసల పిల్లల కోసం తెచ్చారు..
జన్మత: పౌరసత్వంపై ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్ : బానిసల పిల్లల కోసం ఉద్దేశించి జన్మత: పౌరసత్వం తీసుకువచ్చారని, కానీ ప్రపంచమంతా ఇక్కడకు వచ్చి పోగుపడేందుకు కాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన రోజే జన్మత: పౌరసత్వాన్ని వ్యతిరేకిస్తూ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ 22 రాష్ట్రాల్లో ఐదు కేసులు నమోదయ్యాయి. ఆ మరుసటి రోజే సియాటెల్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ ఉత్తర్వులను కొట్టివేసింది. దీనిపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ట్రంప్ చెప్పారు. "జన్మత:పౌరసత్వం చట్టాన్ని బానిసల పిల్లల కోసం ఆనాడు తెచ్చారని అన్నారు.. అంతేకానీ ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన జనం అమెరికాకు వచ్చి ఇక్కడ ఆక్రమించడానికి కాదని అన్నారు.

సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా

డమాస్కస్ : సిరియా తాత్కాలిక అధ్యక్షులుగా అహ్మద్ అల్ షరా ఎంపికయ్యారు. సిరియా రాజధాని డమాస్కస్‌లో తిరుగుబాటు గ్రూపుల మధ్య జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. తిరుగుబాటు గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ అధ్యక్షుడిగా షరా పనిచేస్తున్నారు. ఈ గ్రూపు గతంలో అల్‌ఖైదాకు అనుబంధ గ్రూపుగా ఉండేది. ప్రస్తుతం తమకు అల్‌ఖైదాతో సంబంధాలు లేవని షరా చెబుతున్నారు. షరాపై అమెరికా గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని ప్రకటించింది. గత నెలలో అమెరికా ప్రతనిధి బృందం సిరియాలో పర్యటించిన తరువాత ఆ బహుమతిని రద్దు చేసింది. గత ఏడాదిలో తిరుబాటు దళాలు దాడి చేయడంతో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ప్రభుత్వం కూలిపోయింది. అసద్ ప్రస్తుతం రష్యా ఆశ్రయంలో ఉన్నారు.



నిర్వాసితుల ప్యాకేజీ ఊసే లేదు

- సీఎం ప్రకటన కోసం ప్రాజెక్టుల నిర్వాసితుల ఎదురుచూపులు

నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నిర్వాసితులకు ప్యాకేజీ ఊసే లేదు. 13 నెలలు గడుస్తున్నా భూ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో వారు ఆగ్రహంతో ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సిద్దిపేట జిల్లాలో భూసేకరణ చేపట్టారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం భూనిర్వాసితులకు పరిహారం అందించింది. కోర్టు కేసులు, చిన్నపాటి కారణాలతో కొంతమందికి ఆ పరిహారం అందలేదు. వారు తమకు రావాల్సిన పరిహారం కోసం వేచి చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. భూనిర్వాసితులకు అండగా ఉంటామని ఆ నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్.. దీక్షలు చేసింది.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి.. 13 నెలలు కావస్తున్నా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భూనిర్వాసితుల్లో కొంతమందికి రావాల్సిన ప్యాకేజీలపై నిర్ణయం తీసుకోకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో కొండపాక, తొగుట మండలాల్లోని 14 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీరందరికీ కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మించారు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములఘాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రాహ్మణ బంజేరు పల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో 330కి పైగా కుటుంబాలు ఉండగా, వీరి కోసం 2278 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను గత ప్రభుత్వం నిర్మించింది. అంతేకాక, ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూమితోపాటు ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడం, ప్రతి కుటుంబానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.7.50 లక్షలు, ఇల్లు వద్దనుకున్న వారికి ఓపెన్ ప్లాట్ మరో రూ.5.04 లక్షలు అందజేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే, 18 ఏండ్లు నిండిన పురుషులకు ఓపెన్ ప్లాట్, అమ్మాయిలకు పరిహారం చెక్కులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇదే తరహాలో కొండపోచమ్మ ముంపు గ్రామాల ప్రజలకు అందజేయనున్నట్టు ప్రకటించారు. కానీ ఆచరణలోకి వచ్చేసరికి కోర్టు కేసులు, చిన్నపాటి కారణాలతో 30శాతం పైగా నిర్వాసితులకు ఇంకా పరిహారం అందని పరిస్థితి ఉంది.

30శాతం మందికి అందని ప్యాకేజీ

వేములఘాట్ గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఇప్పటి వరకు ప్లాట్లు ఇవ్వలేదు. ఏటిగడ్డ కిష్టాపూర్‌లో 25 శాతం కుటుంబాలకు ఇంకా ప్యాకేజీలు రావాల్సి ఉంది. భూములు తీసుకున్నప్పటికీ వాటి పరిహారాన్ని ప్రభుత్వం ఇస్తామన్న ప్యాకేజీ పూర్తి స్థాయిలో అందించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. తమ పిల్లలకు ఇస్తానన్న ప్యాకేజీలు ఇవ్వడం లేదని తెలిపారు పల్లెపహాడ్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరు పల్లిలో నిర్వాసిత కుటుంబాలకు ప్లాట్లు ఇచ్చినప్పటికీ వాటిని ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయలేదు. దాంతో వారు ఇండ్లు నిర్మించుకోలేకపోతున్నారు. మరికొందరికి ప్యాకేజీ రాలేదు. ఎర్రవల్లి గ్రామంలో కొందరికి ఇండ్లు ఇచ్చారు. మరికొందరికి ప్యాకేజీ రాలేదు. ముఖ్యంగా 18 ఏండ్లు నిండిన వారికి అప్పటి ప్రభుత్వం ప్లాట్లు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు చేయ లేదు.



ఏండ్లు గడుస్తున్నా ప్లాట్ రిజిస్ట్రేషన్ కాలేదు : నిర్వాసితురాలు రూప, బ్రాహ్మణ బంజేరుపల్లి

ఇక్కడికొచ్చి ఏండ్లు గడుస్తున్నా ఇంకా ప్లాటు రిజిస్ట్రేషన్ కాలేదు. ప్రభుత్వం స్పందించడం లేదు. ఆగమేఘాల మీద తీసుకొచ్చి ఇక్కడ వేశారు. ఇప్పుడున్న సీఎం సారు సైతం మాకు న్యాయం జరగాలని అప్పుడు ధర్నా చేశారు. ఇప్పుడు ఆయనే ఉన్నాడు.. అయినా న్యాయం జరగటం లేదు.

ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై ప్రభత్వం దృష్టి పెట్టాలి : నిర్వాసితురాలు సుజాత, వేముల గట్టు గ్రామం



ప్లాటు రిజిస్ట్రేషన్ కాలేదు. ఏండ్లు గడుస్తున్నా ఇంకా ఇవ్వడం లేదు. ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై ప్రభుత్వం దృష్టిపెట్టి నిర్వాసితులకు న్యాయం చేయాలి. కాయకష్టం చేసుకునే వాళ్లం. ఇక్కడికొచ్చాక పని దొరకడం లేదు.

ప్రతి యేటా పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

- పోలీస్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్రస్థాయి పోటీలు :తెలంగాణ స్పోర్ట్స్ ఐజి రమేష్ రెడ్డి
- ఖోఖో, హాకీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలను ఇక నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలంగాణ స్పోర్ట్స్ ఐజీ రమేష్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మూడో పోలీస్ క్రీడల్లో శుక్రవారం ఆయన ఖోఖో, హాకీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జాతీయస్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు విశేష ప్రతిభ చాటి విజయకేతనం ఎగురవేయాలన్నారు. పోలీస్ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు, ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరక అభివృద్ధి, మానసిక వికాసం ఉల్లాసం కలుగుతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండి క్రీడల్లో పాల్గొనాలన్నారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌ను అభినందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. సీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఖోఖో పోటీలను తిలకించారు. ఖోఖో క్రీడలో మంచి ప్రతిభ చాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్‌ను ఐజి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారావు, ఏసిపి విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్ఐ నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పోరాటాలకు మా మద్దతు

- పీవీయూ జాతీయ అధ్యక్షులు కాతోజు రామాచారి
- జాన్‌వెస్లీకి శుభాకాంక్షలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎం) పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని ప్రపంచ విశ్వకర్మ యూనియన్(పీవీయూ) జాతీయ అధ్యక్షులు కాతోజు రామాచారి ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్కరించారు. పార్టీ ఇచ్చిన గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమ సమాజ స్థాపన కోసం, దళిత, గిరిజన, బహుజన జాతిలో చైతన్యం నింపి, కార్మిక, కర్షక బడుగు బలహీన వర్గాలను కలుపుకొని ముందుకెళ్లాలని కోరారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, ఎర్రకోటపై ఎర్రజెండా ఎగిరేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, పాలడుగు భాస్కర్, టి.సాగర్ పాల్గొన్నారు.

మిర్చి రైతును 'నల్లి'పి నలిపి..!

గూడలు విరిగేలా కష్టం చేసినా గూడ రాలుతోంది. పూత, కాత దశలో ఎర్ర, నల్ల, తామర, పిండినల్లులకు తోడు ఎండు తెగుళ్లు మిర్చి రైతులను 'నల్లి'పేస్తున్నాయి. వీటి నియంత్రణకు రోజు విడిచి రోజు పురుగుమందు పిచికారీ చేసినా ఫలితం లేదు. ఓవైపు పెట్టుబడులు పెరుగుతున్నా.. మరో వైపు దిగుబడి, ధరలు తగ్గుతున్నాయి. అప్పులపాలై ఖమ్మం జిల్లాలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.34 లక్షల ఎకరాల రైతులను 'నల్లి'పెవేస్తున్న ఈ తెగుళ్లపై ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు గిరిజన కౌలు రైతులు, వైరా కేవీకే శాస్త్రవేత్తల మనోగతంతో 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

- అటు తెగుళ్లు.. ఇటు ధరాఘాతంతో రైతుల దిగాలు
- అప్పులపాలై పలువరి ఆత్మహత్య
- రాష్ట్రవ్యాప్తంగా 2.34 లక్షల ఎకరాల్లో మిరప సాగు
- ఎకరానికి రూ.2.50 లక్షలకు పైగా పెట్టుబడి
- రోజు విడిచి రోజు పురుగు మందుకొట్టినా నిరుపయోగం
- ఒకప్పుడు 40 క్వింటాళ్ల దిగుబడి.. ఇప్పుడు 20 లోపే..
- గతేడాది క్వింటా రూ.20వేలకు పైగా.. ఇప్పుడు రూ.13వేలకన్నా తక్కువే..
- నాఫెడ్ ద్వారా రూ.20వేలకు కొనాలని రైతులు, రైతుసంఘాల డిమాండ్
- మోతాదుకు మించి మందుల వాడకమే కారణం: శాస్త్రవేత్త రవికుమార్

పల్లిపాడు మిరప తోటల నుంచి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి





'రెక్కాడితే గానీ డొక్కాడని' గిరిజన రైతులు వారంతా.. ఏండ్ల తరబడి వ్యవసాయాన్ని నమ్ముకొని బతుకీడుస్తున్నారు. కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా.. మిర్చి సాగుతోనే అనే నమ్మకం వారిది. ఇండ్లు కట్టాలన్నా.. పెండ్లిండ్లు చేయాలన్నా.. పిల్లలను చదివించాలన్నా.. భూములు కొనాలన్నా.. తమ జీవితాల్లో మెరుపు మిరపతో మాత్రమేనని నమ్ముతున్నారు. ఆ విశ్వాసంతోనే భూములు లేకున్నా ఎకరం రూ.20 వేల నుంచి రూ.25వేల వరకూ కౌలుకు సేద్యం చేస్తున్నారు. ఒక్కో రైతు మూడు, నాలుగు నుంచి పది ఎకరాల వరకూ భూమి తీసుకొని మిర్చి సాగు చేస్తున్నా.. నాలుగేండ్లుగా నల్లి తెగుళ్ల నలిపివేస్తున్నాయి. 2021-22లో మొదలైన తామర, పిండి, నల్ల, ఎర్ర నల్లుల ప్రభావంతో మిర్చి దిగబడులు గణనీయంగా పడిపోయాయి. ఎకరానికి 40 క్వింటాళ్లు వచ్చే పంట ఇప్పుడు 25కు లోపలే పరిమితమైంది. ఈ ఏడాది పండిన పంటలో కూడా నాణ్యత లేదు. ప్రస్తుతం రెండోసారి పంట తీతలు చేపట్టారు. మొదటి దఫా రెండు ఎకరాల పంట ఏరితే మూడు క్వింటాళ్లు ఎర్రవి, 8 క్వింటాళ్లు తాలు మిర్చి వచ్చిందని గిరిజన ఆదర్శ మహిళా కౌలు రైతు భూక్యా చాందిని వాపోయింది. పువ్వుకు 50కి పైగా నల్లులు ఉండటంతో గూడలు రాలుతున్నాయని తెలిపింది. విడతకు రూ.5వేల విలువ చేసే పురుగుమందులు రోజు విడిచి రోజు పిచికారీ చేస్తున్నా పూత రాలటం, కాయ దెబ్బతినటం, ఆకులు ముడత రావటం.. ఆగట్లేదని ఆవేదన చెందింది. ఒంటరి మహిళైనా 30 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తోంది. తనకు ఏనాడూ ఇలాంటి దుస్థితి రాలేదని కన్నీరు పెట్టింది.

తెగుళ్లకు తాళలేక అప్పులపాలై 10 కుంటల భూమి అమ్మకం..

'లేపాలన్నా.. పడేయాలన్నా.. మిరపతోటే' అనే అభిప్రాయం చాలా మంది రైతుల్లో ఉంది. అదే నమ్మకంతో 30 ఏండ్లుగా మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేస్తున్న గిరిజన రైతు భూక్యా శ్రీనివాసరావు తోటలు నల్లి తెగుళ్ల బారిన పడుతున్నప్పటి నుంచీ ఆర్థికంగా చితికిపోయాడు. అప్పులపాలై తనకున్న సొంత భూమి పది కుంటలు అమ్మేశాడు. వ్యవసాయం తప్ప మరో పనితెలియని ఆయన ఈ ఏడాదీ బంగారం బ్యాంకుల్లో తాకట్టుపెట్టి అప్పుతెచ్చే పంట పెట్టుబడులు పెడుతున్నాడు. ముందుగానే ఎకరానికి రూ.25వేల చొప్పున మూడెకరాలకు రూ.75వేల కౌలు చెల్లించాడు. ఇప్పుడా కౌలు కూడా పూడే పరిస్థితి లేదు. మొదటి, రెండోసారి పంట దిగుబడులు, ధరను బట్టి చూస్తే మరింతగా అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదంలో ఉన్నాడు. మొదటిసారి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తే దానిలో 5 క్వింటాలూ తాలే. అవి అమ్మితే పట్టుమని రూ.50వేలు కూడా రాలేదు. దానిలో కోత కూళ్లే రూ.36వేలకు పైగా అయ్యాయి. ఇప్పుడు ఏరుతున్న పంట కూడా నాసిరకంగానే ఉంది. పంట ఎర్రబారి, నల్లిసోకి ఆకులు ముడుచుకుపోయాయి. కాయలకు మచ్చలు వచ్చాయి. పూలు మొగ్గలుగా ఉండగానే రాలుతున్నాయి. ఉన్న పూలల్లోనూ ఒక్కోదానిలో వందలాది నల్లులు ఉన్నాయి. మూడురోజులకోసారి రూ.5వేలు ఖర్చుపెట్టి పురుగుమందులు పిచికారీ చేస్తున్నా ప్రయోజనం లేదని రైతు శ్రీనివాసరావు కంటనీరు పెట్టాడు.

మోతాదుకు మించి మందులు వాడొద్దు :




రవికుమార్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వైరా

మిరపలో అధికంగా నల్లతామర పురుగు వస్తోంది. గతంలో గోధుమ రంగు నల్లి ఎక్కువగా ఉండేది. ఇవి ఆకు కింద గోకి రసం పీల్చుతాయి. ఆకూ గోధుమ వర్ణంలోకి మారుతుంది. ఇప్పుడు నల్ల తామర పురుగు ఎక్కువగా ఉంది. ఇవి ఆకుతో పాటు పూలనూ గోకి తింటాయి. తద్వారా పూలు మాడిపోయి రాలుతున్నాయి. కాయలను కూడా గోకి తింటుండటంతో అవి గట్టిగా, నల్లగా మారుతున్నాయి. తామర పురుగు, నల్లి వేర్వేరు. కానీ రైతులు నల్లికి మందుకొడుతున్నారు. సీజన్ పూర్తవగానే మిరప పంట తీసివేసినప్పుడు ఈ పురుగులు భూమిలో నిద్రావస్థలో ఉంటాయి. పంట వేశాక ఇవి వ్యాప్తి చెందుతాయి. కాబట్టి లోతు దుక్కులు చేయాలి. రసాయనిక ఎరువుల వాడకం కూడా తగ్గించాలి. సేంద్రియ ఎరువుల వినియోగం మంచిది. విత్తన, నారుశుద్ధి చేసుకోవాలి. నాటే ముందు ఇమిడోక్లోపిడ్ మందులో పది నిమిషాల పాటు మొక్కల వేర్లు మునిగేలా ఉంచాలి. పసుపు, నీలి రంగు జిగురు అట్టలు కచ్చితంగా తోటల్లో పెట్టాలి. ఒకే రకమైన మందులు వాడకూడదు. బయో మందుల వినియోగం తగ్గించాలి. మిత్ర పురుగుల పెంపుదలకు జొన్న మొక్కజొన్న మొక్కలు తోటల్లో వేయాలి.

అప్పులపాలై ముగ్గురు రైతులు ఆత్మహత్య..

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 2.34 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. దీనిలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 59,262, మహబూబా బాద్‌లో 48,234, జోగులాంబ గద్వాలలో 37,801, జయశంకర్ భూపాల పల్లిలో 19,982, సూర్యాపేటలో 14,919, భద్రాద్రి కొత్తగూడెంలో 10,420 ఎకరాల్లో ఈ సీజన్‌లో మిర్చి సాగైంది. గతేడాది 2023-24లో రాష్ట్రవ్యాప్తంగా 3,92,303 ఎకరాల్లో సాగు చేస్తే 7,94,417 మెట్రిక్ టన్నుల మిర్చి దిగుబడి వచ్చింది. గత మూడు, నాలుగేండ్లుగా మిర్చి తెగుళ్ల వ్యాప్తి ఎక్కువగా ఉండటం.. ఏటేటా ఖర్చులు పెరుగుతున్నా.. దిగుబడు లు, ధరలు తగ్గుతుండ టంతో రైతులు అప్పులపాల వుతున్నారు . మిర్చి సాగును గణనీయంగా తగ్గిస్తున్నారు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో ఇప్పటికే ముగ్గురు గిరిజన మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రఘునాథపాలెం మండలం కోటపాడు, రేగులచలక ఒక్కొక్కరు, కూసుమంచి మండలంలో మరో రైతు అప్పులతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంకా చాలామంది నష్టపోయిన వారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నారు.

నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.20వేలకు కొనాలి



మిర్చికి తెగుళ్లతో దిగుబడి తగ్గటం, పెట్టుబడులు పెరగటం, ధరలు పతనం అవుతుండటంతో రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్), తెలంగాణ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (టీజీ మార్క్‌ఫెడ్) ద్వారా క్వింటాల్ మిర్చి రూ.20వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలి. గతేడాది పంట కూడా 60 శాతం వరకు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంది. దానికి కూడా ఇదే రేటు వర్తింపజేయాలి.

పోతినేని సుదర్శన్, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ప్రమాదాలకు గురికాకుండా జాగ్రతలు తీసుకోవాలి
- యాక్సిడెంట్లు కుటుంబంపై ప్రభావం చూపుతాయి : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- వికారాబాద్‌లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు



నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. యాక్సిడెంట్ జరిగితే వ్యక్తిపై కాకుండా కుటుంబంపై ప్రభావం చూపుతుందన్నారు. రోడ్లు అభివృద్ధికి ప్రతీకలని, ప్రపంచంలో అమెరికా తర్వాత అత్యధికంగా రోడ్ల వ్యవస్థ ఉన్నది మన దేశంలోనే అని తెలిపారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో హెల్మెట్ ఉపయోగంపై అవగాహన, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. మంచి రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. మారిన ఆధునిక కాలంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో ఇప్పుడు ప్రతి ఇంట్లో బైక్, కారులు ఉంటున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యమేనని అన్నారు. వేగంగా నడపడం ముఖ్యం కాదని, అప్రమత్తంగా, నిబంధనలు పాటిస్తూ నడపకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్‌తో యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. యూరప్, అమెరికా వంటి దేశాల్లో ప్రమాదాలు తక్కువగా జరుగుతాయని, కారణం అక్కడ డ్రైవింగ్ చేసేవారు నిబంధనలను కచ్చితంగా పాటిస్తారని అన్నారు. మన దేశంలోనూ రోడ్డు నియమాలు, ట్రాఫిక్ రూల్స్ ఉన్నా సరిగ్గా పాటించడం లేదన్నారు. సర్వే ప్రకారం బైక్ ప్రమాదాల మరణాల్లో 70 శాతం తలకు దెబ్బ తగలడంతోనే మరణిస్తున్నారని, హెల్మెట్ వాడితే ఈ మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీఏ సభ్యులు ఎర్రవల్లి జాఫర్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. డ్రైవర్ అంటే ఒక్క ప్రాణమే కాదని, కొన్ని వందల మంది ప్రాణాలు వారి చేతుల్లో ఉంటాయని, బాధ్యతతో వాహనం నడపాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏ.సుధాకర్ రెడ్డి, ఆర్డీవో వాసు చంద్ర, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ మాజీ చైర్మెన్ వి.సత్యనారాయణ, పి.మహిపాల్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్ కుమార్, ఎస్.రామచంద్రరెడ్డి, జె.వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడుకోవాలి

- ఆదివాసుల కష్టాలు తీర్చేలా పనిచేస్తాం : మంత్రి సీతక్క
- నాగోబా జాతరలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదివాసులు ప్రకృతి ఆరాధికులని, ఏండ్లుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, ఇదే మన పెద్దలు ఇచ్చిన గొప్ప సంపద అని మంత్రి సీతక్క అన్నారు. ఆచారాలు, భాషలను సంరక్షించుకుందామని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నిర్వహించిన నాగోబా జాతర దర్బార్‌లో మంత్రి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారిక దర్బార్ ముగిసి అధికారులు వెళ్లిపోయిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎంపీ సోయం బాపురావుతో కలిసి మంత్రి వచ్చారు. నాగోబా దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సభలో మాట్లాడారు. ఆదివాసులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని, ఆదివాసీ ప్రాంతాలకు డా.బీఆర్.అంబేద్కర్ స్వయం ప్రతిపత్తి కల్పించారని గుర్తు చేశారు. ఆదివాసీ గిరిజనులంతా ఒక చోట చేరే ఈ నాగోబా జాతర సందర్భంగా దర్బార్ నిర్వహించాలని, హైమన్‌డార్ఫ్ నిర్ణయం మేరకు ప్రతి ఏటా జరుగుతూ వస్తోందని వివరించారు. రానున్న రోజుల్లో ఈ జాతరను మరింత పటిష్టంగా నిర్వహించుకుందామని చెప్పారు. ముఖ్యమంత్రి మేస్రం వంశస్తులకు శుభాకాంక్షలు తెలిపారని, గతంలో వీరి దీవెనలు తీసుకున్నారని తెలిపారు. ఆదివాసులకు ఇండ్లు, రోడ్లు, ఉద్యోగాలు, పోడు పట్టాలు ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ఇది ప్రజాదర్బార్ కాబట్టి ఆదివాసీ బిడ్డగా ఇక్కడకు వచ్చానని తెలిపారు. ఆదివాసులు అందరినీ గౌరవిస్తారని, ఎదుటి వారిది ఎంత గొప్పగా ఉన్నా అది వారి ఆచారమని, మనది మనం కాపాడుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నాగోబాను దర్శించుకున్నారని, గెలిచిన తర్వాత కూడా నాగోబా దర్శనం చేసుకున్నారని గుర్తు చేశారు. ఆదివాసుల కోసం అనేక సంక్షేమ పథకాలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ కార్పొరేషన్ చైర్మెన్ కోట్నాక్ తిరుపతి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడె గజేందర్, మేస్రం వంశ పెద్దలు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఐఐటీని సందర్శించిన కేరళ గవర్నర్



నవతెలంగాణ-కంది

సంగారెడ్డి జిల్లాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్(ఐఐటీ కంది)ని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ శుక్రవారం సందర్శించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి ఐఐటీతో భాగస్వామ్య అవకాశాల గురించి కలెక్టర్ వివరించారు. కళాశాల డైరెక్టర్ నూతన పరిశోధనలు, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటీ నుంచి ప్రభుత్వ రంగ అభివృద్ధికి తోడ్పాటు వంటి విషయాల గురించి గవర్నర్‌కు వివరించారు. ఐఐటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో అత్యాధునిక పరిశోధనలు, స్టార్టప్ సహకారాలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల గురించీ వివరించారు. ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఫ్యూయల్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఐఐటీ చేస్తున్న పరిశోధనలపై ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భవిష్యత్ భారతదేశ నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ప్రభుత్వ సాయం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్, ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, డీఎస్పీ సత్తియ్య, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డీటీ మల్లయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీగతో కొట్టిన ప్రిన్సిపాల్ !

- గోడలపై అసభ్యకర బొమ్మలు, రాతలు రాసిన పలువురు విద్యార్థులు
- మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఘటన
- తల్లిదండ్రుల ఆందోళన
- కలెక్టర్ ఇలా త్రిపాఠి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరా

నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

డామెట్రీ హాల్లో బూతు బొమ్మలు గీసారని విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్లాస్టిక్ తీగతో తీవ్రంగా కొట్టారంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ ఘటన నల్లగొండ పట్టణం ఎస్ఎల్‌బీసీ వద్ద గల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో మూడ్రోజుల కిందట జరగ్గా.. శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు, పలువురు విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 325 మంది విద్యార్థులు చదువుతున్నారు.

మూడ్రోజుల కిందట కొంతమంది విద్యార్థులు గోడపై నగ్న చిత్రాలు గీసి అసభ్యకర రాతలు రాశారు. దీనిపై విద్యార్థులు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించిన ప్రిన్సిపాల్ ఈ ఘటనకు కారకులు ఎవరు అని విద్యార్థులను ప్రశ్నించారు. ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహానికి గురయ్యారు. డామెట్రీ హాల్లో రాత్రిపూట నగ్న చిత్రాలు గీసిన వారి వివరాలు తెలపాలని 6, 7, 8 తరగతి విద్యార్థులు సమీర్, ఆదిల్, అఫ్జల్, ముజంమిల్, అహం రన్, విష్ణు, సాయి తేజతో పాటు మరో ఇద్దరు విద్యార్థులను ఆఫీస్ రూమ్‌కు పిలిపించారు. అక్కడ పాత కరెంట్ తీగతో కొట్టారు. ఎవరి గీశారో చెప్పకపోతే పాఠశాల నుంచి పేరు తొలగిస్తామని హెచ్చరించారు.

తల్లిదండ్రుల ఆందోళన

విద్యార్థుల ప్రవర్తన సక్రమంగా లేదని విచక్షణ కోల్పోయి తీగలతో దండించడం ఏంటని తల్లిదండ్రులు శుక్రవారం రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్‌ను నిలదీయడంతో ఈ విషయం బయటకు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు విచారణ జరిపారు.

ప్రవర్తన మారాలని..ప్రిన్సిపాల్ వేణుగోపాల్

విద్యార్థుల ప్రవర్తన సక్రమంగా లేదు. గోడలపై అసభ్యకరమైన గీతలు గీసి రాశారు.. వారిలో భయం పెట్టేందుకు కొంతమంది విద్యార్థులను కొట్టాను. అంతేగానీ గదిలో బంధించడంగానీ, విచక్షణ కోల్పోయి దాడి చేయడంగానీ చేయలేదు.

ఘటనపై జిల్లా కలెక్టర్, మంత్రి ఆరా

మైనార్టీ బాలుర వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో జరిగిన ఘటనపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయి నివేదికతో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శుక్రవారం రాత్రి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. తల్లిదండ్రుల ఆందోళన, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన విషయాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌కు ఫోన్ చేసి అడిగారు. శనివారం తమ కార్యాలయానికి వచ్చి పూర్తిస్థాయిలో నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

4 వేల కేజీల నల్ల బెల్లం ధ్వంసం



నవతెలంగాణ-హాయత్ నగర్

ప్రభుత్వం నిషేధం ఉన్న నల్ల బెల్లం, నవ సాగరం 4వేల కేజీలు కలిగిన దానిని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎక్సైజ్ ఆదేశాల మేరకు శుక్రవారం అబ్దుల్లా పూర్ మెట్ మండలంలోని గౌరెల్లి గ్రామ పరిధిలో ఉన్న మూసీనదిలో వదిలేస్తున్నట్టు హాయత్ నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ధన్వంత్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట ఎస్ ఐ సరళ,సిబ్బంది ఉన్నారు.

ఏఎస్ఐగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం



నవతెలంగాణ-హాయత్ నగర్

హెడ్ కానిస్టేబుల్‌గా ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ మహిళగా విధులు నిర్వహిస్తున్న షైక్ మహబూన్నిసాబి బేగంకు ఏఎస్ఐగా పదోన్నతి రావడంతో శుక్రవారం ఆమెను సన్మానించారు. ఎల్బీనగర్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఆమె యూనిఫామ్‌కు స్టార్ తొడిగి శాలువాతో సత్కరించారు. పదోన్నతితో పాటుగా విధుల్లో భాద్యతలు కూడా పెరుగుతాయని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఆయన వెంట ఎస్ఐలు శేఖర్ రెడ్డి,మల్లయ్య,ప్రసాద్ లు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తా

- కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మ రెడ్డి



నవతెలంగాణ-హాయత్ నగర్

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి అన్నారు. హయత్ నగర్ పరిధిలోని రాజరాజేశ్వరి కాలనీ, శివం హిల్స్ కాలనీ,పవన గిరి కాలనీ ఫేస్ -3 లో నూతన సి.సి రోడ్డు పనులను కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో నెలల నుంచి వివిధ ఎన్నికల కోడ్‌ల కారణంగా నిధులు మంజూరు అయ్యి పెండింగ్‌లో ఉన్న పనులను ప్రారంభించామని తెలిపారు. అదేవిధంగా గుత్తేదారులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రోడ్డు పైకి వచ్చిన రాంపులను, ఇంటి ముందు చెట్లు, గోడలను తొలగించి ఇరువైపులా రోడ్డు మార్గం సాఫీగా ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఈ లింకు రోడ్డు తో శివం హిల్స్ కాలనీ నుంచి రాజరాజేశ్వరి కాలనీకి, బచ్‌పన్ స్కూల్ వరకు సులభంగా ప్రయాణించే రోడ్డు మార్గం అవుతుందని, అదేవిధంగా ఇంకా మిగిలి ఉన్న కాలనీలలో సీసీ రోడ్డు పనులను మూడు, నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు హరి ప్రసాద్, మాధవ్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి,నరసింహుడు, హరినాథ్ నేత,కొండ శ్రీనివాస్, కిరణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీను,రత్నాకర్ రెడ్డి బీజేపీ నాయకులు కొండల్ రెడ్డి,ప్రమోద్ రెడ్డి,కడారి యాదగిరి,శ్రీధర్ గౌడ్,శ్యామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుభవాన్ని, నైపుణ్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- సీపీ సుధీర్ బాబు
- పదవీ విరమణ పొందిన ఎస్ఓటీ డీసీపీ కె.మురళీధర్
- ఘనంగా సత్కరించిన కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఎస్ఓటీ డీసీపీగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన కే.మురళీధర్‌ను సీపీ సుధీర్ బాబు ఘనంగా సత్కరించారు. రాచకొండలోని వివిధ విభాగాలల్లో పనిచేసిన పలువురు పోలీస్ అధికారులు పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎస్ఓటీ డీసీపీగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన కే.మురళీధర్ పోలీస్‌శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సర్వీస్ ప్రారంభించారన్నారు. పోలీసు శాఖలోని అన్ని విభాగాలలో వివిధ స్థాయిల్లో సమర్థవంతంగా పనిచేసి తన ప్రతిభాపాటవాలు, చక్కటి పనితీరుతో అంచెలంచెలుగా ఎదిగి డీసీపీ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పనిచేసే సమయంలో క్షేత్రస్థాయిలో ఎన్నో సంఘర్షణలను, ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తించిన మురళీధర్ నిబద్ధతను సీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎన్నో ఏళ్ల పాటు అవిశ్రాంతంగా పోలీసుశాఖలో వివిధ స్థాయిల్లో సమర్థవంతంగా పలు విభాగాలకు నాయకత్వం వహించి, వారి అమూల్యమైన సేవలు అందించినందుకు సీపీ అభినందించారు. అధికారులు అందరూ మురళీధర్ అనుభవాన్ని, నైపుణ్యాన్ని స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలన్నారు. డీసీపీ మురళీధర్‌తోపాటు శుక్రవారం పదవీ విరమణ పొందిన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ డి.కుమారస్వామి లను సీపీ అభినందించారు. తాను భువనగిరిలో పనిచేసే సమయంలో నక్సలైట్లతో అకస్మాత్తుగా జరిగిన ప్రాణాంతక ఎదురుకాల్పుల్లో ధైర్యంగా తనతో పాటు పోరాడిన డి.కుమారస్వామి తెగింపును సీపీ ప్రత్యేకంగా గుర్తుచేశారు. పదవీ విరమణ అనంతరం అందరూ విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్, ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీసీపీ మురళీధర్ మాట్లాడారు. వివిధ స్థాయిల్లో, పలు విభాగాల్లో కలిసి పని చేసిన పలువురు అధికారులు వారి అనుభవాన్ని పంచుకున్నారు. వత్తి పట్ల మురళీధర్ అంకితభావాన్ని, తోటి అధికారులు, సిబ్బందితో వారి స్నేహపూర్వక ప్రవర్తనా శైలిని, సహకార గుణాన్ని, నాయకత్వ లక్షణాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్ కుమార్, అరవింద్ బాబు, సునీత రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్, ఇందిర, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కష్టారెడ్డి, ఇతర అధికారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి మృతి

- డబ్బులు కట్టందే మృతదేహాన్ని ఇవ్వబోమన్న ఆస్పత్రి సిబ్బంది
- పోలీసుల జోక్యంతో మృతదేహం అప్పగింత



నవతెలంగాణ-మలక్‌పేట్

చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్‌కు చెందిన అబ్దుల్ కరీం గుండెకు సంబంధించిన వైద్యం కోసం కుటుంబ సభ్యుల ద్విచక్ర వాహనంపై ఈ నెల 27వ తేదీన రాత్రి సమయంలో ప్రయివేటు వైద్యశాలకు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంటనే ఆస్పత్రిలో చేరాలని సూచించారు. వైద్యశాల యాజమాన్యం మొత్తం రూ.1.87 లక్షలు ఖర్చు అవుతాయని చెప్పి చికిత్స ప్రారంభించారు. అదనంగా ఖర్చులు ఎక్కువ అవుతాయని చెప్పడంతో కరీం కుటుంబ సభ్యులు రూ 1.2 లక్షలు చెల్లించారు. అయితే చికిత్స పొందుతున్న అతను పరిస్థితి విషమించి మృతి చెందాడు. అయితే సినిమా తరహాలో మతదేహాన్ని ఇవ్వకుండా అదన ంగా రూ.2 లక్షలు ఇవ్వాలంటూ ఆస్పత్రి సిబ్బంది మతిని కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దాంతో కుటుంబ సభ్యులు ఏం చేయాలో అర్థం కాక ఎమ్మెల్యే బలాల దష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే కార్పొరేటర్‌లు అబ్రార్, మొహమ్మద్ షఫీ లను వైద్యశాలకు వెళ్లాలని సూచించారు. అక్కడికి వెళ్లిన కార్పొరేటర్లు జరిగిన సంఘటన తెలుసుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీదు గల ఇంజక్షన్ వాడామని డబ్బులు ఇవ్వాలని వైద్యశాల సిబ్బంది పట్టు బట్టారు. ఈ విషయం కాస్త రాజకీయం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు.

వ్యక్తి అదృశ్యం...



నవతెలంగాణ-హాయత్‌నగర్

వ్యక్తి అదృశ్యమైన ఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హాయత్ నగర్ సీఎస్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న అజిత్ గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అతని భార్య బెనబాయ్ నవరం గ్‌తో గొడవ పడి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దాంతో అతని భార్య హాయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. వీరి స్వస్థలం ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం.

7న చలో హైదరాబాద్ : బత్తిన సుధాకర్ మాదిగ



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఫిబ్రవరి 7న హస్తినాపురం డివిజన్‌లో సుభాష్ చంద్ర బోస్ కాలనీలో పద్మశ్రీ మంద కష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే వేల గొంతులు లక్ష డప్పులు భారీ స్వాంస్క తిక ప్రదర్శనకు తరలిరావాలని ఎల్బీనగర్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. డప్పుల దరువుతో ప్రచార కార్యక్రమనికి వేలాదిగా తరలి రావాలని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణతో 58 కులాల భవిష్యత్తు బాగుపడుతదన్నారు. 2000 నుంచి 2004 వరకు వర్గీకరణ జరిగిందని.. అపుడే మన వాటా మనకు వచ్చేదన్నారు. ఉద్యోగాలలో, విద్యలో అభివృద్ధి చెందామని, అది జీర్ణించుకోలేని కొందరు ఎన్నో ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. చివరిగా సుప్రీం కోర్టు వర్గీకరణ చేసుకునే అధికారం రాష్టాలకు ఉన్నదని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అయితే మాలలు వర్గీకరణకు అడ్డుపడుతున్నారని తెలిపారు. డప్పు దరువు ప్రదర్శన ద్వారా మన ఆకాంక్షను తెలపడానికి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



అగస్త్య ఫౌండేషన్ సహకారంతో ఇన్నోవేషన్ ఫెయిర్

నవతెలంగాణ-హాయత్ నగర్

హయత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు వినూత్న ఆలోచనలతో కొత్త కొత్త సైన్స్ మోడల్స్‌ను తయారుచేసి ప్రదర్శించగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ఉపాధ్యాయురాలు మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో మంచి సైంటిస్టులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ కోఆర్డినేటర్ నరేష్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్ గౌడ్



నవతెలంగాణ-తుర్కయంజాల్

వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేట్ స్కూలు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పత్రిక ప్రకటనను విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా కార్పొరేట్ స్కూల్‌లలో, కాలేజీలలో వసంత పంచమి పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ వింత వింత ఆఫర్లతో వారిని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అకాడమిక్ సంవత్సరం పూర్తి కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ఇలాంటి కార్పొరేట్ విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే వాటి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక సేవా దక్పథంతో నడిపించాల్సిన పాఠశాలలు, కాలేజీలు ఇవాళ కేవలం ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నా యన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా విస్మరించి వాటి నియమ, నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఆకర్షణీయమైన బంపర్ ఆఫర్ల పేరుతో విద్యార్థులను మోసం చేస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారనీ తెలిపారు. కావున వెంటనే విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడి తక్షణమే తనిఖీలు చేపట్టి ఇలాంటి కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కుల మతాలకతీతంగా గరిగుట్ట ఉత్సవాలు జరుపుకోవాలి

- కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చనగారి లక్ష్మరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

కుల మతాలకతీతంగా గరిగుట్ట ఉత్సవాలు జరుపుకోవాలని, అందరి సాంప్రదాయాలను గౌరవించేది కాంగ్రెస్‌యేననికాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చనగారి లక్ష్మరెడ్డి అన్నారు. శుక్రవారం జల్ పల్లి మున్సిపాలిటీలో ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలను జరుపుకునే గరిగుట్ట పెద్దమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని శుక్రవారం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈనెల 8,9,10 తేదీలలో జరిగే గరిగుట్ట జాతర బోనాల ఏర్పాట్లలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని జల్ పల్లి కమిషనర్ బి. వెంకట్రామ్, అధికార యంత్రాంగాన్ని కిచ్చెన్న కోరారు. ప్రతీ మతాన్ని, వారి సంస్కతి సంప్రదాయాలను గౌరవించేది కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. అనంతరం దేవాలయ జాతర నిర్వాహకులు కేఎల్‌ఆర్‌ను పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బుడుమల యాదగిరి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ జాంగీర్,దూడల సుధాకర్ గౌడ్, కొండల్ యాదవ్,రంగారెడ్డి జిల్లా వివర్స్ సెల్ అధ్యక్షులు మస్న రవి కుమార్,పాండు గౌడ్, యంజాల శ్రీనివాస్, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో వింగ్స్ మీడియా, జీ5 మీడియా గ్రూప్‌ల ఆధ్వర్యంలో కొంపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో "మొదటి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్‌ను ఎలా ఛేదించాలి" అనే అంశంపై సెమినార్‌ను గురువారం విజయవంతంగా నిర్వహించారు. 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఛైర్మెన్ పి. కృష్ణ ప్రదీప్ మాట్లాడుతూ ఒకరి చిరునామా అవసరమైన వారికి మనం "కేర్-ఆఫ్ అడ్రస్" గా నిలిచే స్థితిలో ఉండాలని, అది మనకి గౌరవాన్ని అందిస్తుందన్నారు . "దబాంగ్ ఆఫీసర్" గా ప్రసిద్ధి చెందిన ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా గురించి చెబుతూ ఆయన భార్య ఆదాయం ద్వారా తన కుటుంబాన్ని పోషిస్తూ కేవలం ఒక రూపాయిని తన వేతనంగా తీసుకొని దేశం కోసం నిస్వార్థ సేవ చేస్తున్నారని, విద్యార్థులు కూడా ఇలా ప్రిపేర్ అవాలని చెప్పారు.21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటర్ , డైరెక్టర్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ ఐఐటీలు , ఐఐఎంల వంటి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మాత్రమే సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించగలరనే అపోహను కొట్టిపారేశారు. అనేక యూపీఎస్సీ ప్రశ్నలు 6వ తరగతి పాఠ్యాంశాల్లోని కాన్సెప్ట్‌ల ఆధారంగానే ఉంటాయి కాబట్టి సాధారణ డిగ్రీ కళాశాలల విద్యార్థులు కూడా విజయం సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పి. సంతోష్ కుమార్ పాత్ర ,ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గార్ల రమేష్, VINGS మీడియా డైరెక్టర్ శ్రీ గిరి ప్రకాష్ , ఎడిటర్ శ్రీ గణేష్, మేనేజర్ ప్రసాద్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు .

ఆర్టీసీ బస్సు ఢీ కొని ద్వీచక్ర వాహనదారుడు దుర్మరణం

నవతెలంగాణ-హాయత్ నగర్

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్వీ చక్ర వాహన దారుడు దుర్మరణం పాలైన ఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా, రావిపహాడ్‌కు చెందిన కుంచం మల్లయ్య శుక్రవారం కుంట్లూర్ నుంచి హాయత్ నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో కుంట్లూర్ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే అతని బైక్‌ను హాయత్ నగర్ 2డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 29 జడ్ 3523) డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపడంతో ఢీకొట్టింది. ద్వీచక్ర వాహన దారుడు కింద పడిపోవడంతో బస్సు అతనిపై నుంచి వెళ్లింది. దాంతో వాహన దారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్.. అక్కడికక్కడే వ్యక్తి మృతి



రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్వీచక్ర వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హాయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హాయత్ నగర్ శాంతి నగర్‌లో నివాసం ఉంటున్న తేజావత్ రమేష్(29) స్వస్థలం మేళ్ల చెరువు,సూర్యాపేట జిల్లా. అతని స్నేహితుని అల్లుడు అయిన హర్షవర్ధన్‌ను నగరంలోని అల్వాల్‌లో గురువారం జేఈఈ మెయిన్స్ పరీక్ష రాయించుకుని తిరిగి ఆర్టీసీ బస్సులో వచ్చాడు. భాగ్యలత బస్‌స్టాప్, సీఎంఆర్ మాల్ ఎదురుగా బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ఎల్బీనగర్ నుంచి హాయత్ నగర్ వైపు వెళ్తున్న టీజీ 05-0199 గల ద్వీ చక్ర వాహనం వారిని ఢీకొట్టింది. దాంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు.. ద్వీచక్ర వాహనదారుడు పెద్ది శివ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి





నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని కందుకూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఆహారాన్ని, మౌలిక సదుపాయాల కల్పించాలని బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు కేతావత్ బహుగుణ నాయక్ డిమాండ్ చేశారు. కందుకూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందనే విషయం తెలుసుకొని శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. అనంతరం పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, పాఠశాలలో జరుగుతున్న అవకతవకలు తెలుసుకొని కళాశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను, ఆహారాన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఇలాంటివి తిరిగి పునరావృతం కాకుండా చూసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాల ఆవరణలో మరుగు దొడ్ల నిర్వహణ, డ్రయినేజీలు శుభ్రం చేయకపోవటం దుర్గంధపు వాసనతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బహుగుణ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు.ఇప్పటికీ రాష్ట్రం లో విద్యా శాఖ మంత్రి లేకపోవటం భాదాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాచిగల్ల నితిన్ కిషోర్, నియోజకవర్గం ఉపాధ్యక్షులు శ్రీకాంత్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పల్లె కిరణ్ కుమార్, నాయకులు కొర్ర అఖిల్, కర్రే పవన్, చిర్ర సాయితేజ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ సరస్వతికి వినతి

కందుకూరు గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతికి బహుగుణ నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన ఆహారాన్ని ఇవ్వకుండా పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

అగ్రికల్చర్ కాలనీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధి లో గల అగ్రికల్చర్ కాలనీలో రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. కాలనీలో రూ 10 లక్షల 50 వేల తో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌తో పాటు అర్బన్ బయోడైవర్సిటీ ద్వారా రూ.20 లక్షలతో పార్కు నిర్మాణం కోసం, బోరు మోటర్ వేసేందుకు నిధులు మంజూరు కాగా ఆయా పనులను వారు శుక్రవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా కాలనీ అతిపెద్దది అయినందున రోడ్లు డ్రయినేజీ నిర్మాణాలకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కాలనీ అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, జితేందర్ రెడ్డి, జగత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి ,పీఎల్ఎన్ శర్మ, రాము కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి ,శేఖర్ రెడ్డి, బ్రహ్మారెడ్డి ,మమతా మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ భూమిని గిఫ్ట్ డీడ్ చేసి ప్రజలను మోసం చేసిన వ్యక్తులు అరెస్ట్



నవతెలంగాణ-హాయత్ నగర్

సర్వే నెంబర్ 7 ఫారెస్ట్ భూమి తమ వారసత్వ భూమిగా అమాయక ప్రజలకు చూపి గిఫ్ట్ డీడ్ చేసి డబ్బులు కాజేసిన వారిని వనస్థలిపురం పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు.ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం షేక్ జిలానీ, యూసుఫ్ ఖాన్, అతని భార్య తులసమ్మలు వనస్థలిపురంలోని ఆటోనగర్ సర్వే నెం.7లో ఉన్న ప్రభుత్వ భూమిని యూసుఫ్ ఖాన్, అతని భార్య తులసమ్మలు తమదని ప్రజలను నమ్మించారు. రూ.100 జ్యూడిషియల్ స్టాంప్ పేపర్‌పై హై కోర్ట్ అడ్వకేట్ షేక్ జిలానీతో కలిసి ప్లాట్‌లు అమ్మకానికి ఉన్నాయని ప్రజలను మోసం చేశారు. గిఫ్ట్ డీడ్ ద్వారా చేసి చాలా మంది ప్రజల నుంచి రూ.5000/- ల నుంచి రూ. 10,000 /- ల వరకు వసూలు చేశారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ ఆఫీసర్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీబీఎం ఆస్పత్రి ప్రారంభోత్సవం



నవతెలంగాణ-చంపాపేట్

చంపాపేట్ డివిజన్ పరిధిలోని బృందావనం కాలనీ పరిధిలోని సీబీఎం మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీలుపలువురు నాయకులు, పెద్దలు, యువజన సంఘాల నాయకులు, రామావత్ సాయికుమార్, బాలరాజు, బ్లాక్ చారకొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండె వెంకట్‌లకు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ చిక్కుడు అనురాధ వంశీకృష్ణ శాలువాతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రయివేటు ఆస్పత్రి వాళ్లు చొరవ చూపినప్పుడే ఆస్పత్రులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఆస్పత్రి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేదలకు అందుబాటులో ఉండే వైద్యం కోసం కృషి చేయాలన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల స్థానికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ-నాగోల్

జగన్మాత మరో రూపమే వాసవి మాత అని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు.శ్రీ ఆర్య వాసవి మాత సేవ సమితి ఆధ్వర్యంలో కమర్షల్ టాక్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ మోహన్ నగర్ కొత్తపేటలో జరిగిన ఆర్య వైశ్య వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భగా వాసవి మాత సేవ సమితి ఆధ్వర్యంలో 108 కలశాలతో అభిషేకం చేయడం జరిగిందని తెలిపారు. ఆ వాసవి మాత ఆశీస్సులతో అందరూ సంతోషంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుండా రామ కోటేశ్వర రావు , వైస్ ప్రెసిడెంట్ భుషెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, కోశాధికారి మొట్కూరి రమేశ్, సంయుక్త కార్యదర్శి మధు, వెంకట రమణ, మురళి శేఖర్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, నరేష్, వంశీ కృష్ణ, మల్లికార్జున గుప్త, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ నూతన కమిషనర్‌గా వసంత

• శుభాకాంక్షలు తెలిపిన మాజీ మేయర్ శాంతి, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా వసంత పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్‌లు నూతన కమిషనర్‌ను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, కుతాడి సాయి, రాజ్ కుమార్, నాయకులు మనోధర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : మేడిపల్లి ఎస్సై



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను పూర్తిగా నివారించాలని మేడిపల్లి ఎస్సై ఉదయభాస్కర్ తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం డిపో మేనేజర్ కే. కవిత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కోరారు. అధిక వేగంతో వాహనాలు నడపటంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. డిపో మేనేజర్ కే.కవిత మాట్లాడుతూ.. డ్రైవర్లు మానసిక ప్రశాంతతతో విధులు నిర్వర్తించాలని, సెల్ఫోన్ డ్రైవింగ్, మద్య సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను శాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

తెలంగాణ సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ సమాజం తెలుగు దినపత్రిక క్యాలెండర్‌ను కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు పత్తి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలోని అన్యాయాలు, అక్రమాలపై ఇన్వెస్టిగేషన్ జర్నలిజం చేయాలన్నారు. జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ రామలింగం, సింగం కిరణ్, విజేందర్ పటేల్, సింగం అశోక్, అంజన్న, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెరినిటీ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు



• పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి

నవతెలంగాణ-కీసర

నాగారం సెరినిటీ పాఠశాలలో ఘనంగా సంబరం వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం సెరినిటీ పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ముఖ్య కార్యదర్శి నోముల వసంత , జిల్లా గెజిటెడ్ హెడ్ మాస్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణ , ఎంఈవో శశిధర్, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హ్యాకాట్రానిక్స్ హ్యాకథాన్ పోస్టరావిష్కరణ



నవతెలంగాణ - పోచారం

పోచారం మున్సిపల్ పరిధిలోని అనురాగ్ విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, 11న నిర్వహించే హ్యాకట్రానిక్స్ హ్యాకథాన్ పోస్టర్‌ను డీన్ ఎస్ వోఈ డాక్టర్ వి.విజయ్ కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ హ్యాకథాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు రోబోటిక్స్, వీ.ఎల్.ఎస్.ఐ, ఎంబెడెడ్ అండ్ ఐఓటీ విభాగాలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌డీ డీన్ డా. సతీష్ కుమారన్, ఈసీఈ హెచ్ఓడీ ప్రొఫెసర్ మంగళ గౌరీ, ప్రొఫెసర్ నారాయణ, డా. హరికృష్ణ, డా.సంతోష్, డా.రాజేష్, డా.ఆశిష్ సింగ్, డా.రాధిక, కోఆర్డినేటర్లు డా.పవిత్ర, ఎస్.అమృత , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం 73వ వసంతాల వేడుకలు



నవతెలంగాణ - చర్లపల్లి

1952 జనవరి 30న మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చేతుల మీదుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఏర్పడి 73వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా చర్లపల్లి డివిజన్ చక్రిపురం కాలనీ ఏఐబీఎస్-ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బిల్డర్ శ్రీనివాస్ నాయక్, మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ నాయక్‌లు చక్రిపురం చౌరస్తాలో ఏఐబీఎస్ఎస్ జెండాను ఎగరవేశారు. అనంతరం బిల్డర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మహారాష్ట్రకు ఇద్దరు ముఖ్యమంత్రులను, ఎమ్మెల్యేలను, ఎంపీలను అందించిందని కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షులు సభావాత్ రాములు నాయక్ ఆదేశాల మేరకు ప్రతీ తండాలో, మండల, జిల్లాల్లోని నియోజకవర్గాల వారీగా జెండా ఎగరవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీనివాస్ నాయక్, మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్ నాయక్, మహంకాళి గుడి చైర్మెన్ శంకర్ నాయక్, లంబాడిల ఐక్యవేదిక మాజీ అధ్యక్షులు హన్మంతు నాయక్, ఆర్.డీ దశరథ్ నాయక్, ముడావత్ కిషన్ నాయక్, భూక్యా భీమా నాయక్, రెడ్డి నాయక్, దంజి నాయక్, లింగం నాయక్, తదితరులున్నారు.



జవహర్ నగర్ ఒకటో డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ కుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, నాయకులు మనోధర్ రెడ్డి, వేణు, సాయికుమార్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, పాల్గొన్నారు.
-నవతెలంగాణ - జవహర్ నగర్

కాప్రా చెరువు నాలా దర్జాగా కబ్జా

• నిర్మాణ, ప్లాస్టిక్ వ్యర్థాలతో నాలా సగానికి పైగా పూడ్చివేత
• అధికారులు చర్యలు చేపట్టాలని సీసీఎస్ కాలనీ ప్రతినిధులు, నాయకులు డిమాండ్



నవతెలంగాణ - చర్లపల్లి

కాప్రా చెరువు నాలా రోజు రోజుకు కబ్జాలతో కుచించుకుపోతుందని, మురుగు నీటి ప్రవాహం తగ్గడంతో కంపు వాసనతో నాలా పరిసర కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీ చక్రిపురం సాకేత్ ప్రధాన రహదారిలో మారుతీ కాలనీ బ్రిడ్జి కల్వర్టు వద్ద భవన నిర్మాణ, ప్లాస్టిక్ వ్యర్థాలతో నాలా 30 ఫీట్ల మేర కబ్జాకు గురైనా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానిక కుటుంబాలు, సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు ఆందోళనకు దిగారు. కాప్రా చెరువు నుంచి నాగారం చెరువు వరకు ప్రవహించే నాలా దారి పొడవున కబ్జాలకు గురవుతున్నా చర్యలు చేపట్టకపోవడం సహించబోమని బ్రిడ్జిపై నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పటేల్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, కాప్రా మండల తహసీల్దార్ సుచరిత, ఇరిగేషన్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి కబ్జాకు గురవుతున్న కాప్రా చెరువు నాలాను పరిరక్షించాని, కబ్జాకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు మహేష్ గౌడ్, విద్యాసాగర్, సోనియా గాంధీ నగర్, మారుతి కాలనీ, గాంధీనగర్ సంక్షేమ సంఘాల అధ్యక్షులు కనకయ్య, శ్రీనివాస్ నాయక్, రమణ, లంక దాసరి సుధాకర్ తదితరులు విజ్ఞప్తి చేశారు.

కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతారాం సమక్షంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్, పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం హామీ ఏమైంది : బీఆర్ఎస్

చెక్కుల పంపిణీ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. చెక్కులు తీసుకున్న లబ్దిదారులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌నేతల మధ్య వాగ్వాదం

చెక్కుల పంపిణీ అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ప్రోటోకాల్ ప్రకారం చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోవాలి కానీ చెక్కులు తీసుకోడానికి వచ్చిన వారికి సంబంధం లేని విషయాలను చెప్పి నిరసన చేయడం సరైందని కాదని బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడితే తప్పెలా అవుతుందని వాదించారు. రెండు వర్గాల మధ్య తోపులాట జరగడంతో తహసీల్దార్ సీతారాం, పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు నచ్చజెప్పి బయటకి పంపించారు.



మహో నాయకుడు గద్దర్

• అట్టడుగు వర్గాల అభ్యున్నతికి గళం విప్పిన నేత
• తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మెన్ డాక్టర్ వెన్నెల



నవతెలంగాణ-సిటీబ్యూరో

అట్టడుగు వర్గాల, ముఖ్యంగా దళితులు, వెనుకబడిన కులాల అభ్యున్నతి కోసం కలం, గళం ద్వారా పోరాడిన మహా గాయకుడు గద్దర్ అని తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మెన్ డాక్టర్ వెన్నెల కొనియాడారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తరపున శుక్రవారం, "మహా బోధి" విద్యాలయం, భూదేవినగర్, వెంకటాపురం, అల్వాల్‌లో నిర్వహిస్తున్న ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడి రాష్ట్ర సాధనలో తన వంతు కషి చేశారని గుర్తు చేశారు. ప్రేరేపిత పాటలను రచించి, పాడి ప్రజల్లో చైతన్యం నింపారన్నారు. సమాచారశాఖ ఆధ్వర్యంలో గద్దర్ జయంతి వేడులకు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం గద్దర్ పాటలను పాడి అందరిని ఉత్తేజపరిచారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు గద్దర్ రచించిన, పాటలు పాడి గద్దర్ జయంతి వేడుకలను విజయవంతంగా పూర్తి చేసారు. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతో ఉత్సహంగా పాల్గొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఎంతో ఆకర్షనీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి గద్దర్ సతీమణి విమల, కుమారుడు సత్యం హాజరై గద్దర్‌కు ఘనంగా నివాళ్లర్పించారు.

ప్రజల ఆశీస్సులతోనే రాజకీయాల్లో రాణిస్తున్నా





• మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజల ఆశీస్సులతోనే పదేండ్లకుగా జవహర్ నగర్ రాజకీయాల్లో రాణిస్తున్నానని మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విగ్నేశ్వర వెల్ఫేర్ అసోసియేషన్, పాపయ్య నగర్ కాలనీ వాసులు పదవీ విరమణ్ సమావేశం ఏర్పాటు చేసి మాజీ మేయర్ దంపతులను ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీవాసులు మాట్లాడుతూ.. శ్రీనివాస్ తమ కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అండదండగా నిలిచాడని కొనియాడారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ఎలాంటి పర్సనల్ సమస్యలు వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చారని తెలిపారు. అనంతరం రెడ్డిశెట్టి శ్రీనివాస్ మాట్లాడు తూ.. ప్రజల కోసం అనుక్షణం పనిచేస్తానని తెలిపా రు. పదేండ్లకు పైగా జవహర్ నగర్‌లో క్రియాశీలకంగా ఉంటూ అభివృద్ధి చేశానన్నారు. తనపై ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

వికలాంగుల ఆధ్వర్యంలో సన్మానం

వికలాంగుల ఆధ్వర్యంలో బుడిగ సవితా గౌడ్, రాష్ట్ర వికలాంగుల సమితి ప్రధాన కార్యదర్శి మొనార్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా వికలాంగులకు తన వంతు సహాయం చేస్తానన్నా రు. అనంతరం సవిత గౌడ్, మొనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కరోనా టైంలో రెడ్డి శెట్టి శ్రీనివాస్ చేసిన సేవ ప్రతి దివ్యాంగుడి మదిలో ఉంటుందనా న్నరు. దివ్యాంగుల ఆడపడుచుల పెళ్లిలకు పుస్తెమెట్టలు ఇచ్చి ఎంతో సహాయం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకురాలు రమ, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద మేతరి, లక్ష్మణ్ ,రమేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ రాజీవ్ గాంధీ చౌరస్తాలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని దమ్మాయిగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటా నికి దీపారాదన చేశారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాదే రాము గుప్తా, లక్ష్మణ్ గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, ప్రవీణ్ గుప్తా, రమేష్ గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, విజయ్ గుప్తా, విక్రమ్ గుప్తా, రమేష్ బాబు గుప్తా, నాగరాజు గుప్తా, శ్రీకాంత్ గుప్తా, నాగభూషణం గుప్తాతోపాటు పెద్ద ఎత్తున అమ్మవారి భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మౌంట్ ఫోర్ట్ బ్రదర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మాంట్ ఫోర్ట్ బ్రదర్స్ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యా సంవత్సరానికిగాను విద్యార్థుల ప్రతిభను గుర్తించి తరగతుల వారీగా జనరల్ ప్రొఫెషెన్సీ బహుమతులు, అకడమిక్ ఎక్సలెన్స్ బహుమతులు అందజేశారు. ఈ ఏడాదికి పూర్తి హాజరు ఉన్న విద్యార్థులకు, టీచర్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు.

కారంగుల రాజేశ్వర్ రావుకు సత్కారం



నవతెలంగాణ -శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావును తన పదవీకాలం ఐదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సేవలో అంకితభావంతో పనిచేసిన వారిని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణానికి రావాలని ఆహ్వానం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆదివారం శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో జరగనున్న మల్లన్న కల్యాణానికి హాజరు కావాలని కోరుతూ మల్కాజిగిరిలోని శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు శుక్రవారం బోయిన్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం



నవతెలంగాణ - శామీర్‌పేట

శామీర్ పేట్ మండలంలోని దేవరయంజాల్ గ్రామంలోని కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మెన్ బి.వెంకయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఫొటోకు, విగ్రహానికిపూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలు ఇచ్చిన అభ్యర్థనలను ఛైర్మెన్ స్వీకరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జెట్ట కిషోర్



నవతెలంగాణ-ఉప్పల్

బీఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ నాయకులు జెట్ట కిషోర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉప్పల్ డివిజన్‌లో బీఆర్ఎస్ బలోపేతం కావడానికి కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధే లక్ష్యంగా సైనికుల పనిచేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



•ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ డివిజన్‌కు చెందిన పలువురు బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

ముదిరాజ్ సమాజ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



నవతెలంగాణ -మేడ్చల్

తెలంగాణ ముదిరాజ్ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దారం యువరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన ముదిరాజ్ సమాజ్ వెబ్ సైట్‌ను ఎంపీ ఈటల రాజేందర్ వారి నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ ముదిరాజ్‌ల సమస్యలు వారి ప్రాధాన్యత గురించి ఉపయోగపడుతుందన్నారు. ఈ www.mudirajsamaj.org పేరుతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సమాజ్ నాయకులు జీ.పరమేష్, మార్కెంటీ నాగరాజు, నీరుడి శ్రీరామ్, రాజు ముదిరాజ్, సంతోష్ ముదిరాజ్, చిరంజీవి ముదిరాజ్, కర్ణకార్ ముదిరాజ్, నర్సింహ ముదిరాజ్,రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుర్వ రామాంజనేయులు మృతి బాధాకరం : గొల్లూరి అంజయ్య



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హౌసింగ్ డివిజన్ న్యూ నరసింహనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు కుర్వ రామాంజనేయులు కుంభమేళాకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధకరమని మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య అన్నారు. శుక్రవారం మృతుడి భౌతికకాయానికి పూల దండను వేసి నివాళులర్పించారు. రామాంజనేయులు లేనిలోటు డివిజన్ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



తన కూతురు వివాహానికి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆహ్వానిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. -నవతెలంగాణ,కాప్రా

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | ఫిబ్రవరి 01, 2025 | www.navatelangana.com

ప్రజా సమస్యలపై నిత్యం కృషి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా సమస్యలపై నిత్యం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే నివాసంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కా రమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

- 5న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయండి
- ఐఏటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలనీ, ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలని ఐఏటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ పిలుపునిచ్చారు. శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన కమలానగర్ సీఐటీయూ జిల్లా ఆఫీసులో ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులపై దాడి పెంచిందన్నారు. పని గంటలు పెంచి జీతాలు తగ్గించిందని తెలిపారు. లేబర్ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను ఏర్పాటు చేసి యాజమాన్యానికి అనుకూలంగా లేబర్ చట్టాలను మార్చారని చెప్పారు. సమ్మె హక్కును తొలగించడానికి కుట్ర చేస్తున్నారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కష్ట జీవులు ఏండ్ల క్రితం కష్టపడి పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారన్నారు.

రైతాంగాన్ని, వారి సమస్యలను పట్టించుకోకపోగా రైతు విద్యుత్ చట్టాలతో దెబ్బతీసి నడ్డి విరిచిందనీ, అందుకే ఈ దేశంలో ఉన్న రైతాంగ కిసాన్ సంయుక్త మోర్చ కూడా ఈ నిరసనలో భాగస్వామ్యం అవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక వర్గం పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అశోక్, జె.చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎస్.శంకరరావు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఎఫ్‌టీయూ నాయకులు శివబాబు, సీఐటీయూ జిల్లా నాయకులు జి.శ్రీనివాసులు, గణేష్, ఉన్ని కృష్ణన్, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

- చట్టపరమైన న్యాయం అందించేందుకు కృషి చేయాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్య





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలనీ, ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ వెంకటయ్య కోరారు. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) అండ్ పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ-పీవోఏ) చట్టాలను ఖచ్చితంగా అమలయ్యేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిని అడిగి తెలుసుకొన్నారు. ఈ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలనీ, ఏమాత్రం పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కేసులపై విచారణ చర్యలను వేగవంతం చేయాలన్నారు. అధికారులు ఎఫ్ఐఆర్ కేసులు నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకురావాలని సభ్యులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో అధికారులు పూర్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. కేసులు పెట్టిన వారిపై రకరకాల ఒత్తిళ్లు వస్తుంటాయనీ, దీన్ని దృష్టిలో పెట్టుకుని వారికి పోలీసులు, ఇతర శాఖలు అండగా నిలవాలని సూచించారు.

అట్రాసిటీ కేసుల్లేకుండా చూడాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి..

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయంలో కేసులు నమోదైన త్వరితగతిన దర్యాప్తు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ మానిటరింగ్ కమిటీకి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ కమిషన్ అందించిన సూచనలను పాటిస్తూ, సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ భూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను 15 రోజుల్లో అందజేయాలని ఆర్డీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. అనంతరం ప్రజలు అందించిన వినతులను చైర్మెన్ స్వీకరించారు. సమావేశంలో మల్కాజిగిరి డీసీపీలు కోటిరెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్టీ కమిటీ మెంబర్లు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ నెస్ సెంటర్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మోతి నగర్‌లో 555 ఫిట్నెస్ సెంటర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, పాల్గొన్నారు.

స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలి..

స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో.. ఎమ్మెల్యే శుక్రవారం అధికారులతో కలిసి మూసాపేట్ డివిజన్ పాండురంగ నగర్ స్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం బీఎస్పీ కాలనీ పార్కు పరిశీలించారు. పార్కులో బెంచీలు, స్మశాన వాటికలో వాచ్ మెన్ రూమ్‌పై రేకులు, బెంచీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, నాగుల సత్యం, ప్రధాన కార్యదర్శి తిరుపతి, అధికారులు వాటర్ వర్క్స్ ప్రకాష్, డి.ఈ స్రవంతి, ఎఈ వైశాలి తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు కోకాకోలా ఫీడర్ బాలాజీ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉ. 10:00గం॥ల నుంచి 1:00 గం॥ వరకు సింహపురి కాలనీ, నెక్స్ విల్లాస్, గోకుల్ భారు దావన్, కేఎల్ యూనివర్శిటీ, డిఆర్ కే ఇంజినీరింగ్ కాలేజ్, డాలర్ డ్రీమ్స్, మై స్పేస్-1, మొదలైన ప్రాణాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

'ఉస్మానియా' కొత్త భవనం శంకుస్థాపన చారిత్రాత్మక ఘట్టం'

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏండ్లుగా ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవన నిర్మా ణం వివిధ కారణాలు, రాజకీయ అంశాల కారణంగా పెండింగ్‌లో ఉందనీ, అనేక సమస్యలు ఎదురైనా దృఢ నిశ్చయంతో కొత్త భవనం నిర్మాణం ప్రారంభించటం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం అని డాక్టర్ రాజీవ్ (ఎండీ. పల్మనాలజీ, ఉస్మానియా) తెలిపారు. ఉస్మానియా మెడి కల్ కాలేజీలో వైద్య విద్యనభ్యసించాలని ఎంతో మంది డాక్టర్లు కోరుకుంటారనీ, అదే స్థాయిలో ఈ కాలేజీకి అను బంధంగా ఉన్న హాస్పిటల్‌ను అత్యాధునికంగా రూపుది ద్దుకోవడం ద్వారా ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రతిష్ఠ మరింత పెరిగి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంద నుందని తెలిపారు. ఉస్మానియా పూర్వ విద్యార్థిగా, గతం లో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్‌లో సభ్యుడిగా అందరిని కలుపుకుని ఉస్మానియా కొత్త భవన నిర్మాణం కోసం పోరాడిన సందర్భాలు ఉన్నాయనీ, ఇప్పుడు ఆ పోరాట ఫలితంగా, పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కొత్త భవనాన్ని నిర్మించనుండటం హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా.. మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిలిస్ట్ గ్రూప్, ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో పేట్ బషీరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించారు. రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రోడ్డు భద్రత సమానాలను పాటించినప్పుడే మనము సురక్షితంగా గమ్యానికి చేరుకోగలమని, తద్వారా మనతోపాటు మన కుటుంబము సంతోషంగా ఉండవచ్చన్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లో వాహనాన్ని నడపవద్దని అన్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో అత్యధికులు యువకులేనని.. క్షణికావేశంతో వాహనాలను వేగంగా నడిపినట్లయితే ప్రమాదాలకు గురై కన్నవారికి బాధను మిగల్చవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘునాథన్ గౌడ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎంవీఐ సాధుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీనుబాబు, శిల్పా, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

డి.ఎస్.టెక్నాలజీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

132 - జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్‌లో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్ ఆధ్వర్యంలో.. శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఎస్.టెక్నాలజీస్‌ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా.. ఏర్పాటుచేసిన డి.ఎస్.టెక్నాలజీస్ రానున్న రోజుల్లో మరింత మంది యువతకు ఉపాధిని కల్పించే విధంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య, అడ్వకేట్ అద్దంకి వెంకటా చారి, దూదిమెట్ల క్రిష్ణ యాదవ్, నాయకులు అనిల్, కాలే నగేష్, తదితరులు పాల్గొన్నారు.



రీసెర్చ్ మెథడాలజీ తరగతులను మధ్యాహ్నం నిర్వహించాలి



- స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రీసెర్చ్ మెథడాలజీ తరగతులను మధ్యాహ్నం సమయాలలో నిర్వహించాలని స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు కోరారు. శుక్రవారం జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ని వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు భరత్ కుమార్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో.. ఈ సోమవారం నుంచి ప్రారంభం కానున్న తెలిపారు. రీసెర్చ్ మెథడాలజీ తరగతులను ఉదయం 10 గంటల నుంచి 5గంటలకు బదులుగా మధ్యాహ్నం 2గంటల నుంచి 7గంటల వరకు నిర్వహించాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ విశ్వవిద్యాలయ పరిధిలో దాదాపుగా అధికంగా పార్ట్ టైం పిహెచ్డి స్కాలర్లే ఉన్నారన్నారు. వారికి రీసెర్చ్ మెథడాలజీ తరగతులు అనేవి అత్యంత ప్రాధాన్యమని, ఆయా రీసెర్చ్ మెథడాలజీ తరగతులకు హాజరవుతే గాని, తమ థీసిస్‌లను తయారు చేసే క్రమంలో తమ పరిశోధన నైపుణ్యాన్ని ఉపయోగించు కోగలుగుతామన్నారు. సోమవారం మొదలు కాబోయే రీసెర్చ్ మెథడాలజీ క్లాస్ లను ఉదయం 10 గంటల నుండి ఐదు గంటలకు బదులుగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించి పార్ట్ టైం పిహెచ్డి స్కాలర్లు సైతం ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు జవ్వాజి దిలీప్ , జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్ నాయక్, అనిష్ కుమార్, సోహన్ పాల్గొన్నారు.

అడిషనల్ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయక్‌కి, శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు వినతి పత్రం అందజేశారు. వివేకానంద నగర్ డివిజన్ నుంచి, జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ఎటువంటి చర్చ జరపకుండా.. బడ్జెట్‌ను ఆమోదించడంపై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు, కార్పొరేటర్లతో కలిసి ఫిర్యాదు అందజేయడానికి వెళ్లారు. కానీ అక్కడ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో.. అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయక్‌కి వినతి పత్రం కార్పొరేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై మాట్లాడినందుకు బీఆర్ఎస్ కార్పొరేటర్స్ అందరిని అరెస్టు చేయడం అన్యాయమన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరొకసారి బడ్జెట్‌పై చర్చ నిర్వహించాలని కోరారు.

కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడిగా గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్, శ్రీనివాస్ నగర్, ఎన్టీఆర్ నగర్ కల్లు గీత సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం కో-ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ ఎన్నికల నిర్వహణ అధికారి శ్రీకాంత్, హరిల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కల్లుగీత సహకార సంఘం అధ్యక్షులుగా గూడ ఐలయ్య గౌడ్, ఉపాధ్యక్షులుగా కె.విటల్ గౌడ్, ప్రధానకార్యదర్శిగా డి.సాయి గౌడ్, డైరెక్టర్స్‌గా పెద్దబాల్ అంజ న్ గౌడ్, పరకాల సత్యలక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులు గూడఐలయ్య గౌడ్ మాట్లాడుతూ గత 27 సంవత్సరాల నుంచి తనకు బాధ్యత కల్పిస్తూ.. నా మీద నమ్మకంతో తిరిగి ఏకగ్రీవంగా ఎన్ను కున్న ఆయా ప్రాంతాల కల్లుగీత సహకార సభ్యులకు హృదయపూర్వక ధన్య వాదాలు తెలియజేశారు. వర్గ విభేదాలకు తావివ్వకుండా తన వంతు సేవలందిస్తానన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

నవతెలంగాణ-దుండిగల్

అర్హులైన పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకం అందాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కి, పాలబిందెల శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు, ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని.. అలాగే మున్సిపల్, రెవిన్యూ అధికారులు అందించే విధంగా వారు చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రజా పాలనలో ప్రకటించిన లిస్టులో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఇండ్లు ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పేరు వచ్చిందని తెలిపారు. ఇండ్లు లేని పేద ప్రజల పేరు లిస్టులో రాలేదని తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. కనుక వెంటనే అర్హులైన పేద ప్రజలకి సంక్షేమ పథకాలు అందాలని లేని పక్షంలో పేద ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోలో గాలి పోచమ్మ బస్తిలో అధ్యక్షులు నరసింహ ఆధ్వర్యంలో.. అమ్మవారి వార్షిక మహోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోర్చా ఓబీసీ ఉపాధ్యక్షులు లకోజి మురళి కృష్ణ, శ్రీ విశ్వకర్మ అధ్యక్షులు సింహాద్రి జోగారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కొలన్‌ను కలిసిన నూతన కమిషనర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా వెంకటేశ్వర్ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిశారు. అనంతరం హనుమంత రెడ్డి కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బహదురపల్లి మాజీ సర్పంచ్ మైసి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరి నాయక్, ఎల్లుగారి వేణు పాల్గొన్నారు.

గద్దర్ గురించి మాట్లాడే స్థాయి 'బండి'కి లేదు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ప్రజాయుద్ధనౌక గద్దర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి లేదని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఈ.ఉమామహేష్ అన్నారు. ఈ మేరకు గద్దర్ 76వ జయంతి సందర్భంగా శుక్రవారం జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్ అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల గొంతుక గద్దర్ ఉమ్మడి రాష్ట్రంలో పేద ప్రజల కోసం అనేక పోరాటాలు నిర్వహించినటువంటి చరిత్ర ఉందన్నారు. అదే విధంగా తెలంగాణ మలిదశ, చివరి దశ ఉద్యమంలో కూడా శరీరంలో తూటాను లెక్కచేయకుండా రాష్ట్రవ్యాప్తంగా కాళ్లకు గజ్జలు కట్టుకొని, గోచి, గొంగడితో ప్రతి పల్లెలో ప్రజలకు యువకులను, విద్యార్థులను, కార్మికులను సబ్బండ వర్గాలను తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేటట్టు ప్రేరేపించిన గొప్ప శక్తి గద్దర్ అని కొనియాడారు. అలాంటి గద్దర్‌కి పద్మశ్రీ అవార్డు లాంటి అనేక అవార్డులు తన స్థాయికి సరిపోవని ప్రజలే వారికి ప్రజాయుద్ధనౌకాని పేరు పెట్టి సత్కరించుకున్నారని పేర్కొన్నారు. అనేక సభలు సమావేశాలలో బీజేపీ నాయకులు గద్దర్‌ను గౌరవించుకున్నారని, అది తెలుసుకోకుండా గద్దర్‌పై మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఇది తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారులను అవమానించడమేనని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు వి. హరినాథ్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, డిహెచ్పిఎస్ రాష్ట్ర నాయకులు డి.రాములు, కత్తుల దుర్గయ్య వెంకటేష్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, ఎంజెఎఫ్ జిల్లా కార్యదర్శి యాకయ్య, ముక్కర్ల లాలయ్య, జర్నలిస్టు నాయకులు తొండ వెంకట్ పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు పదవీ విరమణ శుభాకాంక్షలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పదవి విరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్ రావు, హెడ్ కానిస్టేబుల్ అజయ్‌కి ఎస్సార్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, తోటి సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది శాలువా లతో పూలమాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. గత 40 ఏండ్లుగా పోలీస్ శాఖలో సేవలు అందించి పదవి విరమణ పొందటం ఎంతో అదృష్టంగా భావించాలని వారిని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి

- బీసీ నేత లింగంగౌడ్ డిమాండ్



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర ప్రభుత్వం 2025-2026 ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 60 శాతానికి పైగా ఉన్నటువంటి బీసీలకు కేవలం బిక్షం వేసినట్టు కొద్ది శాతం మాత్రమే నిధులు కేటాయిస్తు ప్రతీ ఏడాది మొండి చేయి చూపిస్తున్నారని, ఈరోజు బీసీ ప్రధాని అని చెప్పుకునే నరేంద్ర మోడీ కూడా బీసీల పక్షాన నిలవకుండా వ్యవహరిస్తున్నారని లింగంగౌడ్ అన్నారు. పన్నులు కట్టేది బీసీలు కానీ నిధులు మాత్రం అరకొర కేటాయిస్థారా అని ప్రశ్నించారు. బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించకపోతే బీజేపీకి తగిన బుద్ధి చెపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్‌కు ఓయూలో ఆందోళన



- ఎస్సీ వర్గీకరణకు, బీసీ డిక్లరేషన్‌కు ఓపిక పట్టాం
- ఓయూ జెఏసీ చైర్మెన్ మోతిలాల్ నాయక్

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ డా.బీఆర్.అంబేద్కర్ మెయిన్ లైబ్రరీ ఎదుట ఓయూ జెఏసీ చైర్మెన్ మోతిలాల్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మోతిలాల్ మాట్లాడుతూ.. చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల సమస్యలపై నేటి నుంచి నిరవధిక శాంతియుత ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎస్సీ వర్గీకరణకు, బీసీ డిక్లరేషన్‌ను అమలుకోసం ఓపిక పట్టామని కానీ నిరుద్యోగుల విషయంలో ఇప్పటినుంచి ఆగేప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం జాబ్ నోటిఫికేషన్లు ఇచ్చేవరకు ఉద్యమాన్ని ఆపేదే లేదన్నారు. ఎక్కడ కూడా కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో జరగనున్న లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఓటు కూడా పడకుండా చేస్తామన్నారు. ప్రొఫెసర్స్ వయోపరిమితి పెంపు అంటే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గొల్ల కొట్టడంమే అన్నారు.

విధుల్లో ఉత్తమ ప్రతిభ..
సీపీ చేతుల మీదుగా రివార్డ్స్

- పోలీసులు అలుపెరగని కృషి వల్లే ప్రశాంతతకు మార్గం సుగనమైంది
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో నేరాల నివారణకు, నేరస్తులను కట్టడి చేయడంతోపాటు త్వరితగతిలో కేసులను పరిష్కరించిన వారిని నగర సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ 2024 సంవత్సరానికి గాను శుక్రవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో మెగా రివార్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 సంవత్సరంలో కేసులను గుర్తించడం, పరిష్కరిం చడంలో గణనీయమైన కృషి చేసిన 706 మంది అధికారులు, సిబ్బందిని సన్మానించారు. ఇందులో 6 మంది అదనపు డీసీపీలు, 13 మంది ఏసీపీలు, 73 మంది ఇన్‌స్పెక్టర్లు, 83 మంది ఎస్ఐలు, 12 మంది ఎఎస్ఐలు, 86 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 334 మంది పోలీస్ కానిస్టేబుల్స్, 29 హోమ్ గార్డ్స్, 64 మినిస్టీరియల్ సిబ్బందితోపాటు 6 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. సైబర్ క్రైమ్ పోలీసులు ఎదురు కుంటున్న సవాళ్ళను పరిగణనలోకి తీసుకుని, ఈ స్పెషల్ వింగ్స్‌ను ఏర్పాటు చేసినట్టు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి 'హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్' ట్రోఫీని అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 2024 సంవత్సరానికి గాను సీసీఎస్ విభాగంలోని ఏసీపీ వై. హరీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్ఐలు రవి కుమార్, బీ.జయంత్‌ల తోపాటు పలువురికి కమిషనర్ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న అహర్నిశల కృషిని అభినందించారు. 80 లక్షల జనాభాతో వివిధ రకాల నేరస్తులు, వారందరికీ న్యాయం చేయడం అసాధ్యమని, అయినప్పటికీ హైదరాబాద్ పోలీసులు రాణిస్తున్నా రని అన్నారు. నగరంలో ప్రతిరోజూ ఏదో ఒక బందోబస్త్ / భద్రతా ఏర్పాట్లతో చాలా బిజీగా ఉంటామని, నగరంలో ఎప్పుడు ఎలాంటి నేరాలు జరిగినా ఆలస్యం చేయకుండా వెంటనే స్పందిస్తున్నామని తెలిపారు. పోలీసులందరం జట్టుగా కలిసి చేసిన ప్రయత్నాల వల్లనే హైదరాబాద్ సిటీ పోలీసులు ప్రశంసలు అందుకోవడంతోపాటు దేశంలోనే చెప్పుకోదగ్గ ఖ్యాతిని ఆర్జిస్తున్నామన్నారు. పోలీసులు తమ విధుల పట్ల అంకితభావంతో, అలుపెరగని కృషి వలనే సమాజంలో శాంతి, ప్రశాంతతకు మార్గం సుగమైందన్నారు. హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో చూపిస్తున్న అంకితభావం, నిబద్ధతను ప్రశంసించారు.

ఈ సమావేశంలో డీసీపీలు ఎస్. శ్వేత, డీ. కవితతోపాటు అన్ని విభాగాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జనవరి 1 నుంచి 31 వరకు జరిగిన జాతీయ రోడ్డు భద్రత మహోత్సవంలో భాగంగా ఇప్పటివరకు వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలకు, ఆటో డ్రైవర్లకు ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శుక్రవారం చివరి రోజు యూసుఫ్ గూడా చెక్ పోస్ట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ట్రాక్స్ స్వచ్ఛంద సొసైటీ వారు ఉచితంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక సమావేశంలో వేస్ట్ జోన్ ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ట్రాక్స్ ఎన్జీవో స్వచ్ఛంద సొసైటీ సంస్థ ప్రాజెక్టు హెడ్ ఆరాధన జైన్, ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నీంకర్‌ను అభినందించారు. మొదటగా పాఠశాల విద్యార్థులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసిన, తాగి వాహనాలు నడిపిన, సిగ్నల్ జంప్ చేసిన, ప్రమాదాలు ఎలా జరుగుతాయో స్టేజ్ పైన ప్రదర్శించి చూపించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 హెల్మెట్లను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రెండు హెల్మెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. పిల్లలను స్కూలుకు తీసుకొని వచ్చేటప్పుడు తండ్రి కానీ తల్లి కానీ మోటార్ బైక్ నడిపిన యెడల హెల్మెట్ తప్పకుండా ధరించుకొని, వెనుక కూర్చున్న మీ పిల్లలకు కూడా హెల్మెట్ పెట్టుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, డీఇఓ పరమేశ్వరమ్మ, హై స్కూల్ ఉపాధ్యాయులు, పిల్లలు భారీగా పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తా..

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- అమీర్‌పేట్ డివిజన్ కుమ్మర బస్తీలో రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్టు మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అమీర్‌పేట్ డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం బస్తీలోని పలు రోడ్లలో కాలినడకన తిరుగుతూ.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు పూర్తయ్యే వరకు బస్తీ వాసులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. నాణ్యతతో సకాలంలో రోడ్డు పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 2014కు ముందు సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని చాలా ప్రాంతాలలో సరైన రోడ్లు లేక వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారని, సరైన డ్రయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై నీరు ప్రవహించేదని తెలిపారు. తాను వచ్చిన తర్వాతనే డ్రయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేయడం జరిగిందన్నారున.. రోడ్లను అభివృద్ధి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి వాహనదారుల ఇబ్బందులను పరిష్కరించినట్టు వివరించారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. తమ బస్తీలో స్ట్రీట్ లైట్‌లు రోజుల తరబడి నుంచి వెలగడం లేదని బస్తీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా, వెంటనే లైట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రేణుకానగర్‌లో జనావాసాల మధ్య ఉన్న గ్యాస్ గోదాంను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గోదాం ఆవరణలో ఇటీవలనే చిన్న అగ్నిప్రమాదం చోటు చేసుకుందని, సకాలంలో అప్రమత్తమవడం వలన పెను ప్రమాదం తప్పిందని చెప్పారు. ఇప్పటికే ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు లేఖ కూడా వ్రాయడం జరిగిందని వివరించారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు గ్యాస్ గోదాం తరలించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసు దేవరెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి, ఎలక్ట్రికల్ ఏఈ, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నామన సంతోష్ మణి కుమార్, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, ఉత్తమ్ సింగ్ రాజ్ పురోహిత్, కూతురు నర్సింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఇంకా పెరుగుతాయి

- ఫ్రాంక్ టెలుటో



నవతెలంగాణ-బంజారాహిల్స్

అమెరికా యూనివర్సిటీలలో విద్యను అభ్యసిస్తున్న, విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు పెరుగుతాయని యుఎస్ కాన్సులేట్ పొలిటికల్ అండ్ ఎకనామిక్ అడ్వైజర్ ఫ్రాంక్ టెలుటో అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్లో గ్లోబల్ ట్రీ సంస్థ ఆధ్వర్యంలో అమెరికా ఎడ్యుకేషన్ ఫెయిర్‌కూ ముఖ్యఅతిథిగా ఫ్రాంక్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు ట్రంప్ అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత కొత్తగా వచ్చిన నిబంధనలు ఏమీ లేవని పాత నిబంధనలు అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు క్యాంపస్ లోపల వచ్చే పార్ట్ టైం ఉద్యోగాలు లీగల్ అని, క్యాంపస్ బయట చేసే ఉద్యోగాలు లీగల్ కాదని ఈ నిబంధనను మాత్రమే కఠిన తరం చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఎఫ్ఎస్, ఓపీటీ, సీపీటీ వంటి రూల్స్ ఏవీ మారలేదని తెలిపారు. గ్లోబల్ ట్రీ ఫౌండర్ శుభకర్ మాట్లాడుతూ.. అమెరికా యూనివర్సిటీలలో చదువుకోవాలని విద్యార్థులు తొలిసారి వీసా ఇంటర్వ్యూలకు హాజరవుతున్న విద్యార్థులు కొన్ని మెళకువలు, కొంత సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో వీసాలను సులభంగా పొందవచ్చునిన తెలిపారు. వీసా పొందేందుకు అవసరమైన మెళకువలను కూడా ఆయన వివరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకిన్ అమెరికా నినాదం వల్ల వేలాది మంది మన విద్యార్థులకు సైతం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఈ సందర్భంగా వందకుపైగా ప్రఖ్యాత యూనివర్సిటీల ప్రతినిధులతో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నట్టు గ్లోబల్ ట్రీ సీఈవో శ్రీకర్ తెలిపారు. ఏ యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారో, వసతులు అందిస్తున్నరో కోర్సుల గురించి అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు.

మేయర్ కార్యాలయం వద్ద నిరసన

- మేయర్ క్షమాపణ చెప్పాలి: కార్పొరేటర్లు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీఆర్ఎస్ కార్పొరేటర్లపై జరిగిన దాడులకు నిరసనగా మేయర్ భేషరుతుగా క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ.. జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు శుక్రవారం మేయర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి జరిగిన విషయాన్ని వెల్లడించారు.

ప్రొఫెసర్ల వయోపరిమితి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకుల రిటైర్మెంట్ వయోపరిమితి అరవై సంవత్సరాల నుంచి అరవైఐదు సంవత్సరాలకు పెంచడాన్ని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ స్వాగతిస్తున్నట్టు టౌటా అధ్యక్షుడు ప్రొ.జీ.మల్లేశం హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తుమని శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా టౌటా అధ్యక్షుడు ప్రొ.జీ.మల్లేశం మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుల వయోపరిమితి పెంచడం వల్ల పరిశోధన విభాగంలోనూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని తెలిపారు. అధ్యాపకుల వయో పరిమితి పెంచిన విధంగా యూనివర్సిటీలో ఖాళీలను కూడా భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోనీ అన్ని యూనివర్సిటీలో డెబ్బై ఐదు శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ ప్రస్తుతం ఇరవై ఐదు శాతం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. యూనివర్సిటీల్లో సుమారుగా పదకొండు వందల మంది ప్రొఫెసర్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. మంగు, డా.చలమల్ల వెంకటేశ్వర్లు, టౌటా జనరల్ సెక్రెటరీ ప్రొ. సి.హెచ్ శ్రీనివాస్, ప్రొ.సరస్వతమ్మ, ట్రెజరర్ ఎస్.నరసింహులు, ప్రొ. జె.వెంకటేశ్వర్లు, ప్రొ. షరీఫుద్దీన్, ప్రొ.ఎం.వి రమణారావు, ప్రొ. పి.సతీష్ కుమార్, ప్రొ. ఈ. విద్యాసాగర్, ప్రొ. సరితా రాజేందర్, ప్రొ. సంకే నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



నవతెలంగాణ-ఓయూ

టీడీపీ సీతాఫల్మండీ డివిజన్ మాజీ అధ్యక్షులు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 20 మంది యువకులు బౌద్ధనగర్‌లోని టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ నివాసంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వల్లారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెదేపా హయాంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విజన్‌కి ఆకర్షితులై యువత ఈరోజు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. చంద్రబాబు ఎప్పటికి కోరుకొనేది ఒకటేనని రెండు తెలుగు రాష్ట్రాలు భారతదేశం అభివృద్ధిలో ముందుండాలనేది అయన చిరకాల కోరిక అన్నారు. ప్రపంచదేశాల్లో తెలుగువారి ఘనకీర్తిని చాటేలా యువత ముందుకి సాగలాన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, చిరంజీవి రాజు, శేషిరేఖ, బండి మురళి, చంద్రమోహన్, నాయుడు, పుప్పాల విజయ్, టైలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

ఆత్మార్పణతో స్త్రీల ఆత్మగౌరవం ఎంతో గొప్పదని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు రుజువు చేసిందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సనత్‌నగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతంలోని పబ్బా వీరాంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కులదేవతగా నిత్యం పూజలను అందుకుంటుందని తెలిపారు. పూజల అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు శేఖర్, జమీర్, నోమాన్, పురుషోత్తం, వసీం, ఆర్యవైశ్య సంఘం నాయకులు యాదగిరి, చంద్రశేఖర్, కిలికిరి వెంకటేష్, పబ్బా భారతి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో గద్దర్ జయంతి సభ



నవతెలంగాణ-ఓయూ

గద్దర్ 77వ జయంతి సభను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచి తన మాట పాటల ద్వారా బడుగు బలహీన వర్గాలను పీడిత దళిత బహుజన ఆదివాసి గిరిజన మైనార్టీల హక్కుల కోసం గళమెత్తిన గద్దర్ అంటు యూనివర్సిటీ విద్యార్థులు ఘనంగా అయిన సేవాలు కొనియాడారు. అయిన ప్రజా వాగ్గేయకారుడు అంటు, పీడిత వర్గాల ఫైటర్ అని, పాట ఉన్నతం కాలం గద్దర్ ఉంటారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గద్దర్ పాట ఉధృతం చేసినట్టు అన్నారు. ఈ సభలో స్వాగతం ఉపన్యాసం చేసిన రవీందర్ నాయక్ గద్దర్ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ ఉద్యమా పోరాటాన్ని ఒకసారి విద్యార్థులకు గుర్తు చేశారు. పోలీసులు విద్యార్థుల మీద లాటి ఛార్జ్ చేసిన భాస్ప వాయు గోళాలు వదిలిన విద్యార్థులు లక్ష్యం వదలకూడదు తెలంగాణ సాధనే మన ఏకైక లక్ష్యం మీకు నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చి యూనివర్సిటీలో ఏ సంఘటన జరిగిన కొన్ని నిమిషాల్లోనే గద్దర్ అన్న యూనివర్సిటీకి చేరుకొని విద్యార్థులకు అండగా ఉండేవారని గుర్తుచేశారు. వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలని రవీంద్రా నాయక్ కోరారు. ఈ సభలో తేజావత్ బెల్లయ్య నాయక్, ట్రైకార్ చైర్మెన్ ప్రొ. హరగోపాల్, బి.నర్సింగరావు, సూర్యకిరణ్ గద్దర్, ఏపూరి సోమన్న, ప్రొ.సూరేపల్లి సుజాత, ప్రొ.రమేష్, ప్రొ.నాగేశ్వరరావు, ప్రొ. సవిన్, ఓయూ జేఏసీ నాయకులు కోట శ్రీనివాస్, మాందాల భాస్కర్, దుర్గం భాస్కర్, గద్దం శ్రీనివాస్, కేటూరి వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. మాదాసు రాహుల్ వందన సమర్పణ చేశారు.

సీఎం నిర్ణయం హర్షణీయం

- రాష్ట్ర అధ్యక్షుడు డా.పరశురాం

నవతెలంగాణ-ఓయూ

సీఎం రేవంత్ రెడ్డి యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు వయోపరిమితి పెంచడం హర్షణీయం అని ఔట-సీ అధ్యక్షుడు, యూటీఏసీ-సీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశరాం ఒక ప్రకటనలో అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మా బాధలు చూసి కాస్త మా సేవాలు గుర్తించి ఊరట కలిగించిన మానవత్వం కలిగిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ డా.జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు డా.రాం దాస్ నాయక్ పాల్గొన్నారు

ముదిరాజులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- మండలి చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎన్నికల సమయంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీడీ నుంచి బీసీ ఏలోకి మారుస్తామన్న హామీతో పాటు ఇతర హామీలను తక్షణమే నెరవేర్చాలని శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమీర్‌పేటలోని ఓ హోటల్లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బండ ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, రాష్ట్ర నాయకులు తలారి మల్లేశం పెద్ది విజయ్ కుమార్ బల్ల సత్తయ్య నందుల వరలక్ష్మి యాదయ్య బొక్క శీను తదితరులు హాజరై ప్రసంగించారు. ముదిరాజ్ మహాసభ ఏర్పాటు సాధించిన విజయాలు భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తమ న్యాయమైన ఆకాంక్ష బీసీ ఏ లోకి మార్చేందుకు జీవో నెంబర్ 15 తీసుకువచ్చారని తెలిపారు. కాగా కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఆ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లిందని చెప్పారు. సమగ్ర విచారణ అనంతరం సుప్రీంకోర్టు రాష్ట్ర పరిధిలోని ఈ సమస్యను పరిష్కరించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. అప్పటి నుంచి సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నా ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చినందునే తమ సామాజిక వర్గ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు పలికారని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు యువత అవకాశాలు కోల్పోతుందని అన్నారు. కోకాపేటలో గత ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో నిర్మాణాలకు సైతం సహకరించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నెలరోజుల పాటు ఎమ్మెల్యే ఎంపీ ఎమ్మెల్సీలకు వినతి పత్రాలు అందజేస్తామని చెప్పారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో ఈ అంశంపై చట్టసభల్లో చర్చించాలని సీఎంకు విన్నవిస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ప్రత్యక్ష కార్యాచరణ రూపొందించుకొని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

అమ్మవారి ఉత్సవంలో కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

వాసవి మాత సాంస్కృతిక ఆధ్యాత్మిక ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి వార్షిక ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని, వాటి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నిర్వాహకులు కోట నీలిమకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తుల సహకారంతో ఈ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు.

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ హాస్పిటల్‌లో ఉద్యోగం చేస్తున్న పలువురు ఉద్యోగులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. హాస్పిటల్ మొదటి అంతస్తులోని లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ నగరి భీరప్ప వారిని సత్కరించి, వారు హాస్పిటల్‌కు అందించిన సేవల్ని కొనియాడారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో ఆర్.పద్మలత, అసిస్టెంట్ రిజిస్ట్రార్, వి. కుమార స్వామి, సీనియర్ టెక్నీషియన్ ఆఫీసర్, సయ్యద్ తాజుద్దీన్ హుస్సేన్ కద్రి, ఈసీజీ టెక్నీషియన్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ లిజా రాజశేఖర్, డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, సత్యగౌడ్, మార్తా రమేష్, శ్రీనివాసులు, శ్రీనివాస్‌రావు, వివిధ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌర్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలి..



- జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఆందోళన

నవతెలంగాణ-సిటీబ్యూరో

10వ సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఘోరంగా అవమానించారని, శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పాలకమండలి వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల గొంతునొక్కిందన్నారు. కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను మేయర్ గద్వాల విజయలక్ష్మి బయటకు పంపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేయర్ తీరుకు నిరసనగా జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. జీహెచ్ఎంసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెజార్టీ సభ్యులున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లను మేయర్ మార్షల్స్‌తో బలవంతంగా సభ నుంచి బయటకు పంపించేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే విధంగా మేయర్, అధికార పార్టీ వ్యవహరించారన్నారు. తమపై దాడి చేసిన కాంగ్రెస్ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగదని, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ విధానాలను ఎండగడతామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాసరావు, విజయశాంతి, సతీష్ గౌడ్ స్పష్టం చేశారు.

ఫుట్ పాత్ అక్రమాలను కూల్చేసిన జీహెచ్ఎంసీ అధికారులు





నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రధాన రహదారుల కిరువైపులా ఫుట్ పాత్ ఆక్రమణాలపై జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాల మేరకు.. టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో ఫుట్ పాత్ ఆక్రమణాలను తొలగించారు. వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకర్‌మట్ వెజిటేబుల్ మార్కెట్‌లో రోడ్డు ఫుట్ పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రజావాణిలో కమిషనర్ ఇల్లంబర్తికి ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అంబర్‌పేట టౌన్ ప్లానింగ్ అధికారులు శంకర్ మట్ కూరగాయల మార్కెట్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలీస్ బందోబస్తు నడుమ రోడ్లు, ఫుట్ పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన కూరగాయల బండ్లను పూర్తిగా తొలగించారు. అదేవిధంగా దుకాణాల ముందు ఆక్రమంగా ఏర్పాటుచేసిన ఇనుప షెడ్లను తొలగించారు. టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. శంకర్ మట్‌లో 60 ఫీట్లు ఉన్న రోడ్డు కాస్త కూరగాయల బండ్ల ఆక్రమణాలతో 30 ఫీట్లకు కూచించుకుపోయిందని స్థానికులు ఆరోపించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, కనీసం తాము ఇండ్లలోకి వెళ్ళలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూరగాయల మార్కెట్ల జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు వారం వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి.. భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా పూర్తి స్థాయిలో అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ అధ్యాపకుల క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వ అధ్యాపకుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి విభాగం అధ్యక్షుడు మబ్బు పరశురామ్ అధ్యక్షతన సంఘం నూతన క్యాలెండర్‌ను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కిషన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. సరళమైన పద్ధతిలో బోధించాలని అధ్యాపకులకు సూచించారు. జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకటయ్య, నాగేందర్, ఉమాదేవి, సీనియర్ అధ్యాపకులు ఉపేందర్, శోభారాణి, అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్, ఉపేందర్, రవి, రహీముద్దీన్, రాజ్‌కుమార్, వాసంతి, శారద, పద్మజ, గౌరీ, పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

అందరం ఆరోగ్యంగా ఉంటే, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మోతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన, 555 ఫిట్నెస్ సెంటర్‌ను కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌తో కలిసి మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ప్రతి వ్యక్తి, శారీరక మానసిక ధృఢత్వానికి కృషి చేయాలని సూచించారు. ఆటలు ఆడటం శారీరిక శ్రమ చేయడం ద్వారా, మనిషి పూర్తి స్థాయి ఆరోగ్యంగా ఉంటాడని అన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఎవరికి వారు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఏ వయసు వారైనా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం ద్వారా జీవన కాలాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్ గౌడ్, హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా, ఫసియుద్దీన్, కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్, రఘు, కాంగ్రెస్ యూత్ నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఆర్యవైశ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ గాజులరామారం గ్రామం, షాపూర్ నగర్, గాజుల రామారం ఆర్యవైశ్య సంఘంల ఆధ్వర్యంలో.. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కాలువ సుజాత, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, కుత్బుల్లా పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దయతో ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, అడ్వకేట్ కమలాకర్, ఇబ్రహీం ఖాన్, చెట్ల వెంకటేష్,చిన్న చౌదరి,చందు సుంకరి, పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు కె.యం. ప్రతాప్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల10 నుంచి 15వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ముఖ్యంగా 12వ తేదీన నిర్వహించే శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం, 14న రథోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,పెద్దలు కె.యం. ప్రతాప్‌ని, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్త ఠాగూర్ రాజేందర్ సింగ్, ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీరాములు గౌడ్, నల్ల లింగం గౌడ్, రత్నం మురళి గౌడ్, నార్ల కంటి శ్యాం కుర్మా, నక్క ప్రకాష్, కుంట వేణు ముదిరాజ్, రత్నం కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు 'కేరిర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్



నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు 'కేరిర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్'మాడ్యూల్ ను తెలుగులో ముద్రించి అన్ని ప్రభుత్వ పంచాయితీ రాజ్ కేజీబీవీ, తెలంగాణ రెసిడెన్షల్ స్కూల్స్‌కు పంపిణీ చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫేడరేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు కోరారు. శుక్రవారం వారు తెలంగాణ రాష్ట్ర శిక్షణ, పరిశోధన(ఎస్సీ ఆర్టీఈ)రాష్ట్ర డైరక్టర్ రమేష్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్.శ్రీవాటి శ్రీనాథ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్. విజయ భాస్కర్‌లు మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయు లకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఇంగ్లీషులలో మద్యూళ్లను పంపిణీ చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఆర్టీఈ డైరక్టర్ తెలుగులో ముద్రించి తెలంగాణ లోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలకు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫేడరేషన్ హైదరాబాద్ జిల్లా కోశాధికారి సాగరం మీనా కుమారి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం..

● సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ్ శుక్లా



నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.విప్లవ్ శుక్లా అన్నారు. ఆఅఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) చార్మినార్-శాఖ ఆధ్వర్యంలో సిటీ కళాశాలలో క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ ఆటల పోటీలను ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ డా.యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతులను పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగానే ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్.ఆనంద్, డాక్టర్. శంకర్, డాక్టర్.రామారావు, బోధనేతర సిబ్బంది రామ్ కళాశాల అధ్యక్షులు జితేందర్ చార్మినార్ టౌన్ సెక్రటరీ రవితేజ, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్, శీను, విద్యార్థి నాయకులు సంతోష్, సుందర్, శివమణి, తదితరులున్నారు.

విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంఘానికి స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ విశ్రాంత వ్యవసాయశాఖ అధికారుల సంక్షేమ సంఘం కార్యకలాపాల నిర్వహనకు ప్రభుత్వం ఖాళీస్థలాన్ని లేదా ప్రభుత్వ బిల్డింగ్ ను కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షులు టి.రంగారెడ్డి, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మెన్ బి. కృపాకర్ రెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విశ్రాంత వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం 13వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రిటైర్డ్ అయినప్పటికి తమ సంఘం ఆధ్వర్యంలో రైతులను చైతన్య వంతం చేయడంతోపాటు ఏవో తదితర అధికారులకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతు కమీషన్ కూడా తమ సంఘం తరుపున సలహాలు సూచనలు ఇస్తున్నామన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా వారిలో మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహనకోసం తమ సంఘానికి బిల్డింగ్ లేదా ఖాళీస్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కె. రాజిరెడ్డి, కోశాధికారి కృష్ణయ్య, మాజీ కోశాధికారి మురళీధర్‌రాజు, వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి జి. కృపాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయ జయంతి

● ఆకట్టుకున్న పల్లకీసేవ, ఒగ్గు కళాకారుల నృత్యాలు



నవతెలంగాణ-అంబర్‌పేట

సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేట పోచమబస్తీలో శుక్రవారం శ్రీమార్కండేయ జయంతి, పల్లకీసేవ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతిహోమం, అనంతరం మార్కండేయ పూజలను చేశారు. పోచమ్మబస్తీ నుంచి పాములబస్తీ, భరత్‌నగర్, రెడ్‌బిల్డింగ్, అయ్యప్ప టెంపుల్, శివంరోడ్డు, శారదానగర్ మీదుగా మార్కండేయ స్వామి పల్లకీసేవ జరిగింది. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల నృత్యాలు , వారి విన్యాసాలు అలరించాయి. మార్కండేయుని కథను కూడా కళారూపాల రూపంలో తెలియజేశారు. బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆధ్యాత్మిక వేత్త చందర్పాలాబ్బాబా, ప్రముఖ న్యాయవాది జి. ఎల్.నరసింహరావు, అఖిల భారత పద్మశాలి సంఘం ఇంజనీర్స్ విభాగ్ వింగ్ అధ్యక్షుడు డా. పుట్ట పాండురంగయ్య, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు పగిడిమర్రి హరి, అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు వర్కల కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎ. అంజయ్య, డీడీ అండ్ సీతా కాలనీ అధ్యక్షుడు చిలువేరు యాదగిరి, పులిపాటి శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు పోరండ్ల శారద, గందెమల్లి శ్రీనివాస్, ఎస్. నర్సింగ్ రావు , సిలివేరు జయసింహ, తీగల నరేందర్, నాగుల రాజేందర్, కాశి, వనం రమణ, సీనియర్ జర్నలిస్టులు ఎం.సతీష్ ముదిరాజ్, కే .పురుషోత్తం, బబ్లూ, అసోసియేషన్ ప్రతినిధులు రచ్చ లావణ్య, శశాంక్, పోచయ్య, ప్రవీణ్, నాగేష్, భాగ్యలక్ష్మీ, వై.శ్రీను, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విమర్శతోనే ఉత్తమ రచనలు

● గ్రంథావిష్కరణ సభలో వక్తలు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పాఠకుల్లో సాహిత్య అభిరుచిని పెంచి మంచి రచనలు రావడానికి దోహదం చేసే ప్రక్రియ విమర్శ అని వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించిన 'తెలుగు సాహిత్య విమర్శ- పర్యాలోచన' గ్రంథావిష్కరణ సభ శుక్రవారం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో జరిగింది. ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ముదిగంటి సుజాతా రెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించారు. అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ తెలుగు సాహిత్యం ఉన్నత ప్రమాణాలు సాధించడానికి దోహదపడే అనేక శిక్షణ శిబిరాలను సారస్వత పరిషత్తు నిర్వహిస్తుందన్నారు. డాక్టర్ సుజాతా రెడ్డి మాట్లాడుతూ తెలుగులో కందుకూరి వీరేశలింగం మొట్టమొదట విమర్శ గ్రంథం రాశారని, తర్వాతి కాలంలో కట్టమంచి రామలింగారెడ్డి వంటి వారు ముందుకు నడిపారని ఆధునిక కాలంలో అనేక ధోరణులు సాహిత్య విమర్శలో చోటు చేసుకున్నాయని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్తలు విమర్శకులు ఆచార్యులు ఎస్వీ రామారావు, మసన చెన్నప్ప, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ డి. చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ వి. త్రివేణి, డాక్టర్ మారోజు దేవేంద్ర తమ ప్రసంగాలలో సాహిత్య విమర్శ చరిత్రను, వికాసాన్ని విపులంగా ప్రస్తావించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతో పన్యాసం చేశారు. ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ.సిల్మా నాయక్‌సమన్వయకర్తగా వ్యవహరించారు.

పొఫెషనల్ కోర్సులతో విద్యార్థుల కెరీర్

నవతెలంగాణ-ధూల్‌పేట్



సిటీ కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సంయుక్తంగా 'కెరీర్ అవగాహన కంపెనీ సెక్రటరీ' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. విప్లవ దత్‌శుక్ల అధ్యక్షత వహించి మాట్లాడారు. కంపెనీ సెక్రటరీ (సీఎస్) వంటి వృత్తి కోర్సులు కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల కెరీర్ రూప కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా ఐసీఎస్ఐ అసోసియేట్ మెంబర్ గౌరవ్ అగర్వాల్ పాల్గొని మాట్లాడు తూ.. కంపెనీ సెక్రటరీ కోర్సు ద్వారా లభించే ఉద్యోగావకాశాలు, వృత్తి అభివృద్ధి, అంతర్జాతీయ ప్రాధాన్యత వంటి అంశాలపై విలువైన సమాచారాన్ని విద్యార్థుల తో పంచుకున్నారు. విద్యార్థి కోఆర్డినేటర్ ఎం.బి ప్రవీణ్ కుమార్ కంపెనీ సెక్రట రీ కోర్సు ప్రణాళిక, దాని ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ఫ్యాకల్టీ సభ్యురాలు ఇఫాత్ ఉన్నీసా బేగంతోపాటు, డాక్టర్. కే. మల్లికార్జునరావు (విభాగాధిపతి), డాక్టర్. ఎస్. ఝాన్సీరాణి, డాక్టర్. శిరిషా, లలిత, అరుణ, సత్యనారాయణ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి

● ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని నియంత్రించాలి

● పీవైఎల్, పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా





నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా పరిధిలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలనీ, ప్రయివేటు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని కోరుతూ ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రెండు నెలలుగా ప్రొగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) ఆధ్వర్యంలో విస్తతంగా సర్వేలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లలోకి వెళ్ళి వేలాది మంది పేషంట్ల అభిప్రాయాలను సేకరించడంతో అనేక సమస్యలు తమ దష్టికి వచ్చినట్టు తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌కు రోగుల రద్దీ తీవ్రంగా ఉందనీ, ఈ రద్దీకి అనుగుణంగా ఓపీ కౌంటర్లు లేకపోవడంతో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుందని తెలిపారు. డాక్టర్ల వద్ద సైతం క్యూ తప్పడం లేదన్నారు. అన్ని రకాల టెస్టులు చేయడం లేదన్నారు. చేసిన కొన్నయినా రోజుల తరబడి సమయం పడుతుందని తెలిపారు. స్కానింగ్, సిటీ స్కానింగ్‌ల ఊసే ఉండటం లేదన్నారు. అన్ని రకాల మందులు ఇవ్వకపోవడంతో ప్రయివేటు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి పేద రోగులకు ఏర్పడిందన్నారు. కొన్ని హాస్పిటల్స్‌లో బెడ్స్ కొరత తీవ్రంగా ఉందన్నారు. కనీస వసతుల్లేక పేషెంట్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పేషెంట్ల సహాయకులకు టాయిలెట్స్ సరిగా లేకపోవడం, విశ్రాంతి గదుల్లేక చలిలో ఆరు బయట పడుకోవాల్సి వస్తుందన్నారు. బస్తీ దవాఖానాలు సమస్యలకు నిలయాలుగా మారాయనీ, కొన్ని చోట్ల డాక్టర్లే ఉండటం లేదన్నారు. ఇన్ పేషంట్లకు మూ డు పూటల భోజనాలకు రూ.80 చెల్లిస్తున్నారనీ, ఇది ఏ మాత్రం సరిపోవడం లేదనీ, రూ.160కి పెంచాలని కోరారు.

ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో దోపిడీ

హైదరాబాద్‌లో ప్రయివేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ దోపిడీకి అడ్డూ అదుపూ లేదన్నారు. చాలా హాస్పిటల్స్ వైద్యాన్ని వ్యాపారంగా మార్చి పేషెంట్ల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నాయని చెప్పారు. ఓపీ ఫీజు మొదలుకుని టెస్టులు, మందులు, డాక్టర్ల ఫీజులు, బెడ్ ఫీజులు ఇలా ఏవీ తక్కువ లేకుండా రూ.లక్షల బిల్లులు వేసి, దోపిడీ చేస్తున్నారన్నారు. సమస్య చిన్నదైనా పెద్దదిగా చూపి అనవసర టెస్టులు చేయించి, ఆపరేషన్లూ చేస్తున్నారని తెలిపారు. మందుల బిల్లులు పేషెంట్లు భరించలేనంతగా వేస్తున్నారని తెలిపారు. టెస్టులు ఒక్కో హాస్పిటల్‌లో ఒక్కో రకంగా ఉంటున్నాయని తెలిపారు. పరికరాలు ఖరీదు అని నమ్మబలుకుతున్నారని తెలిపారు. నోటీస్ బోర్డుల్లో డాక్టర్ల వివరాలు, సేవలు, టెస్టుల రేట్లు చాలా హాస్పిటల్స్‌లో ప్రదర్శించడం లేదన్నారు. ఎమ్మార్పీ రేటుతో చిన్న ఖరీదు గల మందులను, వైద్య పరికరాలను అధిక రేట్లతో బిల్లులు వేస్తున్నారని తెలిపారు చాలా హాస్పిటల్స్ పీఆర్‌ఓలను నియమించుకుని, చిన్న హాస్పిటల్స్ లేదా క్లీనిక్ నుంచి పేషంట్లను తమ హాస్పిటల్స్‌కు రప్పించి, ఇష్టారాజ్యంగా వైద్య బిల్లులు వేస్తున్నారనీ, దీనిపై ప్రత్యేక దష్టి సారించి నియంత్రించాలని కోరారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీ తీవ్రం

డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీ కూడా తీవ్రంగా ఉందన్నారు. ఒక్కో టెస్టుకు ఒక్కో సెంటర్లు వేర్వేరుగా బిల్లు వేస్తున్నారనీ, ఇదేంటని ప్రశ్నిస్తే 'మా దగ్గర టెస్టు పరికరాలు ఆధునాతనమైనవి' అంటున్నారని తెలిపారు. కనీస వసతులు కూడా ఉండటం లేదన్నారు. పార్కింగ్ సౌకర్యం కూడా లేదన్నారు. ఈ డయాగ్నోస్టిక్ సెంటర్లలో అధిక రుసుం వసూళ్ళపై ప్రత్యేక దష్టి సారించి, నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, లక్ష్మీబాయి, వరలక్ష్మి, రవికుమార్, కృష్ణ, కిరణ్, భీమేష్, శ్రీనివాస్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

1392 జూనియర్ లెక్చరర్స్‌కు నియామక పత్రాలు అందజేయాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి అభ్యర్థులు వినతి



నవతెలంగాణ-ముషీరాబాద్

టీజీపీఎస్సీ ద్వారా ఎంపిక కాబడిన 1392 జూనియర్ లెక్చరర్స్‌కు వెంటనే నియామక పత్రాలు అందజేయాలని, ఇందుకు ప్రభుత్వం స్పందించే విధంగా కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజీపీఎస్సీ ద్వారా 15 ఏండ్ల తరువాత ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఖాళీగా ఉన్న 1392 జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, 2023లో రాత పరీక్ష నిర్వహించి, 2024 జూలైలో మెరిట్ జాబితా ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియమక పత్రాలు అందచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలు అందజేశారు. కానీ 1392 జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఇప్పటివరకూ నియామకపత్రాలు అందజేయ లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించే విధంగా చర్య లు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శిని కోరారు. అనంతరం సీపీఐ (ఎం) పార్టీ నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్‌వెస్లీను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉపాధ్య క్షులు కోట సతీష్ కుమార్, వివిధ యూనివర్సిటీల నుంచి జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు డాక్టర్. జి.లింగా నాయక్, ఎ.వేణురావు, ముత్యాలు, బొజ్య నాయక్, వీణా చారి, సుమన్,రాజశేఖర్, అభిషేక్,వినయ్ తదితరులున్నారు.

ఉత్సాహంగా జోసెఫెస్టా-2025..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



విభిన్న సంస్కృతులకు నిలయంగా మారిన హైదరాబాద్ చరిత్రను మరింతగా ఇనుమడింపజేసేలా విద్యార్థినీ, విద్యార్థులు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలోని అద్భుతమైన సాహిత్యంతో కూడిన పాటలకు తమదైన శైలిలో ఆడిపాడారు. కింగ్ కోఠిలోని గల సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జోసెఫెస్టా-2025 కార్యక్రమం ఆద్యంతం యువతీ, యువకుల కేరింతలతో కళాశాల ఆవరణం హోరెత్తించారు. సృజనాత్మక కళా ప్రతిభతో సంగీతానికి అనుగుణంగా పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ గడిపారు. నగరంలోని పలు అండర్ గ్రాడ్యుయేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ వేడుకలలో పాల్గొని ఉత్సాహభరితమైన వాతావరణంలో ఎంజాయ్ చేశారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే యువతీ, యువకులు పురివిప్పిన నెమలిల వలే నృత్యాలు చేసి సహచరులను ఉర్రూతలూగించారు. కళాశాల కరస్పాం డెంట్ కె. మారెడ్డి, ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, ప్రిన్సిపాల్ అంబటి ప్రణీత జ్యోతి ప్రకాశనం చేసి కార్య క్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ఉత్సాహ భరిత ప్రసంగం చేసి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.



కార్మికశాఖ వెల్ఫేర్ బోర్డుకు కార్మికుడినే చైర్మెన్ చేయాలి



● కార్మిక శాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలి

● తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం

నవతెలంగాణ-ముషీరాబాద్

కార్మిక శాఖ వెల్ఫేర్ బోర్డుకి కార్మికుడినే చైర్మెన్ చేయాలని కార్మిక శాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చిక్కడపల్లిలోని టి.అంజయ్య భవన్ కార్మిక శాఖ కార్యాలయాన్ని భవన నిర్మాణ కార్మికులతో కలిసి ముట్టడించారు. అనంతరం కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ ఇ.గంగాధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంక్షేమ పథకాలు అమలులో అవినీతి జరగకుండా ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టపెడుతున్నామని తప్పుడు ప్రచారం చేసి కార్మిక సంక్షేమానికి తీరని లోటు జరుగుతుందని తెలిపారు. కార్మికులు శ్రమ ద్వారా వచ్చినటువంటి వేలకోట్ల రూపాయల సెస్సును గత ప్రభుత్వం కరోనా కష్టకాలంలో దుర్వినియోగం చేసిందని కార్మికుల ఆరోగ్య పరీక్షల పేరిట కార్మిక విధులను దోపిడీ చేసి తప్పుడు లెక్కలు రాసి సుమారు రూ.300 కోట్లు బోర్డులో నుండి దుర్వినియోగం చేశారని జరిగిన అక్రమాలపై వెంటనే విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు వెల్ఫేర్ బోర్డు ద్వారా మాత్రమే ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. కార్మిక శాఖ వెల్ఫేర్ బోర్డుకి కార్మికుడినే చైర్మెన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ ఇ.గంగాధర్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేందర్, గంగాధర్, దశరథం, పరశురాములు, కొమరయ్య, ఎల్లయ్య, స్వామి, మన్నే కృష్ణ, సుధాకర్, భూమా రమేష్, కొమ్ము గళ్ళ కృష్ణ, అల్వాల ఎల్లయ్య, మన్నె కిషన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

యూటీలైజేషన్ సర్టిఫికెట్‌లను ఫిబ్రవరి 10 లోగా సేకరించాలి

జిల్లా రెవిన్యూ అధికారి ఈ. వెంకట చారి

నవతెలంగాణ సిటీబ్యూరో

యూటీలైజేషన్ సర్టిఫికెట్‌లను ఫిబ్రవరి 10 లోగా సేకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి ప్రత్యేక అధికారులను ఆదేశించారు. బీసీల సంక్షేమలో భాగంగా అందించిన ఆర్థిక సహాయంనకు సంబంధించిన యూటీలైజేషన్ సర్టిఫికెట్లపై యుటిలైజేషన్ సర్టిఫికెట్ల కోసం నియమించబడిన ప్రత్యేక అధికారులతో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో జూన్ నుండి అక్టోబర్ 2023 వరకు కింద 5732 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగిందని దానికి సంబంధించిన యూటిలైజేషన్ సర్టిఫికెట్లు 2734 లబ్ధిదారుల నుండి మాత్రమే సేకరించిరించడం జరిగిందని మిగతా 2998 లబ్ధిదారుల నుండి పెండింగ్ యూటీస్లైజేషన్ ధ్రువీ కరణ పత్రాలను ఫిబ్రవరి 10లోగా సేకరించాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. యూటీలైజేషన్ సర్టిఫికెట్ల సేకరణకు 17 మంది ప్రత్యేక అధికారులను నియమించ డం జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక అధికారులు కార్యచరణ రూపొందించుకొని యూటిలైజేషన్ సర్టిఫికెట్ల ను సేకరించాలని ఆయన 17 మంది స్పెషల్ ఆఫీసర్స్, 16మంది జీహెచ్ఎంసీ డీపీఓలను ఆదేశించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, సీపీఓ డాక్టర్ సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్, ఎడి డిజేబుల్ వెల్ఫేర్ రాజేందర్, డీడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీరామ్, జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పవన్ కుమార్, వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక అధికారులు, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బందికి రక్షణ కల్పించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్రంలోని వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళలకు రక్షణ కరువైందని తక్షణమే మహిళలకు భద్రతతో పాటు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని పీహెచ్ఎం అండ్ ఈ హెల్త్ నర్సస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఫిమేల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు పాత మహాలమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం అసోసియేషన్ అన్ని జిల్లాల నాయకులతో కలిసి కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ , డీఎం ఈ కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీహెచ్ డాక్టర్. రవీందర్ నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె తెలంగాణ ప్రజా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం హెచ్ 1 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డితో కలిసి మాట్లాడుతూ.. పెట్లబూర్జ్ లోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షకీల్ హసన్ ఖాన్ రాసలీల బాగోతంపై ఓ నర్సు సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ తమను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే 23 మందితో కలిశానని, సిల్వర్ జూబ్లీ పూర్తి చేసుకోవాలనేది తన ఆశ అనేది సదరు నర్సుతో తెలపడంతో ఆ నర్సు తీవ్ర భయం ఆందోళన గురై కాపాడాలంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టును సుమోటోగా స్వీకరించి పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే చర్యలను తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అతి పెద్దదైన మెటర్నిటీ ఆస్పత్రిలో లైంగిక వాంఛ తీర్చాలంటూ అసిస్టెంట్ డైరెక్టర్ వార్నింగ్ ఇవ్వడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. కీచకుడైన షకీల్ హసన్ ఖాన్‌ను తక్షణ మే విధుల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ప్రమీల, జాయింట్ సెక్రెటరీ కురిషిద బేగం, మీడియా ప్రచార కార్యదర్శి ప్రభావతి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలి

● బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజ్యాంగ పరిరక్షణ ద్వారా తెలంగాణలో బహుజన రాజ్యాధికారమే సకల జనుల సమస్యలకు పరిష్కారం చూపుతుందని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బీఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని బీఎల్‌పీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి. కృష్ణ స్వామి 4వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ హాజరై మాట్లాడుతూ ఇండియా తరహా మార్క్సిజం- అంబేద్కరిజం ఆలోచన విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ పార్టీ బహుజన శ్రామిక వర్గ కులాల నాయకత్వంలో ఏర్పడిందని తెలిపారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో నూటికి తొంభై ఏడు శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికారంలోకి రాకుండా బీజేపీ మనుధర్మ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ చైర్మెన్ నల్లా సూర్యప్రకాష్, ఎంసీపీఐయు రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, బహుజన పొలిటికల్ సెంటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ సాదు మాల్యాద్రి, ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధి రాములు, మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శులు ఎంఎం గౌడ్, వడ్ల సాయి కృష్ణ, సహాయ కార్యదర్శి ఎస్. ఎల్లయ్య, రాష్ట్ర కోశాధికారి మారోజు సునీల్ కుమార్ వివిధ జిల్లాల నుండి హాజరైన కార్యకర్తలు పాల్గొన్నారు.

చార్మినార్ యునాని దవాఖాన నిర్మాణం చేపట్టాలి..

● హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

చార్మినార్ యునాని దవాఖాన నిర్మాణం తక్షణమే నిర్మాణం చేపట్టాలని అవాజ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. దవాఖానపై వస్తున్న సమస్యలతో అవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. అక్కడ రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది, సౌకర్యాలను పర్యవేక్షించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యునాని దవాఖాన నిర్మాణం రూ. 52 కోట్లు కేటాయించి ఆరు నెలలపై గడిచిన ఇప్పటికీ పనులు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చికిత్సలు నిమిత్తం వచ్చే బయటి(ఓపీ) రోగుల, లోపలి (ఐపీ) రోగుల కనీస సౌకర్యాలు లేవని వాపోతున్నారన్నారు. ఇన్‌పేషంట్లకు తగిన సౌకర్యాలు లేవని, మందులు బయట కొనుక్కోవాలిస్తుందని కొంతమంది రోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇలా దవాఖానకు వచ్చే ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగులకి మందులు సరిగా ఇవ్వడం లేదను రోగులు వాపోతున్నారన్నారు. దీనిపై వారు దవాఖాన సూపరింటెండెంట్‌ను కలిసి దవాఖాన లో మెరుపైన సౌకర్యాలు కల్పించాలన్నారు. దవాఖాన నిర్మాణం, రీకన్స్ట్రక్షన్ తక్షణమే చేపట్టాలని సూపరింటెండెంట్ వసంత రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గులాం నసీర్, షకీల్ వసీ, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ అలర్జీతో బాధపడుతున్నారా..?

ప్రస్తుతం డస్ట్ అలర్జీ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. చిన్న దుమ్ముకే తుమ్ములు రావడం, ముక్కు కారడం, కళ్లలో దురద, కళ్లు ఎర్రబడడం, గొంతులో నొప్పి వంటి సమస్యలకు దారి తీస్తుంది. శ్వాస సంబంధిత



సమస్యలు ఎక్కువతున్నాయి. వాయు కాలుష్యం కూడా డస్ట్ అలర్జీకి దారి తీస్తుంది.

ఒక్కసారి డస్ట్ ఎలర్జీ అటాక్ అయ్యిందంటే తగ్గడం సులువుకాదు. ఎన్నో రకాల మందులు వాడాల్సి ఉంటుంది. అయితే డస్ట్ అలర్జీని కొన్నిరకాల నేచురల్ టిప్స్ ద్వారా చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎన్ని మందులు వాడినా తగ్గని డస్ట్ అలర్జీని కొన్ని రకాల వంటింటి చిట్కాలతో చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు. ఇంతకీ ఆ నేచురల్ టిప్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

- డస్ట్ అలర్జీని చెక్ పెట్టడంలో రాక్‌సాల్ట్ బాగా ఉపయోగపడుతుంది. ఒక కప్పు వేడి నీటిలో రాక్ సాల్ట్‌ను కరిగించి ఆ నీటిని ఆవిరి పట్టాలి. ఇలా చేయడం వల్ల ముక్కు క్లీన్ అవుతుంది. గొంతు నొప్పి, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. దుమ్ము, బ్యాక్టీరియా నాశనం అవుతుంది.
- డస్ట్ అలర్జీ ఉన్న వారికి అల్లం, తేనె కూడా బాగా ఉపయోగపడుతుంది. ఈ రెండింటిలో ఉండే నేచురల్ యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు డస్ట్ అలర్జీని దూరం చేస్తుంది. ఒక చెంచా తేనెలో అల్లం రసం కలిపి ప్రతీరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే డస్ట్ అలర్జీ దూరమవుతుంది. శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- శీతాకాలంలో డస్ట్ అలర్జీ మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఇలాంటి సమయంలో పసుపు, తులసి ఆకులు క్రియాశీకలంగా ఉపయోగపడతాయి. తులసి ఆకులను ఉడకబెట్టి, అందులో పసుపు వేయాలి. అనంతరం నీరు సగం అయ్యే వరకు వేడి చెయ్యాలి. గోరు వెచ్చగా చేసుకొని ఈ నీటిని తాగాలి. ఇది శరీరంలోని విషాన్ని తొలగిస్తుంది.
- రాత్రి పడుకునే ముందే కొబ్బరి నూనె మసాజ్ చేసుకున్నా మంచి ఫలితం ఉంటుంది. ముక్కు, గొంతు దగ్గర కొబ్బరి నూనెను మసాజ్ చేయాలి. దీనితో శ్వాస తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ■

వాళ్ల తప్పేముంది..?

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

భార్యాభర్తలు ఒకరికి ఒకరు ఎంత సమయం కేటాయించుకుంటే అంత సంతోషంగా ఉండగలరు. తమలోని భావాలను భాగస్వామితో పంచుకునేందుకు సిగ్గుపడాల్సిన, భయపడాల్సిన అవసరం లేదు. భర్త ఎలాగైతే తన భార్యతో సంతోషంగా వుండాలని భావిస్తాడో అలాగే భార్య కూడా కోరుకుంటుంది, ఇది సహజం. దీనికి వయసుతో సంబంధం లేదు. దీన్ని పిల్లలు కూడా అర్థం చేసుకోవాలి. లేదంటే కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి ఓ కథనమే ఈ వారం ఐద్వా అదాలత్‌లో మీ కోసం...

సుమిత్రకి సుమారు 43 ఏండ్లు ఉంటాయి. ఆమెకు 18 ఏండ్ల వయసులో ఆర్మీలో పని చేసే భరత్‌తో పెండ్లి జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. భరత్ ఈ మధ్య కాలంలోనే ఉద్యోగ విరమణ చేసి వచ్చాడు. వచ్చిన తర్వాత ఆరు నెలల తేడాతో ఇద్దరు కొడుకులకు పెండ్లి చేశారు. ఇద్దరూ తమ జీవితాలను హాయిగా గడుపుతున్నారు. పెద్ద కొడుకు వంశీకి తల్లంటే చాలా ఇష్టం. ప్రతి రోజూ తల్లే వంట చేసి పెట్టాలి. బయటకు వెళ్లేటప్పుడు ఆమెకు చెప్పకుండా వెళ్లడు. ప్రతి చిన్న విషయం తల్లితో పంచుకోవడం అలవాటైపోయింది. ఆర్మీ నుండి వచ్చిన తర్వాత భరత్ వేరే ఉద్యోగం చేయాలనుకున్నాడు. దాని కోసం వెదుకులాట మొదలుపెట్టాడు.

అయితే వీళ్ల ఇంట్లో రెండు బెడ్ రూంలు మాత్రమే ఉంటాయి. పిల్లల పెండ్లి కాక ముందు తల్లిదండ్రులు ఒక రూమ్‌లో, పిల్లలు మరో రూమ్‌లో పడుకునే వారు. ప్రస్తుతం ఇద్దరికీ పెండ్లి జరిగింది కాబట్టి సుమిత్ర, భరత్ హాల్లో పడుకుంటున్నారు. అయితే ఒక రోజు తల్లిదండ్రులు ఇద్దరూ దగ్గరగా ఉండడం వంశీ చూశాడు. అది భరించలేకపోయాడు. 'ఈ వయసులో మీకు ఇది అవసరమా' అనే భావనతో తల్లితో మాట్లాడడం మానేశాడు.


ఆమె చేసిన వంట తినడు, ఆఫీసుకు వెళ్లేటప్పుడు కూడా చెప్పేవాడు కాదు. ప్రతి రోజూ సాయంత్రం రాత్రి అందరూ కలిసి భోజనం చేసే వారు. కానీ ఆ రోజు నుండి వంశీ అందరితో కలిసి తినకుండా తన రూంలోనే కూర్చొని తినడం మొదలుపెట్టాడు. తల్లిని పూర్తిగా దూరం పెట్టేశాడు. ఆమెను చూస్తేనే ఏదో ఒకటి అనేవాడు, అవమానించేవాడు. ఆమె కూడా ఓ పదిహేను రోజుల వరకు కొడుకు ముందుకు వెళ్లలేకపోయింది. ఇంట్లో ఇలాంటి పరిస్థితి చూసి కోడలు 'ఏం జరిగింది, ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు' అని వంశీని అడిగింది. దాంతో ఆమెపై కూడా కోప్పడడం మొదలుపెట్టాడు.

కొడుకులో వచ్చిన మార్పు చూసి సుమిత్రకు చాలా బాధ అనిపించింది. నిజంగా తను చేయకూడని తప్పు ఏదో చేసినట్టు భావించింది. అదే బెంగతో ఆరోగ్యం పాడు చేసుకొని ఆస్పత్రిలో చేరింది. అయినా వంశీ తల్లిని అస్సలు పట్టించుకోలేదు. వంశీ ఇలాగే ఉంటే భవిష్యత్ ఎలా ఉంటుందో అని ఆలోచించి సుమిత్ర తన కోడలిని తీసుకొని ఐద్వా అదాలత్‌కు వచ్చింది.

మేము వంశీకి ఫోన్ చేసి పిలిపించాము. మొదట అతను 'నేను రాను, మా ఇంట్లో ఎలాంటి సమస్యా లేదు. ఇక నేను ఎందుకు రావాలి' అన్నాడు. కానీ మేము 'మీరు ఇక్కడికి వస్తే కదా అసలు సమస్య వుందో లేదో, మీ వల్ల ఎంత మంది బాధపడుతున్నారో తెలిసేది' అన్నాము. చివరకు అతను రావడానికి ఒప్పుకున్నాడు. సుమిత్రతో పాటు, అతని భార్య చెప్పిన విషయాల గురించి అడిగితే 'అవును మేడం కొడుకులకు పెండ్లి చేసిన తర్వాత కూడా ఈ వయసులో వాళ్లిద్దరూ అంత క్లోజ్‌గా ఉండడం ఏమిటి? ఇప్పుడే కొత్తగా పెండ్లయిన వాళ్లలా ప్రవర్తిస్తుంటే దాన్ని నేను ఎలా అర్థం చేసుకోవాలి. అది వయసులో ఉన్న వారు చేసే పని. ఇప్పుడు నాకూ ఓ పాప ఉంది. అంటే మా అమ్మకు మనవరాలు ఉంది. అమ్మమ్మ అయిన తర్వాత కూడా ఇలా ప్రవర్తించడం ఏంటీ. అయినా నేను మా అమ్మను ఏమీ అనలేదు. నాకు నచ్చలేదు కాబట్టి తనతో మాట్లాడడం మానేశాను. ఇందులో నేను చేసిన తప్పేంటో నాకు అర్థం కావడం లేదు. దీని కోసం అత్తాకోడళ్లు ఇద్దరూ ఇక్కడి వరకు వచ్చారు' అన్నాడు.

'మీ వయసు సుమారు 24 వుంటుంది. మీ పాప వయసు ఆరు నెలలు. మీ అమ్మ వయసు ఎంత ఉంటుంది, మహా అయితే 43 ఏండ్లు అంతేగా. అయినా వయసు ఎంతైతే ఏంటి. ఆమె తన భర్తతో దగ్గరగా ఉంటే ఏదో తప్పు చేసినట్టు మాట్లాడుతున్నారు. ఈ వయసు వారే క్లోజ్‌గా ఉండాలి, ఈ వయసు వారు దూరంగా ఉండాలి అని రూల్స్ ఏమీ లేవు కదా! అసలు వాళ్లు చేసింది తప్పు అనే భావన మీకు ఎందుకు వచ్చింది. ప్రేమకు వయసుతో సంబంధం లేదు. అది వారిద్దరి మధ్య ఉన్న బంధాన్ని బట్టి ఉంటుంది. ఇందులో తప్పేంటి. మీరు మీ అమ్మను అసహ్యించుకోవడం, ఆమేదో తప్పు చేసినట్టు అవమానించడం సరైనదేనా ఒక్కసారి ఆలోచించండి. మీకు రూం ఇచ్చి వాళ్లు బయట పడుకుంటున్నారు. ఇదేనా వాళ్లు చేసిన తప్పు. మీ నాన్న ఆర్మీలో ఉద్యోగం చేయడం వల్ల వాళ్లిద్దరూ చాలా ఏండ్లు దూరంగా గడిపారు. మీ నాన్న కూడా మీతోగానీ, మీ అమ్మతో గానీ గడిపిన సమయం చాలా తక్కువ. ఇప్పుడే అందరూ ఓ దగ్గర ఉంటున్నారు. బాధ్యతతో మీ ఇద్దరికీ పెండ్లి చేశారు. మీరు సంతోషంగా ఉంటున్నారు. మరి మీ అమ్మానాన్న సంతోషంగా ఉండకూడదంటున్నారు. ఇది సరైన పద్ధతేనే మీరే ఆలోచించండి. అసలు నిజానికి మీరే అర్థం చేసుకొని మీ అమ్మానాన్న కోసం ప్రత్యేకంగా ఒక గది ఉండేలా చూడాలి. అప్పుడు ఇలాంటి సమస్యే వచ్చేది కాదు.

మొన్నటి వరకు మీ అమ్మతో మీరు ఎంతో ప్రేమగా ఉండేవారు. ప్రతి విషయం ఆమెతో పంచుకునేవారు. ఒక్కసారిగా ఇప్పుడు అమ్మ మీకు తప్పు చేసిన వ్యక్తిగా మారిపోయింది. చివరకు ఆమె మీపై దిగులుతో ఆస్పత్రిలో చేరినా పట్టించుకోలేదు. ఇన్ని రోజులు మీ నాన్న లేకపోయినా మీ అవసరాలన్నీ చూసుకుంది. మీరే జీవితంగా బతికింది. ఆమెకూ కొన్ని కోరికలు ఉంటాయి. తన భర్తతో సంతోషంగా ఉండాలని ఉంటుంది. దీన్ని మీరెందుకు అర్థం చేసుకోలేకపోతున్నారు. మీ ప్రవర్తన వల్ల ఇంట్లో ఎవ్వరికీ ప్రశాంతత లేకుండా పోయింది. ఒక్క సారి మనసుతో ఆలోచించండి' అని అతనికి అర్థమయ్యేలా చెప్పాము.



దాంతో వంశీ 'నిజమే మేడం, మీలా నేను ఆలోచించలేకపోయాను. అమ్మను అనవసరంగా అపార్థం చేసుకున్నాను. ఈ వయసులో ఇలాంటి ఆలోచనలు ఏంటీ అనుకున్నాను. నేను చేసింది తప్పే. అమ్మా నన్ను క్షమిం చమ్మా.. నిన్ను ఇన్ని రోజులు బాధపెట్టాను. ఇకపై ఎప్పుడూ ఇలా తప్పుగా ఆలోచించను' అని చెప్పి తల్లిని తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత కొడుకులిద్దరూ హాల్లోనే తన తల్లిదండ్రుల కోసం ఒక చిన్న గది ఏర్పాటు చేశారు.

'నిజమే మేడం, మీలా నేను ఆలోచించలేకపోయాను. అమ్మను అనవసరంగా అపార్థం చేసుకున్నాను. ఈ వయసులో ఇలాంటి ఆలోచనలు ఏంటీ అనుకున్నాను. నేను చేసింది తప్పే, అమ్మా నన్ను క్షమిం చమ్మా.. నిన్ను ఇన్ని రోజులు బాధపెట్టాను. ఇకపై ఎప్పుడూ ఇలా తప్పుగా ఆలోచించను' అని చెప్పి తల్లిని తీసుకొని ఇంటికి వెళ్లిపోయాడు.

- వై వరలక్ష్మి
9948794051

కేసీఆర్ చెల్లని వెయ్యి రూపాయల నోటు

(మొదటిపేజీ తరువాయి)

కొట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొని లెక్కలు అని చెబుతా విను' అంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. విద్యపై పెట్టేది ఖర్చు కాదని.. భవిష్యత్ తరాలకు పెట్టుబడి అని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సీఎంతోపాటు ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరయ్యారు. హైదరాబాద్ సంస్థానం నుంచి ఏర్పడిన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి, హరగోపాల్ లాంటి మేధావులను అందించిన మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో సంభాషించారు. అనంతరం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రజలకిచ్చిన హామీలపై వెనక్కి తగ్గేదే లేదని స్పష్టంచేశారు. రూ.7625 కోట్లను 72లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. కేసీఆర్ 2014లో రూ.లక్ష రుణమాఫీ చేస్తానని చెప్పి నాలుగు విడతలుగా మాఫీ చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల రుణమాఫీ కొంద 25.50 లక్షల మందికి రూ.21వేల కోట్లు జమ చేశామని తెలిపారు. కేసీఆర్ మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని కాస్తా రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళాకోరుగా తయారు చేశారన్నారు. దాంతో రైతులకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాల్సి వస్తుందన్నారు. రైతు కూలీలకు సైతం ఆర్థిక భరోసా కింద ప్రతి కుటుంబానికీ రూ.12వేలు ఇస్తున్నామన్నారు. దేశ చరిత్రలో కుల గణన చేపట్టిన చరిత్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. బీసీ లెక్కలను తేల్చడంలో ప్రభుత్వం విజయం సాధించిందని అన్నారు. మాదిగల వర్గీకరణ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని, వర్గీకరణ చేసి తీరుతామని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే ఉందన్నారు. మొగిలిగిద్ద అభివృద్ధికి రూ.16 కోట్ల నిధులు కేటాయించినట్టు వెల్లడించారు. నోటిఫికేషన్లు వచ్చిన 55 రోజుల్లోనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని చెప్పారు.

పదేండ్లలో యూనివర్సిటీల్లో వీసీల నియామకం, ఉపాధ్యాయుల నియామకం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నియామకాలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచామని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు వెనుకబడుతున్నారనే ఉద్దేశంతో వివిధ దేశాలకు సంబంధించిన అన్ని హంగులతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ రోజు విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ని కూడా మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యపై, సాంకేతిక నైపుణ్యం, క్రీడాలపై దృష్టి పెట్టి విద్యార్థులను చైతన్యం చేద్దామన్నారు. గొప్ప మహానుభావులు చదివిన ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, పనిచేస్తున్న ఉపాధ్యాయులు చాలా అదృష్టవంతులని కొనియాడారు.

సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి

(మొదటిపేజీ తరువాయి)

పాటు జరిగిన సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర 24వ మహాసభ శుక్రవారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్‌కరత్, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర సింగ్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 45మంది ప్రతినిధులు చర్చించారు. అనంతరం మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం నూతన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా జితేంద్ర చౌదరి ఎన్నికయ్యారు. 60 మందితో రాష్ట్ర నూతన కమిటీ, 14 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఏర్పాటైంది. బీజేపీని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే, హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా పోరాటంతో సహా ప్రజా, వర్గ పోరాటాలను బలోపేతం చేయాలని ప్రకాశ్‌కరత్ పిలుపునిచ్చారు.

ఏదీ భరోసా..?

(మొదటిపేజీ తరువాయి)

వెంచర్లుగా కన్వర్షన్ అయిన భూములను తేల్చే క్రమంలో ఆ సర్వే నంబర్లలో సాగు భూములన్నింటినీ నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ (నాలా)గా యాప్ సూచించటం తో రైతుల్లో ఆందోళన నెలకొంది. సబ్ సర్వే నంబర్లు ఉన్నా యాప్ వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. యాప్ చేసిన తప్పిదాలపై రైతులు గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్నారు. సిటీ శివారు ప్రాంతాల్లో సాగేతర భూములకు రైతు భరోసా ఇస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి. ఒక్కొక్కరికి ఒక్కో రకంగా అధికారులు చూస్తున్నారని తెలిసింది.

నాలా భూములున్న చోట ఇబ్బందులు

ఓ రెవెన్యూలో ఓ సర్వే నంబర్‌లో శాటిలైట్ ప్రకారం చూస్తే ఓ భూమి లే అవుట్ కింద చూపుతోంది. దాంతో ఆ సర్వేనంబర్‌లోని భూములన్నింటినీ అనాథరైజ్డ్ లేఅవుట్స్ అని బ్లాక్ లిస్టులో పెట్టారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ భూమి యజమాని పక్కనున్న సర్వేనంబర్లలో ఉంటున్నాడు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలి. రైతులతో మాట్లాడాలి. కానీ అవేవీ జరగటం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. గ్రామసభల్లో దరఖాస్తు చేసినా ఈసారికి వాటిని పరిగణనలోకి తీసుకునే పరిస్థితులులేనట్లు తెలుస్తుండటంతో సంబంధిత రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖమ్మం రూరల్ మండలంలో ఒక్కో రెవెన్యూ గ్రామంలో ఈ రకంగా వందలాది మంది నష్టపోయారు. గ్రామసభకు వచ్చిన వారికే తమ భూమి సాగేతర భూమిగా నమోదైనట్టు తెలుస్తోంది. లేదంటే తెలిసే అవకాశం లేకుండా పోయింది. జాబితాలో లేకుంటే దరఖాస్తు చేసుకోమంటున్నారు.. ఈలోగానే రైతుభరోసా జమ అవుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సాగు భూమిని కమర్షియల్‌గా వినియోగిస్తే 'భరోసా' కట్..

ఓ రైతు తనకున్న మూడెకరాల్లో ఓ ఐదు కుంటల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకుని మిగిలిన దాన్ని సేద్యం చేస్తుంటే ఆ మూడెకరాలనూ సాగు భూమిగానే చూపుతారు. ఒకవేళ దాన్ని కమర్షియల్‌గా వినియోగిస్తే మాత్రం సాగు భూముల జాబితాలో రాదు. పెట్రోల్ బంకులు, రియల్‌ఎస్టేట్ అవసరాలు, లేఅవుట్ల వంటి కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తే ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా పరిగణిస్తారు. నాలా రిజిస్ట్రేషన్లు అయిన భూములన్నింటినీ భరోసా నుంచి మినహాయిస్తారు. గతంలో యాప్ ఆధారంగా నాలా భూముల గుర్తింపు ప్రక్రియను చేపట్టడంతో పలు తప్పిదాలు చోటుచేసుకున్నాయి. వాటిని రెవెన్యూ అధికారుల సహాయంతో వ్యవసాయ అధికారులు సరిచేస్తున్నారు.

పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్

రైతుబంధు జమ చేసినట్టుగానే రైతుభరోసా నిధులను కూడా బ్యాంకుల్లో జమ చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. బీఆర్ఎస్ హయాంలో పథకాన్ని ప్రారంభించిన తొలినాళ్లలో రైతులందరికీ దాదాపు ఒకటి, రెండు రోజుల్లో ఖాతాల్లో డబ్బులు పడేవి. ఆ తర్వాత ఎకరం, రెండెకరాలు, మూడెకరాలు, ఐదెకరాలు, పదెకరాలు, ఆపై ఎకరాలున్న పెద్ద రైతులందరికీ విస్తీర్ణం ఆధారంగా విడతల వారీగా డబ్బులు జమ చేసేవారు. కానీ రైతుభరోసాలో మాత్రం మండలానికో గ్రామం, మున్సిపాల్టీకో వార్డు చొప్పున ఎంపిక చేసి.. ఆ గ్రామంలోని రైతులందరికీ ఎకరాలతో నిమిత్తం లేకుండా ఒకేసారి నిధులు జమ చేశారు. దాంతో ఆ గ్రామాల్లో రైతుల వరకు సంతోషంతో ఉన్నా మిగిలిన గ్రామాల రైతులు మాత్రం ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేను కొడితే మామూలుగా ఉండదు

(మొదటిపేజీ తరువాయి)

రావాలి. తెలంగాణ శక్తి చూపిద్దాం.." అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడం లేదని, కైలాసం ఆడుతుంటే పెద్దపాము మింగినట్టుగా రాష్ట్ర ప్రజల పరిస్థితి తయారైందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా మేరపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఝరాసంగం నుంచి నిర్వహించిన పాదయాత్ర శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ క్రమంలో ఝరాసంగంలోని సంగమేశ్వర ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి మాజీ సీఎంకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కేసీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.ప్రాజెక్టుల్లో ఎలాంటి పురోగతి లేదని ఆరోపించారు. బసవేశ్వర, సంగమేశ్వర, పాలమూరు ప్రాజెక్టులను పడుకోబెట్టారని, కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని అన్నారు. మళ్లీ కరెంట్ కోతలు, నీళ్ల కరువు కనిపిస్తోందని తెలిపారు. ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. నమ్మి ఓట్లు వేస్తే మంచి గుణపాఠం చెప్పారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన పథకాల సంగతి పక్కన బెడితే.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను కూడా గంగలో కలిపారని విమర్శించారు. కరోనా సమయంలో కూడా తాము రైతుబంధు, దళితబంధు, పింఛన్లు ఇలా ఏవీ ఆపలేదని గుర్తుచేశారు.

రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు

కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని కేసీఆర్ ఆరోపించారు. గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని..అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. రైతుబంధుకు రాం రాం..దళితబంధుకు జై భీం' చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని అన్నారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. భూముల ధరలు అమాంతం పడిపోతున్నాయన్నారు. కొత్త ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వాలనే ఇన్ని రోజులు మౌనంగా ఉన్నామన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనని, మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. త్వరలోనే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రత్యక్ష పోరాటాల్లోకి దిగుతామని, దీనికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. అలాగే, బసవేశ్వర ఎత్తిపోతల పథకం గురించి హరీశ్‌రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు మాణిక్ రావు, చింత ప్రభాకర్, జీవన్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, బీఆర్ఎస్ ఝరాసంగం మండలాధ్యక్షులు ఎం.వెంకటేష్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

న్యూఢిల్లీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగవంతమైన ఆర్థికవృద్ధి కోసం చర్యలు చేపట్టాలని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అనంత నాగేశ్వరన్ అన్నారు. చిన్న, మధ్య తరగతి సంస్థలను వ్యయ నియంత్రణలతో పోటీ పడేలా చేయాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై నియంత్రణలను తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక సర్వే-2025 విడుదల అనంతరం నాగేశ్వరన్ మీడియాతో మాట్లాడారు. వ్యాపార రంగంలోని సంస్థలపై రాష్ట్రాలు అధిక కరెంటు చార్జీలను మోపుతున్నాయన్నారు. ఈ క్రమంలో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలతో మనం పోటీ పడే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణలు చాలా కీలకమన్నారు. మార్పులో గ్లోబలైజేషన్ కీలక శక్తిగా మారుతోందన్నారు. ప్రపంచంలో చైనా అత్యంత వేగంగా ఎదుగుతోందని ఆయన తెలిపారు. కేవలం పదేండ్ల కాలంలోనే ప్రపంచంలోనే 70శాతం సౌరశక్తి ఆధారిత విద్యుత్తు తయారీ కేంద్రంగా మారిందన్నారు. "వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి ఉంది. భవిష్యత్తు రంగం ఇదే. రైతులు పూర్తి స్థాయిలో ఉత్పత్తులు సాధించేలా బలోపేతం చేయాలి. ఈ రంగంలో బలమైన వృద్ధి సాధించగలిగితే.. జీడీపీ వద్ధిరేటులో 0.75శాతం నుంచి 1శాతం వరకు ఉంటుంది. దేశంలో గత పదేండ్లకుపైగా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారించడం సానుకూల ఫలితాలను ఇచ్చింది. తప్పుడు వాణిజ్య ప్రకటనలు, సెలెబ్రిటీల ఎండార్స్‌మెంట్లు, అస్పష్టమైన లేబులింగ్‌లు ఆందోళనకరం. ముఖ్యంగా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌ను ఈ విధానాల్లో అమ్మడం వినియోగ దారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ముప్పు ఉంది. క్యాన్సర్లు, శ్వాస సంబంధ సమస్యలు, గుండె జబ్బులు, జీర్ణకోశ సమస్యల ముప్పు పొంచి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం (హెచ్1)లో 6 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ద్వితీయార్థంలో మరింత బలహీనపడిందని అంచనా వేస్తున్నాము." అని నాగేశ్వరన్ పేర్కొన్నారు.

సవాళ్లకు నీళ్లొదిలిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాల్సిన చర్యల్ని విస్మరించింది. అమెరికా, చైనా లాంటి దేశాలు కృత్రిమ మేధా (ఏఐ)లో పోటీ పడుతూ.. ఈ రంగంలో దూసుకుపోతుండగా.. టెక్నాలజీలో అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్న భారత్ వెనుకబాటుపై వివరణ ఇవ్వలేదు. దేశం మెరుగైన వృద్ధి రేటును సాధించకుండా నిరుద్యోగం తగ్గిందని ఎకనామిక్ సర్వేలో ప్రకటన చేయడం నిపుణులను విస్మయానికి గురి చేస్తోంది.

రోజుకు 10 గంటల పని..!

ఎకనామిక సర్వేలో కార్మిక వ్యతిరేక విధానాలు కొట్టిచ్చినట్లు కనబడ్డాయి. ఇటీవల పని గంటలపై తీవ్ర చర్చ జరుగుతోంది. టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి వారానికి 70 గంటలు పని చేయాలని తొలుత కొత్త పాట అందుకోగా.. దీనికి కొనసాగింపుగా అంతకు మించి ఎల్అండ్‌టీ చైర్మెన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ ఏకంగా 90 గంటల పని చేయాలని.. అంటే రోజుకు 12 గంటలు శ్రమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నయా బానిస విధానంపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ కేంద్రం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఓ కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. వారానికి 60 గంటల వరకూ పని విధానం పర్వాలేదంటూ కొత్త పాట అందుకుంది. అంటే వారంలో ఒక్క రోజు సెలవు పోయినా.. మిగితా దినాల్లో రోజుకు సగటున 10 గంటల పని చేయాలని ప్రతిపాదించి నట్లయ్యింది. కార్మిక చట్టాల హక్కుల ప్రకారం..వారానికి 48 గంటలు పని మించ కూడదు. కాగా.. వారానికి 60 గంటలకు మించి పని చేస్తేనే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఎకనామిక్ సర్వే పేర్కొంది. రోజుకు 12 గంటలు పని చేయడం ద్వారా అనారోగ్యం పాలవుతారని తెలిపింది. వారానికి ఎక్కువ గంటలు పని చేయడం ఆరోగ్యానికి హానికరం అంటూనే 60 గంటల పని విధానాన్ని ప్రతిపాదించడం వెనుక కార్పొరేట్ శక్తులున్నాయని అర్థం అవుతోంది. మరోవైపు పని గంటలపై పరిమితులు విధించడం ఆర్థిక వృద్ధికి విఘాతం కలుగుతుందని పారిశ్రామిక వర్గాల మనసులో మాటను ఎకనామిక్ సర్వేలో చెప్పింది. ప్రస్తుత పనిగంటలు కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బ తీసే అవకాశం లేకపోలేదని పరోక్షంగా పేర్కొంది. సౌకర్యవంతమైన పని గంటల విధానం భారత్‌ను ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా చేర్చుతుందని.. నూతన ప్రతిపాదిత విధానంతో పరిశ్రమల వృద్ధికి దోహదం జరుగుతుందని తెలిపింది.

గడ్డు కాలమే..

(మొదటిపేజీ తరువాయి)

స్థూల నిరర్థక ఆస్తులు 2.6 శాతానికి తగ్గాయి. 2023-24లో బీమా ప్రీమియంలు 7.7 శాతం పెరిగి రూ.11.2 లక్షల కోట్లకు చేరుకున్నాయి. వాహన, గృహ, వ్యక్తిగత రుణాల విభాగంలో మందగమనం చోటు చేసుకుంది. భౌగోళిక, రాజకీయ అస్థిరతల వల్ల డాలర్ బలపడడంతో రూపాయి మారక విలువ పడిపోయింది. 2025లో స్టాక్ మార్కెట్‌లు కొంత పడిపోయే అవకాశం ఉంది. గ్లోబల్ ఐపీవో లిస్టింగ్స్‌లో భారత్ వాటా 2023లో 17 శాతం నుంచి 2024 నాటికి 30 శాతానికి చేరింది. 2024 నవంబర్ వరకు మొత్తం మూలధన వ్యయంలో రక్షణ, రైల్వేలు, రోడ్డు రవాణా వాటా 75 శాతంగా ఉంది." అని ఎకనామిక్ సర్వే తెలిపింది.

వారాసిగూడలో దారుణం..

(మొదటిపేజీ తరువాయి)

ఐదేండ్ల కిందట లలిత భర్త వారిని వదిలి వెళ్లిపోయాడు. లలిత, తన ఇద్దరు కుమార్తెలు ప్రయివేటు ఉద్యోగాలు చేయగా వచ్చిన ఆదాయంతో జీవిస్తున్నారు. లలిత ఆరోగ్యంగానే ఉన్నా కొద్దిగా మానసిక పరిస్థితి సరిలేదు. మాట విధానం కూడా అలానే ఉంటుందని ఇంటి యజమాని తెలిపారు. అయితే, ఆమె ఈ నెల 23న అకస్మాత్తుగా మృతిచెందింది. దాంతో ఒంటరైన ఇద్దరు కుమార్తెలు మానసికంగా కుంగిపోయి.. ఏం చేయాలో తెలియక మృతదేహంతో అలాగే ఇంట్లోనే ఉన్నారు. ఒక గదిలో తల్లి మృతదేహం ఉండగా, మరో గదిలో వారిద్దరు ఉన్నారు. ఈ క్రమంలో పూర్తిగా మానసిక స్థైర్యాన్ని కోల్పోయిన వారు ఆత్మహత్యకు యత్నించారు. చేతులపై కత్తితో కోసుకున్నట్టు గుర్తులున్నాయి. అయితే, శుక్రవారం వారిద్దరూ వారాసిగూడ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విషయాన్ని చెప్పారు. ఘటనాస్థలికి చేరుకున్న ఈస్ట్ జోన్ ఏసీపీ జయపాల్ రెడ్డి, పోలీసులు.. క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు. మూడు నాలుగు రోజుల కిందటే లలిత గుండెపోటుతో మృతిచెందినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ తెలిపారు. మృతదేహాన్నిగాంధీ మార్చురీకి తరలించారు.

అదే ప్రసంగం...

మార్పేమీ లేదు
ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ప్రస్తావన
జమిలీ, వక్ఫ్ బిల్లును సాహసోపేత నిర్ణయాలుగా పేర్కొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
నేడు కేంద్ర బడ్జెట్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంలో కొత్తదనం కనిపించ లేదు. అదే ప్రసంగం.. అవే వ్యాఖ్యలు దీన్ని స్పష్టం చేశాయి. ప్రసంగం ఆసాంతం ప్రభుత్వంపై పొగడ్తలతో ముంచెత్తారు. మరోపక్క రాష్ట్ర ప్రసంగం పేలవంగా ఉందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఏదీ ఏమైనా రాష్ట్రపతి తన ప్రసంగంలో దేశంలో నెలకొన్న కీలక అంశాలను విస్మరించారు.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. జమిలీ ఎన్నికలు (ఒకే దేశం.. ఒకే ఎన్నిక), వక్ఫ్ సవరణ బిల్లును సాహసోపేత నిర్ణయాలుగా పేర్కొన్నారు. ప్రపంచంలోనే భారత్‌ను మూడో ఆర్థిక శక్తిగా నిలపనున్నట్టు తెలిపారు. దేశాభివద్ధి ఫలాలు అందరికీ అందించడమే లక్ష్యమని అన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు



"బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మా ప్రభుత్వం మూడో టర్మ్‌లో మూడు రెట్ల వేగంతో అభివద్ధిలో దూసుకెళ్తోంది. దేశాభివద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. అందుకే వేగంగా నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నాం. 3 కోట్ల మంది పేద కుటుంబాలకు ఇండ్లు నిర్మిస్తున్నాం. పేద, మధ్యతరగతి ప్రజలకు హౌమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులు అభివద్ధి చేస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. వన్ నేషన్ - వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం" అని ముర్ము అన్నారు. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని తెలిపారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నామని, 70 ఏండ్లు దాటిన 6 కోట్ల మందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని అన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని, భారతీయులు అంతరిక్షంలో అడుగుపెట్టే రోజు దగ్గర్లోనే ఉందని తెలిపారు. విద్యా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, దేశాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్ హౌస్‌గా మారుస్తామని పేర్కొన్నారు. ఇండియా ఏఐ మిషన్‌ను ప్రారంభించామని, నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రారంభించామని చెప్పారు. స్పోర్ట్స్ నుంచి స్పేస్ వరకూ భారత్ దూసుకుపోతోందని, ఎంఎస్ఎంఈల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ తీసుకొచ్చామని, ఈ-గవర్నెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

పోలవరంపై ప్రస్తావన

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రసంగంలో పోలవరంపై ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందుకు నిర్మాణానికి రూ.12 వేల కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు పార్లమెంట్ ఉభయ సభలు నివాళులు అర్పించాయి. ప్రధానిగా ఆయన చేసిన సేవలను పార్లమెంట్ సాక్షిగా కొనియాడారు. మరోవైపు మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనలో మృతులకు సైతం ఉభయ సభల సభ్యులు నివాళులు అర్పించారు.

సోనియా వ్యాఖ్యలను తప్పుపట్టిన రాష్ట్రపతి భవన్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు సమావేశాలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. సోనియాగాంధీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ ఇప్పటికే డిమాండ్ చేయగా, ఆ తరువాత కొద్ది సేపటికే రాష్ట్రపతి భవన్ కార్యాలయం సైతం ఒక ప్రకటన విడుదల చేసింది. సోనియా గాంధీ వ్యాఖ్యలను తప్పుపట్టింది. అత్యున్నత పదవిలో ఉన్న వారి హోదాను కించపరచేలా ఉన్నాయని పేర్కొంది. 'ప్రసంగం చివరికి వచ్చేసరికి రాష్ట్రపతి అలసిపోయారని, మాట్లాడలేకపోయారని కొందరు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. చాలా స్పష్టంగా దేశ అత్యున్నత కార్యాలయం హోదాను తగ్గించేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయి. వారి మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు. నిజానికి అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల గురించి మాట్లాడేటప్పుడు ఎలాంటి అలసట దగ్గరకు రాదని రాష్ట్రపతి బలంగా నమ్ముతారు" అని రాష్ట్రపతి భవన్ పేర్కొంది.

పేలవంగా రాష్ట్రపతి ప్రసంగం

రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉందని చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. ఆమె ప్రసంగంపై స్పందించాలని సోనియా గాంధీని మీడియా ప్రతినిధులు అడిగారు. 'రాష్ట్రపతి చివరి వరకు చాలా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు. పేలవంగా ఉంది' అని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై స్పందించారు. తన తల్లి వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. "బోరింగ్? నో కామెంట్స్? అదే విషయాన్ని మళ్లీ మళ్లీ చెబుతున్నారా?' అంటూ సోనియా గాంధీ మాటల భావాన్ని ప్రస్తావించారు.

విరాట్ ఫ్లాప్ షో

న్యూఢిల్లీ : రంజీ ట్రోఫీ బరిలో నిలిచి స్టేడియంను నిండుకుండలా చేసిన విరాట్ కోహ్లి.. బ్యాట్‌తో కాసిన్ని పరుగులు చేయటంలో విఫలం అయ్యాడు. రైల్వేస్ బౌలర్, ఫుల్‌టైమ్ టికెట్ కలెక్టర్ సంగ్వాన్ ఓవర్లో కోహ్లి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 15 బంతులు ఆడిన కోహ్లి ఓ బౌండరీ బాదినా.. క్రీజులో సౌకర్యవంతంగా కనిపించలేదు. ఆయుశ్ బదాని (99), సుమిత్ (78 నాటౌట్) అర్థ సెంచరీలతో ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో 96 ఓవర్లలో 334/7 పరుగులు చేసింది. తొలుత రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 241 పరుగులకు కుప్పకూలగా.. ఢిల్లీ ఇప్పటికే 93 పరుగుల ముందంజలో కొనసాగుతుంది.

సిరీస్ సొంతమాయె

- 15 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం
- హార్దిక్ పాండ్య, శివం దూబె అర్థ సెంచరీలు
- రవి బిష్ణోయ్, హర్షిత్ రానా మెరుపుల్



నవతెలంగాణ-పుణె

టీ20 సిరీస్ టీమ్ ఇండియా సొంతమైంది. పుణెలో ఇంగ్లాండ్‌పై 15 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ 3-1తో సిరీస్ విజయం అందుకుంది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో నామమాత్రపు ఆఖరు మ్యాచ్ ఆదివారం వాంఖడెలో జరగనుంది. 182 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 166 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్ (51, 26 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీతో చెలరేగినా..స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/28), పేసర్ హర్షిత్ రానా (3/33) మూడేసి వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (23), బెన్ డకెట్ (39)లు తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించి శుభారంభం అందించినా.. ఆ తర్వాత 5 పరుగులకే 3 వికెట్లు చేజార్చుకుంది. హ్యారీ బ్రూక్ అర్థ సెంచరీతో ఇన్నింగ్స్‌ను ట్రాక్‌లో పెట్టినా.. అప్పుడూ 8 పరుగులకే మరో మూడు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్లు, పేసర్లు కలిసికట్టుగా వికెట్లు పడగొట్టడంతో 19.4 ఓవర్లలో 166 పరుగులకే ఇంగ్లాండ్ కథ ముగిసింది. జోశ్ బట్లర్ (2), లివింగ్‌స్టోన్ (9), బెతెల్ (6), బ్రైడన్ (0)లు తేలిపోయారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 181 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య (53, 30 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు), శివం దూబె (53, 34 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) హాఫ్ సెంచరీలు సాధించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో సకిబ్ మహమూద్ (3/35), జేమీ ఓవర్టన్ (2/32) రాణించారు.

టాప్‌లో అతనొక్కడే

టాస్ నెగ్గిన ఇంగ్లాండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఓపెనర్ సంజు శాంసన్ (1), తిలక్ వర్మ (0), సూర్యకుమార్ యాదవ్ (0)లు పేసర్ సకిబ్ మహమూద్‌కు దాసోహం అయ్యారు. ఒక్క ఓవర్లో మూడు వికెట్లు పడగొట్టిన మహమూద్.. భారత టాప్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (29) ఓ ఎండ్‌లో దూకుడుగా ఆడగా.. రింకు సింగ్ (30) బాధ్యతగా స్ట్రయిక్‌రొటేషన్ చేశాడు. 10.4 ఓవర్లలో 79/5తో భారత బ్యాటర్లు అందరూ డగౌట్‌కు చేరుకున్నారు. ఇంగ్లాండ్ బౌలర్లు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు.

పాండ్య, దూబె ధనాధన్

కష్టసమయంలో క్రీజులో జతకలిసిన ఆల్‌రౌండర్లు శివం దూబె (53), హార్దిక్ పాండ్య (53) భారత్‌కు మంచి స్కోరు అందించారు. ఆరంభంలో నెమ్మదిగా ఆడినా.. తర్వాత గేర్ మార్చారు. నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 27 బంతుల్లోనే హార్దిక్ పాండ్య అర్థ సెంచరీ సాధించాడు. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో శివం దూబె 31 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. హార్దిక్ పాండ్య, శివం దూబె ఆరో వికెట్‌కు 45 బంతుల్లోనే 87 పరుగులు జోడించారు. ఈ ఇద్దరి భాగస్వామ్యంతో భారత్ 181 పరుగులు చేసింది.

ఫైనల్లో అమ్మాయిలు

- సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై గెలుపు
- ఐసీసీ మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్



కౌలాలంపూర్ : టీమ్ ఇండియా అమ్మాయిలకు ఎదురు లేదు. వరుసగా ఏకపక్ష విజయాలతో దూసుకెళ్తోన్న భారత మహిళల అండర్-19 జట్టు.. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఇంగ్లాండ్ అమ్మాయిలపై మనోళ్లు 9 వికెట్ల తేడాతో అలవోక విజయం సాధించారు. ఆదివారం జరిగే టైటిల్ పోరులో దక్షిణాఫ్రికా అమ్మాయిలతో తాడోపేడో తేల్చుకోనున్నారు. సెమీస్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 20 ఓవర్లలో 113/8 పరుగులు చేసింది. బౌలర్లు వైష్ణవి శర్మ (3/23), పారునిక శిసోడియ (3/21), ఆయుశి శుక్లా (2/21) రాణించారు. ఇంగ్లాండ్ బ్యాటర్లలో ఓపెనర్ డావిన పెరిన్ (45, 40 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు), ఏబి (30, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) మెరవటంతో ఆ జట్టు గౌరవప్రద స్కోరు సాధించింది. ఛేదనలో తెలుగమ్మాయి గొంగడి త్రిష (35, 29 బంతుల్లో 5 ఫోర్లు) సహా కమలిని (56 నాటౌట్, 50 బంతుల్లో 8 ఫోర్లు), సానిక (11 నాటౌట్) అదరగొట్టారు. 15 ఓవర్లలో 117/1తో మరో 30 బంతులు ఉండగానే లాంఛనం ముగించారు. మూడు వికెట్లతో మెరిసిన సిసోడియ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.



నాగ్‌పూర్‌లో హైదరాబాద్ జట్టుతో సమావేశమైన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్..రంజీ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న తన్మయ్ అగర్వాల్‌కు రూ.1 లక్ష నగదు బహుమతి ప్రకటించారు.

తన్మయ్ సెంచరీ

హైదరాబాద్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

నాగ్‌పూర్ : తన్మయ్ అగర్వాల్ (136, 232 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగాడు. సివి మిలింద్ (38), హిమతేజ (31), వరుణ్ గౌడ్ (24), రాహుల్ (26) సైతం రాణించటంతో విదర్భతో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 326/10 పరుగులు చేసింది. విదర్భపై తొలి ఇన్నింగ్స్‌లో 136 పరుగుల ఆధిక్యం సాధించింది. విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 19.5 ఓవర్లలో 56/2తో ఆడుతోంది. ఓపెనర్ అథర్వ (20 నాటౌట్) అజేయంగా నిలువగా.. ధ్రువ్ (23), ఆదిత్య (5) పెవిలియన్ చేరారు. రెండో రోజు ఆట ముగిసేసరికి విదర్భ 80 పరుగుల తొలి ఇన్నింగ్స్ వెనుకంజలో నిలిచింది.



'తండేల్' ట్రైలర్ అద్భుతం : అమీర్‌ఖాన్

నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. తాజాగా ఈ మూవీ తమిళ ట్రైలర్‌ను చెన్నైలో హీరో కార్తి విడుదల చేశారు. శుక్రవారం బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ ఈ మూవీ హిందీ ట్రైలర్‌ను ముంబైలో లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"తండేల్ ట్రైలర్ నాకు చాలా నచ్చింది. ఫెంటాస్టిక్‌గా ఉంది. డైరెక్టర్ చాలా అద్భుతంగా తీశారు. మ్యూజిక్ ఫెంటాస్టిక్‌గా ఉంది. దేవిశ్రీ చేసిన 'డింకచిక డింకచిక..' సాంగ్ నా ఫేవరెట్. ఈ ట్రైలర్‌లో హార్ట్ టచింగ్ ఎమోషన్స్ ఉన్నాయి. చైతన్య అద్భుతమైన యాక్టర్. ఐడియల్ కోస్టార్. తనతో వర్క్ చేయడం చాలా అమెజింగ్ ఎక్స్‌పీరియన్స్. సాయి పల్లవి కూడా చాలా మంచి పెర్ఫార్మర్. అల్లు అరవింద్ నాకు బ్రదర్ లాంటి వారు. ఆయన నిర్మించిన ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించాలి' అని తెలిపారు.

'సాయి పల్లవితో చేసిన 'లవ్ స్టోరీ' ట్రైలర్‌ని అమీర్ ఖాన్ చూసి చాలా బాగుందని మెసేజ్ పెట్టారు. ఆ సినిమా పెద్ద హిట్ అయ్యింది. ఇప్పుడు ఈ ట్రైలర్‌ని కూడా ఆయనే లాంచ్ చేయడం చాలా బలాన్ని ఇచ్చింది. ఆయన ట్రైలర్ లాంచ్ చేయడం నాకు మ్యాజికల్ మూమెంట్. 'లాల్ సింగ్' సినిమా అమీర్‌తో చేయడం నాకు గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఇదొక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. శ్రీకాకుళం వెళ్లి అక్కడ మత్స్యకారుల్ని కలిశాను. వాళ్ళు చెప్పిన సంఘటనలు విన్నప్పుడు ఈ సినిమా నాకు ఎంత ఛాలెంజింగ్‌గా ఉంటుందో అర్థమైంది. ఇలాంటి కథలు యాక్టర్స్‌కి చాలా అరుదుగా వస్తాయి. ఇది నాకు ఒక పెద్ద అవకాశం. ఇలాంటి సినిమాల్లో పార్ట్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. నన్ను ట్రస్ట్ చేసిన అరవింద్‌కి థ్యాంక్స్. ఆయనతో చేసిన '100% లవ్' నా కెరీర్‌లో ఒక టర్నింగ్ పాయింట్. 'తండేల్' కూడా మరో టర్నింగ్ పాయింట్ అవుతుందని భావిస్తున్నాను. చందు చాలా అద్భుతంగా సినిమాని తీశాడు. దేవిశ్రీ పాటలు ఇప్పటికే చార్ట్ బస్టర్స్ అయ్యాయి. సాయి పల్లవి అద్భుతంగా నటించింది. మీరంతా ఈనెల 7న సినిమాని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను' అని నాగచైతన్య చెప్పారు.

నవచిత్రం

ఆహాలో 'కాఫీ విత్ ఏ కిల్లర్'



ఆర్ పి పట్నాయక్ కథ, రచనా దర్శకత్వంలో సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత సతీష్ నిర్మించిన చిత్రం 'కాఫీ విత్ ఏ కిల్లర్'. ఆహా ఓటీటీలో ఈ సినిమా ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. టెంపర్ వంశీ, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ, 'రెండు గంటలపాటు మిమ్మల్ని ఎక్కడికి కదలకుండా చేసే ఒక ప్రత్యేకమైన చిత్రంగా ఉండబోతుంది. తిరుమల నాగ్ డైలాగ్స్ చాలా బాగుంటాయి. శ్రీనివాస్ రెడ్డి పాత్ర ఎంతో అద్భుతంగా ఉండబోతుంది' అని తెలిపారు.

హీరో, హీరోయిన్ లేకుండా కథే హీరో అయితే ఎలా ఉంటుందనే కోణంలో ఈ కథ రాశాం. హీరో, హీరోయిన్లు ఉండరు..కానీ విలన్ ఉంటాడు. ఈ సినిమాను మొత్తం దగ్గరుండి చూసుకున్నది మా అన్నయ్య గౌతమ్ పట్నాయక్. థియేటర్లలో రిలీజ్ చేయమని చాలా మంది అడిగినప్పటికీ కావాలనే ఈ సినిమాని ఆహా ఓటీటీ ద్వారా విడుదల చేస్తున్నాం' అని దర్శకుడు ఆర్ పి పట్నాయక్ చెప్పారు.

శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా 'ఛావా'



విక్కీ కౌశల్, రష్మిక మందన్న

విక్కీ కౌశల్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛావా'. దినేష్ విజన్ నిర్మాతగా లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఈనెల 14న రిలీజ్ కాబోతోంది.

ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. ఈ చిత్రంలోని 'జానే తూ..' అంటూ సాగే సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను చిత్ర బృందం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించింది.

అయితే కాలికి గాయమై నొప్పితో ఉన్నప్పటికీ కథానాయిక రష్మిక మందన్న వీల్‌చైర్‌లో ఈ ఈవెంట్‌కి రావడం అందర్నీ సర్‌ప్రైజ్ చేసింది.

ఈ సందర్భంగా హీరో విక్కీ కౌశల్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో ప్రిపేర్ అయ్యాను. యుద్ధాలు, గుర్రపు స్వారీల్లో శిక్షణ తీసుకున్నాను. అన్నింటికిమించి ఛత్రపతి శంభాజీ మహారాజ్ అనే పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం, నా మనసుని ఆ పాత్ర కోసం సన్నద్ధం చేసుకోవడం సవాలుగా అనిపించింది. దర్శకుడు లక్ష్మణ్ మొదటి నుంచి కూడా నన్ను పాత్ర పేరుతోనే పిలుస్తుంటారు. నేను ఈ పాత్రను పోషించగలను అనే నమ్మకాన్ని అలా ఆయన నాలో ముందు నుంచీ కలిగిస్తూనే వచ్చారు. నిజమైన యోధుల కథను చెబుతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఇంత గొప్ప చిత్రాన్ని నిర్మించిన దినేష్ విజన్‌కి, తెరకెక్కించిన లక్ష్మణ్‌కి ధన్యవాదాలు. రెహమాన్ సంగీతం సినిమా స్థాయిని పెంచేసింది. ఇలాంటి పాత్ర నాకు దొరకడం నా అదృష్టం. జీవితంలో ఒక్కసారే ఇలాంటి అవకాశం వస్తుంది. ఈ మూవీ చాలా గొప్పగా వచ్చింది. అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

'ఈ చిత్రంలో మాటలకు అందని భావం ఉంటుంది. అలాగే ఓ దైవత్వం ఉంటుంది, అంతులేని ప్రేమా ఉంటుంది. అందుకే ఈ చిత్రాన్ని చేయాలని ఫిక్స్ అయ్యా. ఫిక్షనల్ క్యారెక్టర్ల విషయంలో కొన్నింటిని మేనేజ్ చేయొచ్చు. కానీ నిజ జీవిత పాత్రలకు సంబంధించి ఎలాంటి మార్పులు చేయలేం. అందుకే మహరాణి యేసుబాయి పాత్ర కోసం చాలా కష్టపడ్డాను. ఈ మూవీని చూసిన ప్రతీ సారీ నేను ఏడ్చేస్తాను. అంత అద్భుతంగా ఉంటుంది. రెహమాన్ మ్యూజిక్, 'జానే తూ..' పాట అందరినీ మెస్మరైజ్ చేస్తుంది. విక్కీ చుట్టూ అద్భుతమైన ఆరా ఉంటుంది. ఆయన పక్కన నిలబడితేనే ఓ మ్యాజిక్ జరుగుతుంది. ఛావా పాత్రకు విక్కీ అద్భుతంగా సెట్ అయ్యారు. అందుకే విక్కీని లక్ష్మణ్ ఈ పాత్రకు తీసుకున్నారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని రష్మిక మందన్న చెప్పారు.



ఆరాధ్య దేవి

ఎగిరే గువ్వలాగా..

దర్శకుడు రామ్ గోపాల్ వర్మ నిర్మించిన నయా సినిమా 'శారీ' (టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ అనేది ట్యాగ్‌లైన్'. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్జీవి-ఆర్వి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో, హీరోయిన్లుగా పలు నిజ జీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా దీన్ని రూపొందించారు. తాజాగా శుక్రవారం ఆర్‌జీవీ మ్యూజిక్ డెన్ ద్వారా ఈ చిత్రంలోని సెకండ్ లిరికల్ వీడియో సాంగ్ 'ఎగిరే గువ్వలాగా...'ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆర్‌జీవీ మాట్లాడుతూ,'ఈ పాట రాకేష్ పనికెళ్ళ ట్యూన్ చేసి లిరిక్ కూడా తనే ఇచ్చాడు. పాటలో సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సింగర్ సాయి చరణ్ ఈ పాటను అద్భుతంగా పాడారు' అని తెలిపారు.

"మా చిత్రంలోని తొలి లిరికల్ సాంగ్ 'ఐ వాంట్ లవ్'కి విశేష స్పందన లభించింది. 'ఎగిరే గువ్వలాగా...' పాటను హిందీ, తమిళ, మళయాళ భాషల్లో కూడా రిలీజ్ చేశాం. ప్రస్తుతం సెన్సార్ జరుగుతోంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం' అని నిర్మాత రవి శంకర్ వర్మ చెప్పారు.



విశ్వక్‌సేన్, ఆకాంక్ష శర్మ

మాస్ బీట్‌తో 'ఓహో.. రత్తమ్మ'

విశ్వక్‌సేన్ నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. సోను మోడల్, లైలాగా రెండు డిఫరెంట్ లుక్స్‌లో విశ్వక్‌సేన్ కనిపించడం అందరిలోనూ చాలా క్యురియాసిటీ పెంచింది. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మించారు. శుక్రవారం థర్డ్ సింగిల్ 'ఓహో.. రత్తమ్మ'ను మేకర్స్ రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన ఈ పాట అందరినీ అలరించే మాస్ ఫీస్ట్ అందిస్తుంది. పెంచల్ దాస్, మధుప్రియల జానపద శైలి వోకల్స్ ఈ పాటకు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. సోషల్ మీడియా సెన్సేషనల్ ట్రాక్ కోయారే కోయ్ కోయ్ చేర్చడం పాటకు మరింత ఎంటర్‌టైన్‌మెంట్‌ని యాడ్ చేసింది. విశ్వక్‌సేన్ ట్రెడిషనల్ నుంచి అల్ట్రా-స్టైలిష్ వరకు వివిధ రకాల లుక్స్‌తో ఆకట్టుకున్నారు. ఆకాంక్ష శర్మ తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. కొరియోగ్రఫీ వైబ్‌ను మరింతగా పెంచింది. ఇది అభిమానులకు పూర్తి స్థాయి మాస్ విందు అందించే పాట. ఈనెల 14న ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.